ఆధునిక చిత్రకళా రీతులు
రూ॥150/-
పేజీలు:150

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 208 | ఆదివారం | 28-06-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## ‘విబి-జి రామ్ జీ’ని అంగీకరించబోం



- భారత సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న ప్రత్యక్ష దాడి
- రాజ్యాంగానికి విరుద్ధంగా చట్టంలోని నిబంధనలు
- అవసరమైతే ‘సుప్రీం’ను ఆశ్రయిస్తాం
- మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) (విబి–జి రామ్‌జి) చట్టం–2025 కేవలం ఉపాధి హామీ చట్టంలో సవరణ కాదని, భారత సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని మంత్రి వర్గ ఉప సంఘం ఛైర్మన్, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రాల అధికారాలను హరిస్తూ, గ్రామీణాభివృద్ధిలో రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేసే ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ తరువాయి 8లో



# పేదల ఇళ్ల కూల్చివేతపై వామపక్షాల కన్నెర్ర

## హనుమకొండలో వేలాది మందితో భారీ నిరసన ప్రదర్శన

- అమరవీరుల స్థూపం జంక్షన్‌లో వామపక్ష నేతలు, కార్యకర్తల బైఠాయింపు
- ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పెద్దపెట్టున నినాదాలు
- ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్
- కూనంనేని, జాన్ వెస్లీ, గుమ్మడి నర్సయ్య సహా వామపక్ష నేతల అరెస్టు
- అడ్డుకున్న కార్యకర్తలు
- పోలీసులు, వామపక్ష నేతల మధ్య తోపులాట
- విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో పేదల ఇళ్ళ పోరాటం కొనసాగిస్తామని సాంబశివరావు ప్రకటన

“ పేదల ఇళ్ళ స్థలాల సాధన పోరాటం పోరాటాల గడ్డ అయిన వరంగల్ నుండే ప్రారంభిస్తున్నాం. ఇది రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ప్రభుత్వం దిగి వచ్చే వరకూ కొనసాగుతుంది. కమ్యూనిస్టులు నిరంతరం పేదల పక్షానే నిలబడతారు. విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో పేదల ఇళ్ళ స్థలాల సాధన పోరాటం కొనసాగిస్తాం.

– కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హనుమకొండ

పేదల ఇళ్ళ కూల్చివేతపై వామపక్షాలు కన్నెర్ర చేశాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాలలో పేదల గుడిసెలను ప్రభుత్వం కక్ష గట్టి ఇళ్ళ కూల్చివేతకు పాల్పడటంపై శనివారం హనుమకొండ జిల్లా కేంద్రంలో భారీ ఆందోళన నిర్వహించారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల వామపక్షాల ఆధ్వర్యంలో వేలాదిమందితో నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఏకశిలా పార్కు వద్ద ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించిన అనంతరం హనుమకొండ కలెక్టరేట్ వరకు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ ఎంఎల్ (మాస్ లైన్) మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితర రాష్ట్ర, జిల్లాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శన ఏకశిలా పార్క్ నుండి కాళోజీ సెంటర్ మీదుగా సుబేదారి అమరవీరుల స్థూపం వరకు చేరుకున్నది. అనంతరం అమర వీరుల స్థూపం జంక్షన్ లో వామపక్షాల నాయకులు, తరువాయి 12లో



కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే

## ముందుగా గుర్తింపు సంఘం ఎన్నికలు

- ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరం
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసి కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. ఆర్‌టిసి సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావుతో పాటు సీనియర్ ఐఎఎస్ అధికారులు ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తరువాయి 8లో



## రాజకీయ లబ్ధికే ‘సర్’పై తప్పుడు ప్రచారం

- అర్హులకు ఓటు
- డూప్లికేట్, చనిపోయిన వారి పేర్లు తొలగించడమే ప్రధాన ఉద్దేశం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియ ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఉద్దేశించిన రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా తరువాయి 12లో

ఫ్లాట్ల అప్పగింతలో జాప్యం జరిగితే

## పరిహారం కోరొచ్చు

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ 2016నాటి ఉత్తర్వు కొట్టివేత



**న్యూఢిల్లీ :** ఫ్లాట్ కొనుగోలు చేసిన తర్వాత కూడా ఆలస్యానికి పరిహారం కోరే హక్కు కొనుగోలుదారులకు ఉంటుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫ్లాట్ స్వాధీనం పొందిన తర్వాత కూడా దాని అప్పగింతలో జరిగిన జాప్యాన్ని నిరసిస్తూ పరిహారం కోరుతూ గృహ కొనుగోలుదారుడు తన దావాపై తీర్పుకోరవచ్చునని సుప్రీంకోర్టు పేర్కొంది. వస్తువును అప్పగించడంలో ఆలస్యం కారణంగా సేవలో లోపం జరిగిందని ఆరోపిస్తూ ఫిర్యాదు చేసిన సమయంలో అతను ఎటువంటి అభ్యంతర ం లేకుండా దానిని అప్పటికే స్వాధీనం చేసుకున్నందున, అతడు వినియోగదారుడు కాదన్న జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సిడిఆర్‌సి) 2016నాటి ఉత్తర్వును అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. జనవరి 2003లో కూపెరా గ్రూప్ హౌసింగ్ సొసైటీలో సభ్యుడుగా చేరి ఫ్లాట్ కేటాయింపును పొందిన ఒక గృహ కొనుగోలుదారు ఎన్‌సిఆర్‌డిసి ఉత్తర్వును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వు జారీచేసింది. స్వాధీనాన్ని ఆలస్యంగా తరువాయి 8లో

## మళ్లీ మొదటికే!

- ఇరాన్ డ్రోన్లు, క్షిపణి నిల్వకేంద్రాలపై అమెరికా దాడులు
- బహ్రైన్ సహా గల్ఫ్‌లో అమెరికా కేంద్రాలపై ఐపిఆర్‌జి ప్రతిదాడులు
- ఒప్పందాన్ని మీరే ఉల్లంఘించారంటూ పరస్పర నిందలు, వాగ్వాదం
- నౌకలన్నీ మేం చెప్పిన దారిలో వెళ్ళాల్సిందే : ఇరాన్ హెచ్చరిక
- అమెరికా,గల్ఫ్ అరబ్ దేశాల తిరస్కృతి

**దుబాయ్:** అమెరికా–ఇరాన్ పరస్పర దాడులతో కథ మళ్ళీ మొదటికొచ్చింది. హోర్ముజ్ జలసంధిలో తమ ట్యాంకర్‌పై నాలుగు డ్రోన్లతో దాడి చేసిందని ఆరోపించిన అమెరికా సైనిక దళాలు ఇరాన్‌లోని డ్రోన్లు–క్షిపణి నిల్వ కేంద్రాలు, కోస్తా తీరప్రాంతంలో ఉన్న రాడార్ల వ్యవస్థలపై దాడులు చేశాయి. దీంతో ఆగ్రహించిన ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్ (ఐపిఆర్‌జి) బలగాలు గల్ఫ్ ప్రాంతంలో బహ్రైన్ సహా అమెరికా సైనిక స్థావరాలపై ఎదురు దాడులు చేసింది. సిరిక్ ద్వీపంపై అమెరికా సైనిక బలగాలు దాడులు చేసి నష్టం చేశాయని, అందుకే గల్ఫ్‌లో ప్రతీకార



దాడులు చేశామని ఇరాన్ ప్రకటించింది. దీంతో అమెరికా–ఇరాన్ మధ్య ఈ నెల 17–18 తేదీలలో ‘‘ఇస్లామాబాద్ ఒప్పందం’’ పై సంతకాల తర్వాత పరస్పర అవిశ్వాసాలతో ఒప్పందం గాలిలో దీపంలా తరువాయి 8లో

## ఆరెంజ్ అలర్ట్

ఉత్తర, తూర్పు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక

వారం రోజుల పాటు విస్తారంగా వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్న నేపథ్యంలో తెలంగాణలో రానున్న ఏడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఉత్తర, తూర్పు జిల్లాల్లో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశమున్నందున రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామన్నారు. శనివారం, ఆదివారం ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, తరువాయి 12లో



ప్రపంచమంతా ఖండిస్తున్నా

## గాజా మారణహోమంపై భారత్ మౌనమెందుకు?

- మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ధ్వజం
- జస్టిస్ మురళీధర్ నివేదికను ఉటంకిస్తూ ‘ఇండియన్ ఎక్స్‌ప్రెస్’లో వ్యాసం

**న్యూఢిల్లీ :** మోదీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ, ఇజ్రాయెల్ ’గాజా మారణహోమం’ విషయంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న స్పందనారహిత నిశ్శబ్దం, నిష్క్రియాతత్వ కేవలం నైతికంగా ఖండించదగినవే కాకుండా, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కూడా సమర్థించలేనివని మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పాలస్తీనా, ఇరాన్, విశాల మధ్యప్రాచ్యంలోని తన చారిత్రక మిత్రదేశాలకు భారతదేశం దూరమైందని, ప్రపంచ ప్రజాభిప్రాయానికి కూడా దూరమైందని, అదే సమయంలో భయంకరమైన ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ వస్తున్న పాకిస్థాన్‌ను మధ్యవర్తి స్థానాన్ని ఆక్రమించుకోవడానికి అవకాశం కలిగేలా చేసిందని ఆరోపించారు.‘ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ పత్రికలో రాసిన ఒక వ్యాసంలో, ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించడాన్ని ఒక ‘దిగ్భ్రాంతికరమైన వ్యూహాత్మక నిర్ణయం’గా ఆమె పేర్కొన్నారు. పశ్చిమ ఆసియాపై సోనియాగాంధీ ఏడాది కాలంలో రాసిన నాలుగవ వ్యాసం ఇది. మార్చిలో ఆమె ఇరాన్ యుద్ధంపై ఒక వ్యాసం రాశారు. అందులో, ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ లక్షిత హత్యపై మోదీ ప్రభుత్వం మౌనం వహించడం తటస్థత కాదని, అది బాధ్యతారాహిత్యమని, ఇది భారతదేశ విదేశాంగ విధానం దిశ, విశ్వసనీయతపై తీవ్రమైన సందేహాలను రేకెత్తిస్తుందని ఆమె పేర్కొన్నారు.

‘‘అత్యంత క్రూరంగా లక్ష్యంగా చేసుకున్న పాలస్తీనియన్‌ల పిల్లల పక్షాన భారత జాతీయతా స్ఫూర్తి గళం విప్పాలని, అలాగే గాజాలో ఇజ్రాయెల్ పాలన సాగిస్తున్న ‘జాతి నిర్మూలన చర్యలకు’, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ‘లక్షలాది పాలస్తీనియన్ కుటుంబాలను క్రూరంగా స్థానభ్రంశం చేసి, ఆస్తులు కోల్పోయేలా చేయడానికి’ వ్యతిరేకంగా ప్రపంచ ప్రజాభిప్రాయానికి భారతదేశం స్పందించాలని జాతీయ ప్రయోజనాల అంచనాలు కోరుతున్నాయి’’ అని ఆమె తన తాజా వ్యాసంలో కోరారు. ‘మోదీ ప్రభుత్వం కొనసాగిస్తున్న మౌనాన్ని హేతుబద్ధంగా గానీ, నైతికంగా గానీ వివరించలేము,’ అని ఆమె అన్నారు. ‘గాజాపై భారత్ మౌనం కొనసాగుతుంటే, ప్రపంచం గళం విప్పుతూనే ఉంది’ తరువాయి 8లో

## గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి



- వరదల సన్నద్ధతలో శాఖల సమన్వయం ముఖ్యం
- పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని పారిశుద్ధ్య పనులు సాగాలి : మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

గోదావరి వరదల నేపథ్యంలో ఆస్థి, ప్రాణ నష్టం వాటిల్లకుండా సమన్వయంతో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సమర్థవంతంగా పనిచేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఒసి సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్‌పి రోహిత్ రాజ్, ఎంఎల్‌ఏలు డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, రామ్‌దాస్ నాయక్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ మూడ్ గణేష్, తరువాయి 12లో







## ఎముకలు విరిగి..గాయపడి..

ఫిఫా ప్రపంచకప్ లాంటి మెగా ఈవెంట్స్‌లో ఆటగాళ్లు గాయపడడం సహజమే. అయితే, ఇప్పుడు జరుగుతున్న వరల్డ్ కప్‌లో ఆటగాళ్లపై పెరుగుతున్న శారీరక భారం, గాయపడడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా కొన్ని మ్యాచ్‌లలో చోటుచేసుకున్న తీవ్రమైన గాయాలు టోర్నమెంట్ కఠినతను మరోసారి గుర్తుచేశాయి. వీటిలో 'బోన్ స్నాప్' (ఎముక విరిగిన శబ్దం వినిపించేంత తీవ్ర గాయం) వంటి సంఘటనలు అభిమానులను, వైద్య నిపుణులను కలవరపెడుతున్నాయి. ప్రపంచకప్ వంటి అత్యున్నత స్థాయి టోర్నమెంట్‌లో ఆటగాళ్లు అత్యంత వేగంతో, తీవ్ర ఒత్తిడిలో పోటీపడుతుంటారు. వరుస మ్యాచ్‌లు, తక్కువ విశ్రాంతి సమయం, శారీరక ఘర్షణలు, మానసిక ఒత్తిడి కారణంగా గాయాల ప్రమాదం పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఆటగాళ్ల కాళ్లు లేదా కీళ్లపై తీవ్రమైన ప్రభావం పడటంతో ఎముకలు విరిగే ప్రమాదం కూడా ఉంటుంది. జెస్సే మార్ష్ జట్టుకు సంబంధించిన 'బోన్ స్నాప్' సంఘటన ప్రత్యేకంగా వార్తల్లో నిలిచింది. అందువల్ల వైద్య బృందాలు వెంటనే స్పందించి, అత్యవసర చికిత్స అందించడం అత్యంత కీలకం. ఈ సంఘటనలు ఆధునిక ఫుట్‌బాల్‌లో పెరుగుతున్న పోటీ తీవ్రతను ప్రతిబింబిస్తున్నాయి. ఒకవైపు అభిమానులకు ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లు లభిస్తున్నప్పటికీ, మరోవైపు ఆటగాళ్ల ఆరోగ్యం, భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, భవిష్యత్తులో మ్యాచ్‌ల మధ్య ఎక్కువ విశ్రాంతి సమయం, మెరుగైన ఫిట్‌నెస్ నిర్వహణ, గాయాల నివారణ కార్యక్రమాలు అవసరం.



## జేబులు ఖాళీ




ఒలింపిక్స్ తర్వాత, ప్రపంచంలోనే అత్యంత భారీ క్రీడా వేడుకగా ఫిఫా ప్రపంచ కప్‌ను పేర్కొంటారు. అత్యధిక మంది తిలకించే టోర్నీకి ఇది రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. అలాంటి మెగా ఈవెంట్‌ను జీవితంలో ఒక్కసారైనా ప్రత్యక్షంగా తిలకించాలన్నది ప్రతి ఫుట్‌బాల్ అభిమాని కోరిక. అయితే, ఉత్సాహాన్ని భారీ ఖర్చులు ఆవిరి చేస్తున్నాయని అభిమానులు వాపోతున్నారు. ఈసారి టోర్నమెంట్‌కు సంబంధించిన భారీ ఖర్చులు అనేకమంది అభిమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా మ్యాచ్‌ల కోసం స్టేడియాలకు వచ్చే ప్రేక్షకులకు పార్కింగ్ చార్జీలు పెద్ద భారంగా మారాయి. కొన్ని వేదికల వద్ద పార్కింగ్ రుసుములు 99 డాలర్ల నుంచి 300 డాలర్ల వరకు ఉండటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీనిని బట్టి, బస, భోజనం తదితరా ఖర్చులను ఊహించుకోవచ్చు. టికెట్ల ధరలు, ప్రయాణ ఖర్చులు, హోటల్ బస, ఆహార వ్యయాలు ఇప్పటికే అధికంగా ఉన్న పరిస్థితిలో ఈ అదనపు ఖర్చులు అభిమానుల బడ్జెట్‌ను మరింత ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ముఖ్యంగా 28 సంవత్సరాల తర్వాత ప్రపంచకప్‌కు అర్హత సాధించిన స్కాట్‌లాండ్ జట్టు అభిమానులు ఈ పరిస్థితిని తీవ్రం గా ఇబ్బంది పెడుతున్నది. తమ జట్టును ప్రత్యక్షంగా చూడాలనే కలతో అమెరికా, కెనడా, మెక్సికోలకు చేరుకున్న అనేకమంది అభిమానులు ఊహించని ఖర్చుల కారణంగా డీలపడుతున్నారు. కొంత మంది అభిమానులు ఖరీదైన టికెట్లకు డబ్బులు చెల్లించిన తర్వాత, ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవాల్సి వచ్చింది. మరికొందరు రీఫండ్‌ల కోసం ప్రయత్నించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రపంచకప్‌ను జీవితంలో ఒక్కసారి వచ్చే అవకాశంగా భావించిన అభిమానులకు ఇది ఒక చేదు అనుభవంగా మారుతోంది. క్రీడా విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ప్రపంచకప్ వంటి అంతర్జాతీయ టోర్నమెంట్లు ప్రపంచవ్యాప్తంగా అభిమానులను ఆకర్షించాలంటే ఖర్చులు అందుబాటులో ఉండటం కూడా అంతే కీలకం. లేదంటే భవిష్యత్తులో ప్రపంచకప్ అనుభవం సాధారణ అభిమానులకు కాకుండా, అధిక ఆదాయం ఉన్నవారికే పరిమితమయ్యే ప్రమాదం ఉంది.

## చిత్రమైన సెలబ్రేషన్లు..



ఈసారి ఫిఫా ప్రపంచకప్‌లో కేవలం మ్యాచ్‌లే కాదు, ఆటగాళ్ల గోల్ సంబరాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యం గా మాథ్యూస్ కున్హా , మాటియాస్ గలర్జా వంటి ఆటగాళ్లు చేసిన విచిత్రమైన గోల్ సెలబ్రేషన్లు అభిమానుల దృష్టిని ఆకర్షించాయి. ఫుట్‌బాల్‌లో గోల్ చేసిన తర్వాత ఆటగాళ్లు ఆనందాన్ని వ్యక్తపరచడం సహజం. అయితే ఈ ప్రపంచకప్‌లో కొందరు ఆటగాళ్లు సంప్రదాయ సెలబ్రేషన్లకు భిన్నంగా వినూత్నమైన, సరదాగా కనిపించే చర్యలతో అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. మాథ్యూస్ కున్హా తన గోల్ తర్వాత చేసిన అసాధారణ హావభావాలు, నృత్య కదలికలు సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అయ్యాయి. అలాగే మాటియాస్ గలర్జా తన ప్రత్యేక శైలిలో చేసిన సంబరాలు కూడా చర్చనీయాంశంగా మారాయి. ఇలాంటి సెలబ్రేషన్లు కేవలం ఆనందాన్ని వ్యక్తపరచడానికే కాకుండా, ఆటగాళ్ల వ్యక్తిత్వాన్ని, వారి సృజనాత్మకతను కూడా ప్రతిబింబిస్తాయి. గతంలో కూడా అనేక ప్రపంచకప్‌లలో ప్రత్యేక గోల్ సంబరాలు అభిమాను ల మదిలో చిరస్థాయిగా నిలిచాయి. ఈసారి కూడా అలాంటి క్షణాలు టోర్నమెంట్‌కు అదనపు ఆకర్షణను తీసుకొస్తున్నాయి. సోషల్ మీడియా యుగంలో ఇటువంటి సంఘటనలు మరింత వేగంగా వైరల్ అవుతున్నాయి. కొన్నిసార్లు గోల్ కంటే ఆ తర్వాతి సెలబ్రేషన్‌నే ఎక్కువమంది గుర్తుంచుకుంటారు. అందుకే ఆటగాళ్లు తమ ప్రత్యేక గుర్తింపును చాటుకునేందుకు వినూత్న మార్గాలను ఎంచుకుంటున్నారు.

## 'లింక్డిన్'తో అవకాశం



ఫుట్‌బాలర్ ఎవరైనా సరే, అంతర్జాతీయ వేదికలపై తన దేశానికి ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటాడు. ప్రపంచ కప్ సాకర్‌లో ఆడే అవకాశం లభిస్తే, జీవితం ధన్యమవుతుందని అనుకుంటాడు. అలాంటి అరుదైన అవకాశం వృత్తిపరమైన సామాజిక మాధ్యమ వేదిక 'లింక్డిన్' ద్వారా లభిస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. కానీ, ఆ అదృష్టం నెదర్లాండ్స్‌కు చెందిన రాబర్టో 'పికో' లోప్స్‌కు దక్కింది. తమ జట్టుకు ఒక సెంటర్ బ్యాక్ (డిఫెన్స్ వింగ్) ఆటగాడు అవసరమైన వెతుకుతున్న ఆఫ్రికా దేశమైన కేప్ వెర్డే సాకర్ అధికారులు, సంప్రదాయ స్కౌటింగ్ విధానాలను అనుసరించకుండా ఒక వినూత్న మార్గాన్ని ఎంచుకున్నారు. ఈ క్రమంలోనే లింక్డిన్‌లో కనిపించిన ఒక ఆటగాడికి తమ దేశ మూలాలు ఉన్నాయని కనుగొన్నారు. వెంటనే అతనిని సంప్రదించారు. ఈసారి ప్రపంచ కప్ సాకర్ చాంపియన్‌షిప్‌లో కేప్ వెర్డే జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించాల్సిందిగా ఆహ్వానం పంపారు. రాబర్టో పూర్వీకులు కేప్ వెర్డే నుంచి నెదర్లాండ్స్‌కు తరలి వెళ్లారు. అయితే, అతని మూలాలను గుర్తించిన అధికారులు అతనికి జట్టులో అవకాశం కల్పించారు. అనుకోని అదృష్టానికి రాబర్టో తెగ సంతోష పడుతున్నాడు.

– బిఎస్ఎస్ మైత్రేయి

# అయోధ్య రాముని ఇంట్లో దొంగలు

అయోధ్య రాముడు హిందువులకు ఆరాధ్యుడు. గుణాభిరాముడిగా, ఆదర్శ పురుషుడుగా రామాయణ గాథ ఆవిష్కరించింది – అదే ప్రజల విశ్వాసం. ఆధునిక కాలంలో రామజన్మభూమి పై ఆందోళనతో బిజెపి సహా ఆర్ఎస్ఎస్ పరివారం వివాదాలు అధిగమించి అయోధ్యలో బాలరాముని ఆలయం నిర్మించి హిందూ మత గురువులతో కాకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తో విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఉత్సవం నిర్వహించింది. చుట్టుపక్కల రాష్ట్రాలనుంచి ఉచిత తీర్థయాత్రలు ఏర్పాటు చేసింది. రాముడు హిందువుల ఆత్మ అని ప్రబోధించే పెద్ద మనుషులు ఆలయాన్ని ఎంత ఆరాధనభావంతో, ఎంత కట్టుదిట్టంగా నిర్వహించాలి. ఆలయంలో దొంగలు ప్రవేశించారని, భక్తులు పవిత్రమైన మనస్సులతో బాలరామునికి సమర్పిస్తున్న కానుకలు – నగదు, వెండి, బంగారం వగైరా దోచుకుపోతున్నారని ఆరోపణరావటం ఎంతటి మహాపచారం! ఏ రాజకీయ నాయకుడో, సామాజిక కార్యకర్తో ఈ ఆరోపణ చేసి ఉంటే ఈ పాటికి చీల్చిచెండాడేవారు. రామజన్మభూమి ఉద్యమంతో సంబంధం కలిగిన హిందుత్వ నాయకుడు సంతోష్ దూబె ఈ ఆరోపణ చేయటం, రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సీనియర్ సభ్యులు చంపత్‌రాయ్, అనిల్ మిశ్రా, గోపాల రావు, అలాగే ఉద్యోగి రాం శంకర్ యాదవ్‌లను నేరస్థులుగా వ్రేలెత్తి చూపటంతో ఆర్ఎస్ఎస్, బిజెపి పాదాల కింద భూమి కంపించినంత పనైంది. ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్‌దాస్ ఈ ఆరోపణను ఖండిస్తూనే, కాలహరణం కాటువేస్తుందని భయపడ్డారో ఏమో వెంటనే కేసు పోలీసులకు నివేదించి ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేశారు. సంతోష్ దూబె ఫిర్యాదుపై అయోధ్య పోలీసులు ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేయలేదు. ''రామాలయ రక్షణ, భక్తుల విశ్వాసం కాపాడే బాధ్యతను ఈ వ్యక్తులకు అప్పగించబడింది. అయితే వీరు దేవాలయాన్ని లూటీ చేశారు'' అని దూబె నిందించాడు. కాగా తీర్థక్షేత్ర ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసుకున్నారు. ఈ చోరీ వ్యవహారం హిందువుల మత మనోభావాలను తీవ్రంగా గాయపరిచింది. ఉన్నతస్థాయి హిందూమత గురువులు, సన్యాసులు ఆర్ఎస్ఎస్, బిజెపిలను తీవ్రంగా విమర్శించారు. శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద్ సరస్వతి ఆలయ ట్రస్ట్ నిర్వహణ తీరును తప్పుబట్టారు. పలుకుబడి గల వ్యక్తులను ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు. పాలకపార్టీ హిందూత్వ 'నకిలీ' అంటూ, ఎఫ్ఐఆర్‌లో కింది స్థాయి ఉద్యోగులనే దోషులుగా చేర్చటాన్ని ప్రశ్నించారు.

39 రోజుల్లో 74 చోరీలు జరిగాయన్న సిట్ తాత్కాలిక నివేదికననుసరించి 8మంది ఉద్యోగులను సస్పెండ్ చేయగా వారిని పోలీసులు అరెస్టు చేశారు. హిందూత్వవాదుల ఒత్తిడి కింద ఆత్మరక్షణ చర్యగా కావచ్చు – ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, మరో ట్రస్టీ అనిల్ మిశ్రా రాజీనామా చేశారన్న వార్తలు శుక్రవారం సాయంత్రం గుప్పుమన్నాయి. విశ్వహిందూ పరిషత్ ఆదేశంపై చంపత్‌రాయ్ రాజీనామా చేశారనటాన్ని విహెచ్‌పి త్రోసిపుచ్చింది. రాజీనామా పత్రాలు అందినట్లు ట్రస్టు శనివారం ధృవీకరించింది. వచ్చేనెల 12న సమావేశంలో ట్రస్టు వాటిని పరిశీలిస్తుంది. చంపత్‌రాయ్ ఈ ఆలయ ఉద్యమం నాటినుంచి నిర్మాణం, నిర్వహణలో కీలకపాత్ర పోషించారు. అతను ఆర్ఎస్ఎస్ ప్రచారక్, విహెచ్‌పి సీనియర్ నాయకుడు. 2019లో సుప్రీం కోర్టు తీర్పు తర్వాత ఆలయ నిర్మాణం, మేనేజిమెంట్ బాధ్యతలు చేపట్టారు. బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగిన రెండున్నర ఏళ్లలోనే చంపత్ రాయ్ ఆలయ విరాళాల్లో అవినీతి, భక్తుల కానుకల దొంగతనాల వివాదంలో కేంద్రబిందువు అయినారు. గతంలో అప్పుడప్పుడూ వచ్చిన నిధుల దుర్వినియోగ ఆరోపణలను ఆయన గట్టిగా ఖండించారు. 2021లోనే దేశవ్యాప్తంగా నిధుల సేకరణ కార్యక్రమం రాయ్ గుర్తింపును, స్థాయిని పెంచింది. నిధుల గోల్‌మాల్ ఆరోపణలే కాదు, భూముల కొనుగోలులో అక్రమాల ఆరోపణలు కూడా ఉన్నాయి.

సిట్ తాత్కాలిక నివేదిక నిర్ధారణలతో బిజెపి, ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి పరిస్థితి కుడితిలోపడ్డ ఎలుక చందంగా ఉంది. ఇప్పుడు ఆదిత్యనాథ్ హడావుడి అంతా వచ్చే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలపై ఈ నిధులు, కానుకల చోరీ ప్రభావం పడకుండా చూడటమే. ఈ ఆలయ నిర్మాణాన్ని జీవిత సాఫల్యంగా భావించే ప్రధాని మోదీ ఇంతవరకు నోరుమెదపకపోవటం ఆశ్చర్యకరం. కొందరు ఉద్యోగులను బాధ్యులను చేసి 'పెద్దలను తప్పించే' ప్రయత్నం జరుగుతోందని అనుమానించబడుతున్నది. వాస్తవాలు బయటకు రావాలంటే రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్‌తో సాధ్యం కాదు. అందువల్ల భక్తుల్లో విశ్వాసం పునరుద్ధరించే నిమిత్తం సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు లేదా సుప్రీంకోర్టు జడ్జి నాయకత్వంలో దర్యాప్తు జరిపించాలి. ఇది కోట్లాదిమంది భక్తుల మనోభావాలతో ముడిపడిన అంశమైనందున సందేహాలకు అతీతంగా దర్యాప్తు జరపాలి. ట్రస్టును ప్రక్షాళన చేయాలి. దాని నిర్వహణలో ధార్మిక సంస్థలకు స్థానం కల్పించాలి. ●

# కమ్యూనిస్టులిప్పుడేమి చేయాలి?



జస్టిస్ చంద్రకుమార్
8978385151

ఈనెల 14వ తారీకు నాడు విజయవాడలో కమ్యూనిస్టుల ఐక్యత గురిం చి ఒక సదస్సు జరిగింది. గతంలో అనేకసార్లు ఇలాంటి సదస్సులు జరిగినా, ఈసారి జరిగిన ఈ సదస్సుకు ఒక ప్రత్యేకత ఉంది. కమ్యూనిస్టు ఉద్యమం గతంలో ఎన్నడూ లేనంతగా ఎదురు దెబ్బలు తిన్న కాలమిది. సుమారు 60 సంవత్సరాల క్రితం సాయుధ పోరాటం ఏకైక మార్గం అని బయలుదేరిన మావోయిస్టులు పూర్తిగా దెబ్బ తిన్నారు. ఆయుధాలు వదిలి బయటకు వచ్చారు. గత కొన్ని దశాబ్దాలుగా మార్క్సిస్టుల నాయకత్వాన ఉన్న బెంగాల్ ,కేరళ ,త్రిపుర వామపక్ష ప్రభుత్వాలు పడిపోయాయి. భారత దేశంలో మార్క్సిజానికి కాలం చెల్లింది, కమ్యూనిస్టు పని అయిపోయిందని కూడా విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఈ సదస్సు జరిగింది. ఆ సదస్సులో నేను ఒక ఉపన్యాసకున్ని.

కమ్యూనిస్టు పార్టీల అభిమానులు, కార్యకర్తలు, మేధావులు, కమ్యూనిస్టు పార్టీలన్నీ విలీనమై ఒకే సంస్థగా మారాలని కోరుకుంటున్న అభిమానులు ఆ సదస్సు నిర్వహించారు. అందరూ కమ్యూనిస్టులు తమకు మార్క్సిజం, లెనినిజం ఆదర్శం అంటారు. ప్రపంచ కార్మికులారా ఐక్యం కండి అనే ప్రఖ్యాత నినాదానికి భిన్నంగా భారత కమ్యూనిస్టులు విడిపోయి భిన్న ఆచరణ జరుగుతుందని ఆవేదన చెందుతున్నారు.

*భారత కమ్యూనిస్ట్ లారా!*

చీలిపోయిన మీరు ఇకనైనా ఒకే పార్టీగా విలీనం కండి. కలిసి ఉండటానికి 1848 'కమ్యూనిస్టు ప్రణాళిక'చాలు. కలిసిన సంస్థ మళ్లీ విడిపోకుండా ఉండటానికి లెనిన్ చూపిన 'కేంద్రీకృత ప్రజాస్వామ్య నిర్మాణ సూత్రాలు' చాలని అనేక మంది కవులు, రచయితలు, మేధావు లు కమ్యూనిస్టు నాయకులకు మొరపెట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సదస్సు జరిగింది. వామపక్షాల ఐక్యతో, వామపక్షాల సంఘటనో పరిష్కారం కాదు. కమ్యూనిస్టు పార్టీలు అన్ని విలీనమై ఒకటిగానే కొనసాగాలనే డిమాండ్ రోజు రోజుకు పెరుగుతుంది. ఆ సదస్సు కూడా అదే ప్రతిబింబించింది. ఇలాంటి సదస్సులు ఉభయ రాష్ట్రాలలోని ముఖ్యమైన నగరాలు మరియు అనేక ప్రాంతాలలో విరివిగా జరగాల్సిన అవసరం ఉంది.

అసలు విలీనానికి ఆటంకాలేమిటి? పార్టీలు చీలటానికి కారణాలు, ఇప్పటికీ కొనసాగుతున్న విభేదాలు పరిష్కరించకుండా ఐక్యత సాధ్యం కాదని కొన్ని పార్టీలు దాటేస్తున్నాయి. అవి పరిష్కరించబడకుండా అడ్డు పడుతుంది ఎవరో మాత్రం చెప్పరు. ఐక్యతని విలీనాన్ని అవహేళన చేస్తూ మాట్లాడే వారు కూడా కొందరు ఉన్నారు.వారు విలీనానికి అడ్డు పడుతున్నారు. విభేదాలు పరిష్కారం కాకుండా ఎలా కలుస్తారు అని అమాయకంగానో, అతి తెలివితోను కొన్ని ప్రశ్నలు వస్తున్నాయి. ఏవి మిత్రభేదాలు? ఏవి శత్రు వైరుధ్యాలు?అనే విషయాల లోతుల్లోకివెళ్తేనే ఈ సమస్య అర్థమవుతుంది. అది ఎలానో చూద్దాం.

కలవగలిగే వాటిని మిత్రబేధాలు అంటారు. కలవలేని వాటిని శత్రు వైరుధ్యాలు అంటారు. కార్మికులు పెట్టుబడిదారుల మధ్య ఉండేది శత్రు వైరుధ్యం. రైతులు భూస్వాముల మధ్య ఉండేది శత్రు వైరుధ్యం. సామ్రాజ్యవాదం ప్రపంచ జనాల మధ్య ఉండేది శత్రువైరుధ్యం. వీటి మధ్య వైరుధ్యం అంతరించేది అందులో ఏదో ఒకటి అదృశ్యమైనప్పుడు మాత్రమే. పై వాటిలో ఒకటి అభ్యుదయ శక్తి అయితే మరొకటి అభ్యుదయ నిరోధక శక్తి అవుతుంది. అభ్యుదయ శక్తి గెలిస్తే సమాజం పురోగమిస్తుంది. అభ్యుదయ నిరోధక శక్తి గెలుస్తే సమాజం తిరోగమిస్తుంది. రైతులు, వ్యవసాయ కార్మికులు, మధ్యతరగతి రైతులు, చిన్న వ్యాపారస్తులు, వృత్తిదారులు తదితర సంపద ఉత్పత్తి క్రమంలో పాల్గొనే వారు ఉంటారు. వారి మధ్య కూడా విభేదాలు ఉంటాయి. కానీ వారి మధ్య ఉండేవి మిత్రభేదాలు మాత్రమే. అదేవిధంగా ఎస్సీలలోని వివిధ కులాల మధ్య విభేదాలు ఉంటాయి. బీసీల్లోని వివిధ కులాల మధ్య విభేదాలు ఉంటాయి. ఎస్సీ బిసిల మధ్యలో విభేదాలు ఉంటాయి. కానీ వీటి మధ్య ఉండేవి కూడా మిత్రభేదాలే. ఎస్‌సి, బిసిలను కలిపి బహుజనులందాం. వీరందరికి బ్రాహ్మణిజంతో ఉండే వైరుధ్యం మాత్రమే శత్రు వైరుధ్యం.

ఈ వైరుధ్యాలన్నింటిని సృష్టించింది దోపిడీ వర్గాలే. శత్రు వర్గాల మధ్య ఘర్షణ అనివార్యం. ఆ ఘర్షణ ద్వారా సమా జం పురోగమిస్తే దానిని ఆహ్వానించాలి. త్యాగాలు చేసైనా ఆ క్రమాన్ని వేగ వంతం చేయాలి. మిత్రుల మధ్య బేధాలను ఘర్షణ రూపంలో కాకుండా సామరస్యంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలి. శత్రువులు వీటిని భూతద్దంలో చూపించి శత్రు వైరుధ్యంగా మార్చాలని ప్రయత్నిస్తుంటారు. వీరి మధ్య అనైక్యతను పెంచి తమ దోపిడీ వ్యవస్థను కాపాడుకుంటారు. కమ్యూనిస్టు పార్టీల చీలికను సమర్థించే వారెవరైనా తిరిగి పునరేకీకరణ జరగాలనే ప్రయత్నాలను వ్యతిరేకించడం మార్క్సిజం ఎలా అవుతుంది?

కమ్యూనిస్టు పార్టీలను చీల్చింది, చీల్చుతుంది మాత్రం దోపిడీ వర్గాలు కాదు.సామ్రాజ్యవాదులు కాదు. భూస్వాము లు కాదు. పెట్టుబడిదారులు కాదు. బూర్జువా రాజకీయ పార్టీలు కాదు. కార్పొరేట్ సంస్థలు



కాదు. ఆర్ఎస్ఎస్ లాంటి మతోన్మాద శక్తులు కాదు. కమ్యూనిస్టు పార్టీలను చీల్చుతుంది కమ్యూనిస్టు పార్టీల అగ్ర నాయకులేనని ప్రజలు నమ్ముతున్నారు. కమ్యూనిస్టు పార్టీలంటే సాధారణ ప్రజలకు అభిమానమే తప్ప వ్యతిరేకత వుండదు.కమ్యూనిస్టు అభిమానులు చీలిక పేలికలైన గ్రూపులను చూసి ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒకే పార్టీగా విలీనం కావాలని కోరుకుంటున్నారు. అన్ని కమ్యూనిస్టు పార్టీల సభ్యులు, కార్యకర్తలు, కింది కమిటీల నాయకులంతా మార్క్సిజం విశ్వసించేవారంతా విలీనమై దేశంలో ఒకే కమ్యూనిస్టు పార్టీగా ఉండాలని కోరుకుంటున్నారు.

దేశంలోని కమ్యూనిస్టు పార్టీలకి ఉన్న ప్రజాసంఘాల సభ్యులు, కార్యకర్తలు తక్కువేమి కాదు. కోట్లలో ఉంటారు. కమ్యూనిస్టు పార్టీలు వీరిమధ్యలో సయోధ్యని పెంచే బదులుగా శత్రుత్వాన్ని పెంచుతూ ఉంటారు. వీరు ఒకరినొకరు శత్రువులుగా భావించుకొని ఒక సంఘం మరొక సంఘంపై దుష్ప్రచారం చేస్తూ ఉంటుంది. ఒకరు మరొకరిని తగ్గించడానికి ప్రయత్నిస్తుంటారు.

ఎన్నికల సమయంలో ఈ సంఘ సభ్యులలో అత్యధికులు తమ మాతృ పార్టీకి ఓటు వేయరు. చీలిపోయి న ఈ పార్టీలు గెలవలేవు, తమ ఓటు వృధా అవుతుందనే భావనలో ఉంటారు. ప్రజలందరిని సమీకరించటానికి పార్టీని పెడుతున్నామని అన్ని కమ్యూనిస్టు పార్టీలు చెపుతాయి. కానీ ఆచరణలో అన్ని కమ్యూనిస్టు పార్టీలు ప్రజలని చీల్చటానికి, మళ్లీ తిరిగి శాశ్వతంగా కలవకుండా ఉండేలాగా ఆర్గనైజ్ చేస్తున్నారేమో అని పిస్తుంది. చీలిపోవటానికి, చీలికలు కొనసాగటానికి కావలసిన సిద్ధాంతాలని సృష్టిస్తున్నారు కానీ విలీనానికి కావలసిన సిద్ధాంతాలను సృష్టించలేకపోతున్నారు. కలవాలి అనుకున్నప్పుడు ఎదుటివారితో ఉండే సామీప్యాలని వెతకాలి. వేరుగా ఉండాలనుకున్నప్పుడు విభేదాలని వెతకాలి. ఇప్పుడు భారత కమ్యూనిస్టులు చేస్తున్నదదేనా? అని అనిపించడం సహజం. ఎంతో విజ్ఞానము, స్థాయి, పరిపక్వత ఉన్న కమ్యూనిస్టు నాయకులే కలవలేకపోతున్నారు. ప్రపంచంలోనే వివిధ ప్రాంతాల, భాషల, మతాల, జాతులతో నిండి ఉన్నదేశాలలోని కార్మికులంతా ఐక్యం కావటం ఎలా సాధ్యం అని కమ్యూనిస్టు వ్యతిరేకులు ప్రశ్నిస్తున్నారు. దానికి తగ్గట్టే భారత కమ్యూనిస్టులు చీలికలు పేలికలై మార్క్స్ ప్రఖ్యాత నినాదం 'ప్రపంచ కార్మికులారా ఐక్యం కండి' తప్పనీ ఆచరించి చూపుతున్నట్లు అవుతుంది.

భారత కమ్యూనిస్ట్‌లారా చీలిపోయిన మీరు ఇకనైనా ఒకే పార్టీగా విలీనం కండి. కలిసి ఉండటానికి 1848 'కమ్యూనిస్టు ప్రణాళిక' చాలు. కలిసిన సంస్థ మళ్లీ విడిపోకుండా ఉండటానికి లెనిన్ చూపిన 'కేంద్రీకృత ప్రజాస్వామ్య నిర్మాణ సూత్రాలు' చాలని గమనించండి. కమ్యూనిస్టు ప్రణాళికలో ఉన్న వాటికి తోడు ఏమైనా జత చేయాలనుకుంటే చేయవచ్చు ఏవైనా తగ్గించాలంటే తగ్గించవచ్చు. అది కొత్తగా విలీనమై ఏర్పడిన పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్య నిర్మాణ సూత్రాల ప్రకారంగా మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. లెనిన్ అనేక అనుభవాల ద్వారా భిన్నాభిప్రాయాలు పార్టీలో వచ్చినపుడు వాటిని పరిష్కరించుకోవటానికి ఏర్పాటు చేసిందే ఈ కేంద్రీకృత ప్రజాస్వామ్య నిర్మాణ సూత్రం. వివిధ పార్టీల కమ్యూనిస్టు నాయకులు తమ అహంభావాలు 'ఇగో'లు వదిలి ఒక పార్టీగా విలీనమైతే సానుభూతిపరులు, ప్రజాసంఘాల సభ్యులు, అభ్యుదయ మేధావులు అందరూ కొత్త ఉత్సాహాన్ని పొందుతారు. కమ్యూనిస్టు పార్టీకి ఓటర్లుగా మారతారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని అన్ని విధాల ముందుకు తీసుకుపోతారు. దేశంలో ఒక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుంది. రోజురోజు పెరుగుతున్న ఫాసిస్ట్ శక్తుల కు వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యపరచటంలో కీలక పాత్ర వహించగలుగుతుంది. విలీనం లక్ష్యంగా కృషి ప్రారంభం కావాలి. విలీనం తక్షణమే అవుతుందని భ్రమలు ఉండాల్సిన అవసరం లేదు. కానీ దానికంటే ముందు వామపక్ష ఐక్య సంఘటన ఏర్పడాలి. ఆ సంఘటన ద్వారా ప్రజల తక్షణ సమస్యల మీద నిరంతరం పోరాటాలను నిర్వహిస్తూ ఉండాలి. ఆ క్రమంలో విలీనానికి బాటలు వేయాలి.

వంద సంవత్సరాల క్రితం ఏర్పడిన ఆర్ఎస్ఎస్ ముందుకి మున్ముందుకు పోతుంటే 100 సంవత్సరాల క్రితం ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ వెనుకకు మరింత వెనుకకి వెళ్తుంది. కమ్యూనిస్టు పార్టీలు అనుసరిస్తున్న తప్పుడు విధానాలు, అనైక్యత ఫలితంగా మార్క్సిస్టు మౌలిక సిద్ధాంతాలే విఫలమయ్యాయనే ప్రచారం కమ్యూనిస్టు వ్యతిరేకులు కొనసాగించటానికి అవకాశాన్నిస్తున్నారు. భారతదేశంలోని కమ్యూనిస్టు పార్టీలు వైఫల్యమైనంతమాత్రాన మార్క్సిజం వైఫల్యం అయినట్లు కాదు. మార్క్సిజం ఒక అజేయమైన సిద్ధాంతం. ఒక శాస్త్రం. కమ్యూనిస్టు ఉద్యమం పునరేకీకరణ జరుపుకొని ఫాసిస్ట్ శక్తులు నుండి దేశాన్ని రక్షించి, సోషలిస్టు వ్యవస్థను నిర్మించాలి. అప్పుడే మార్క్సిజమే సరైనదని, మార్క్సిజానికే భవిష్యత్తు ఉందని చాటిచెప్పినట్టు అవుతుంది. అందుకు కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఇప్పుడైనా తీవ్రం గా ఆలోచించాలని విజ్ఞప్తి.

# తొలి తెలుగు 'భారతరత్నం' పివి నరసింహారావు

భారతదేశ రాజకీయ చరిత్రలో మేరునగ ధీరుడు తెలంగాణ పల్లెలో పుట్టి ఢిల్లీ పీఠాన్ని అధిరోహించిన తెలంగాణ భూమి పుత్రుడు, బహుభాష ప్రజ్ఞాశీలి, రాజకీయ దురంధరుడు సరళీకృత ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, దేశ ప్రగతికి బాటలు వేసిన దార్శనికుడు, గొప్ప రాజనీతిజ్ఞుడు, అఖండ భారతాన్ని ఏలిన తొలి తెలుగు తేజం కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో తగిన సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని పూర్తికాలం నడిపిన తెలంగాణ భూమి పుత్రుడు మన పివి నరసింహారావు. పి.రంగారావు కుమారుడైన శ్రీ పి.వి. నరసింహారావు 1921 జూన్ 28న కరీంనగర్‌లో జన్మించారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్శిటీలోను, ముంబయి యూనివర్శిటీలోను, నాగ్‌పూర్ యూనివర్శిటీలోను చదువుకున్నారు. భార్యను కోల్పోయిన పి.వి.నరసింహారావుకు ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయవేత్తగా, న్యాయవాదిగా ఉన్న నరసింహారావు రాజకీయాల్లో చేరి కొన్ని ముఖ్యమైన పదవు లు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో 1962–64 న్యాయ, సమాచార శాఖ మంత్రి, 1964–67 న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి, 1967 ఆరోగ్యం, వైద్యశాఖ మంత్రి, 1968–71 విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 1971–73 వరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 1975–76 అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధానకార్యదర్శి, 1968–74 ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ చైర్మన్, 1972 నుంచి మద్రాస్‌లో దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. 1957– 77 మధ్య ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యుడుగా ఉన్నారు. 1977 నుంచి 1984 వరకు లోక్‌సభ సభ్యునిగా ఉన్నారు. 1984 డిసెంబర్‌లో రామ్‌టెక్ నుంచి 8వ లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1978–79లో పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ ఛైర్మన్‌గా లండన్ యూనివర్శిటీలోని స్కూల్ ఆఫ్ ఆసియన్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ నిర్వహించిన దక్షిణాసియా సదస్సులో పాల్గొన్నారు. భారతీయ విద్యాభవన్ ఆంధ్రప్రదేశ్ కేంద్రానికి చైర్మన్‌గా కూడా వ్యవహరించారు. 1980 జనవరి 14 నుంచి 1984 జులై 18 వరకు విదేశాంగ మంత్రిగా పనిచేశారు. 1984 డిసెంబర్ 31 నుంచి 1985, సెప్టెంబర్ 25 వరకు రక్షణ మంత్రిగా ఉన్నారు. అనంతరం 1985 సెప్టెంబర్ 25 మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రిగా బాధ్యత లు చేపట్టారు. అనేక అభిరుచులు కలిగిన నరసింహారావుకు సంగీతం, సినిమా, నాటకాలంటే ఇష్టం. జ్ఞానపీఠ్ ప్రచురించిన స్వర్గీయ విశ్వనాథ సత్యనారాయ ణ సుప్రసిద్ధ నవల 'వేయి పడగలు' హిందీ అనువాదాన్ని 'సహస్రఫణ్' పేరు తో ఆయన విజయవంతంగా ప్రచురించారు. అలాగే, కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించిన స్వర్గీయ శ్రీహరినారాయణ్ ఆప్టే ప్రముఖ మరాఠీ నవల 'పన్ లక్షత్ కోన్ గెటో' తెలుగు అనువాదాన్ని కూడా ప్రచురించారు. మరాఠీ నుంచి తెలుగులోను, తెలుగు నుంచి హిందీలోను అనేక అనువాద గ్రంథాలు ప్రచురించారు. వివిధ పత్రికల్లో కలం పేరుతో అనేక వ్యాసా లు రాశారు. అమెరికా, పశ్చిమ జర్మనీలోని యూనివర్శిటీల్లో రాజకీయ అంశాలపై, అనుబంధ అంశాలపైన ప్రసంగాలు చేశారు. విదేశీ వ్యవహారాల మంత్రి హోదాలో 1974 బ్రిటన్, పశ్చిమ జర్మనీ, స్విట్జర్లాండ్, ఇటలీ, ఈజిప్ట్ దేశాల్లో పర్యటించారు. విదేశాంగ మంత్రి గా ఉన్న సమయంలో అంతర్జాతీయ దౌత్యానికి సంబంధించి ఆయన తన మేధావితనాన్ని, ప్రజ్ఞా పాటవాలను, రాజకీయ అనుభవాన్ని సమయోచితంగా ప్రదర్శిస్తూ వచ్చారు. 1980 జనవరిలో న్యూఢిల్లీలో జరిగిన యునిడో 3వ సదస్సుకు నరసింహారావు అధ్యక్షత వహించారు. 1980 మార్చిలో న్యూయార్కులో జరిగిన 77 దేశాల సమావేశానికి కూడా అధ్యక్ష బాధ్యతలు వహించారు. 1981 ఫిబ్రవరి అలీన దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆయన నిర్వహించిన పాత్ర విస్తృత ప్రశంసలు అందుకొంది. 1981మే లో కారకస్‌లో జరిగిన 77దేశాల ఈసిడిసి సదస్సులో భారత ప్రతినిధి వర్గానికి వ్యక్తిగతంగా నాయకత్వం వహించారు. భారతదేశానికి, భారత విదేశాంగ విధానానికి 1982, 1983 సంవత్సరాలు ఎంతో ముఖ్యమైనవి. 1982 లో అమెరికాలో జరిగిన అలీన దేశాల విదేశాంగ మంత్రుల సమావేశాలకు పి.వి.నరసింహారావు అధ్యక్షత వహించారు. 1983 నవంబర్‌లో పాలస్తీనా సమస్య పరిష్కార యత్నంలో భాగంగా పశ్చిమాసియా దేశాల్లో పర్యటించిన అలీన దేశాల ప్రత్యేక ప్రతినిధి బృందానికి నరసింహారావు నాయకత్వం వహించారు. 1984 జులై 19న నరసింహారావు హోం మంత్రి బాధ్యతలు చేపట్టారు. 1984 నవంబర్ 5న ఆయనకు ప్రణాళికా శాఖను కూడా అదనంగా అప్పగించారు. 1984 డిసెంబర్ 31 నుంచి 1985 సెప్టెంబర్ 25 వరకు రక్షణ మంత్రిగా పనిచేశారు. 1985 సెప్టెంబర్ 25న మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా నియమితులయ్యారు. 2004 డిసెంబర్ 23న కన్నుమూశారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పివి నరసింహారావు శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆయన చేసిన సేవలను గుర్తించి 2024వ సంవత్సరానికి గాను భారత ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'తో పివి నరసింహారావు గారిని గౌరవించడం యావత్ భారతజాతికి, ఆనందదాయకమైన విషయం.



(నేడు శ్రీ పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా)

నరేష్ జాటోత్, 8247887267

# అయోధ్య చోరీపై తక్షణమే జ్యుడిషియల్ విచారణ

- బిజెపి వ్యతిరేక ఓట్లను తొలగించేందుకే 'సర్' విధానం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం/జగిత్యాల :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అయోధ్య రామాలయ విరాళాల చోరీపై సిట్‌తో పాటు సుప్రీంకోర్టు చొరవ తీసుకుని జ్యుడిషియల్ విచారణ చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి దేశ ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తాజా చికెన్ బాంక్వెట్ హాలులో శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కౌన్సిల్, శాఖ కార్యదర్శుల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా చాడ వెంకట్ రెడ్డి హాజరై పార్టీ బలోపేతంపై నాయకులకు దిశా నిర్దేశం చేశారు. జగిత్యాల జైత్ర యాత్ర స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అయోధ్య రామాలయానికి వచ్చే భక్తులు హుండీల్లో, విరాళాల పెట్టెల్లో వేసే నగదు, బంగారంను చోరీకి పాల్పడడం చూస్తుంటే ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఏమి చేస్తుందని మండిపడ్డారు. చోరీ విషయంలో ఆలయ ట్రస్టుతో పాటు అధికారులు, నిఘా విభాగం సిబ్బంది నిర్లక్ష్యమే కారణమన్నారు. ఈ ఘటనపై సిట్ విచారణ సరిపోదని, సుప్రీంకోర్టు చొరవ తీసుకుని జ్యుడిషియల్ విచారణ లోతుగా చేబడితేనే అన్ని నిజాలు బయటకు వస్తాయన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ తక్షణమే స్పందించి కోట్లాది మంది రామ భక్తుల నమకాన్ని నిలబెట్టాలన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అనేది అనేక నిబంధనలతో కూడుకున్నదని ఈ విషయంలో బూత్ లెవల్ అధికారులు ఓటర్లకు సరైన అవగాహన కల్పించడం లేదన్నారు. రానున్న రోజుల్లో బిజెపి అధికారంలోకి రావడం కోసం తన వ్యతిరేక ఓట్లను తొలగించేందుకే ఈ ఎస్ఐఆర్ విధానాన్ని అమలులోకి తీసుకవచ్చిందని ఆరోపించారు. దొంగ ఓట్ల పేరుతో ఉన్న ఓట్లు తొలగిస్తే ఊరుకోమని సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. మహాత్మగాంధీ పేరుతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు చేతి నిండా పని కల్పించే విధంగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం విబి జి రామ్ అని పేరు మార్చి జూలై ఒకటి నుండి అమలులోకి తీసుకువచ్చే విధంగా కార్మికుల హక్కులను కాలరాసే విధంగా చర్యలు చేపట్టబోతుందన్నారు. సమాన పనికి సమానం వేతనాలు ఇవ్వకపోవడంతో పాటు సంక్షేమ బోర్డును కూడా అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బిజెపి ప్రభుత్వం 12 ఏళ్ల పరిపాలనపై సంబరాలు చేసుకోవడం కేవలం ప్రగల్భాలకు మాత్రమేనన్నారు. సంబరాలు చేయడం కాదు నిరుపేదలకు కూడు, గుడ్డ సౌకర్యం కల్పించాలన్నారు. బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఆగస్టు 6 నుండి 14వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పాదయాత్రలు చేపట్టి బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామన్నారు. సెప్టెంబరు ఒకటిన దేశ రాజధాని ఢిల్లీలో నిరసన ర్యాలీ చేపట్టి మోది ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, జిల్లా ఇంచార్జి బోయిని అశోక్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వెన్న సురేష్, ఎఐటియూసి జిల్లా అధ్య క్ష, కార్యదర్శులు సుతారి రాములు, ముక్రం, జగిత్యాలజిల్లా సహా య కార్యదర్శి వెన్న మహేష్, నాయకులు మునుగూరి హన్మంతు, రాధ, పద్మ, శాంత, మానస, శిరీష ఉన్నారు.

# మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయాల్సిందే

- జనగణన, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలతో ముడిపెట్టొద్దు : మహిళా రిజర్వేషన్ల రాష్ట్ర కూటమి డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా రిజర్వేషన్ల చట్టం–2023ను జనగణన, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలతో ముడి పెట్టకుండా వెంటనే అమలు చేయాలని మహిళా రిజర్వేషన్ల రాష్ట్ర కూటమి డిమాండ్ చేసింది. చట్టం అమలులో జాప్యాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించింది. మహిళలు తమ హక్కుల సాధన కోసం మరింత సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చింది. మహిళా రిజర్వేషన్ల చట్టం 2023 పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని కూటమి ప్రకటించింది. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శనివారం సామాజిక కార్యకర్త శాంతా సిన్హా అధ్యక్షతన జరిగిన మహిళా సంఘాల రాష్ట్ర కూటమి సమావేశంలో వివిధ మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల మహిళా నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో శాంతా సిన్హా మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న పేదరికం, నిరక్షరాస్యత, అనారోగ్యం, వివక్ష వంటి సమస్యల పరిష్కారానికి నిర్ణయాత్మక స్థానాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొఫెసర్ రమా మేల్కొటే మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తే పాలనలో మహిళల భాగస్వామ్యం పెరిగి సామాజిక న్యాయం బలోపేతం అవుతుందన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ 1996లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీకి అధ్యక్షత వహించిన సిపిఐ జాతీయ నాయకురాలు గీతా ముఖర్జీ దేశవ్యాప్తంగా పర్యటించి రూపొందించిన నివేదిక ఆధారంగానే 2010లో రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిందని, అనంతరం 2023లో పార్లమెంట్ చట్టంగా ఆమోదించినప్పటికీ ఇప్పటికీ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఈ నేపథ్యంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జాతీయ నాయకత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిందని తెలిపారు. తెలంగాణ రక్షణ సేనా (టిఆర్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షురాలు కవిత, కాంగ్రెస్ ప్రతినిధి శారద, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకురాలు మల్లు లక్ష్మి, పిఓడబ్ల్యు నాయకురాలు వి.సంధ్య, టిజెఎస్ మహిళా విభాగం నాయకురాలు లక్ష్మి రాగులపల్లి తదితరులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా మహిళలు రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నప్పటికీ, చట్టం చేసిన తర్వాత కూడా అమలుకు అడ్డంకులు సృష్టించడం వెనుక పురుషాధిక్య భావజాలంతో పాటు రాజకీయ కుట్రలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు పుస్తెల సృజన, కృష్ణకుమారి, డి.నళిని, ఫైమీద, జ్యోతి, ఎఐటియుసి రాష్ట్ర నాయకురాలు పి.ప్రేమ్ పావని, మహిళా సంఘాల నాయకురాలు ఆశాలత (ఐద్వా), అనసూయ (పిఓడబ్లూ), ఆర్తి (వైడబ్ల్యూసిఎ), జ్యోతి(సిఎంఎస్), స్వతంత్ర మహిళా సంఘాల నెట్‌వర్క్‌కు చెందిన పొఫెసర్ సూరేపల్లి సుజాత, ఎన్‌ఎపిఎం ప్రతినిధి సునీత, పులి కల్పన (డిబిఎఫ్), సిస్టర్ లిజీ (తెలంగాణ గృహ కార్మికుల సంఘం ) తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్ సంస్థల సంయుక్త కార్యాచరణ కమిటీకి చెందిన స్త్రీవాద నాయకురాలు కె.సజయ, అఖిల భారత స్త్రీవాద వేదిక, ఎనాయకురాలు మీరా సంఘమిత్ర ఈ సమావేశానికిసమావేశానికి సమన్వయకర్తలుగా వ్యవహరించారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశం తీర్మానించింది.

# మహిళల భద్రతకు పోలీసులే ఆదర్శం

- ట్రైనీ డిఎస్‌పిలకు పిఒఎస్‌హెచ్ చట్టంపై సదస్సు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన కార్యాలయ వాతావరణం కల్పించడంలో పోలీసు అధికారుల పాత్ర అత్యంత కీలకమని సిఐడి డిజిపి చారు సిన్హా పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ (పిఒఎస్‌హెచ్) చట్టంపై ప్రతి పోలీసు అధికారికి పూర్తి అవగాహన ఉండాలని ఆమె సూచించారు. తెలంగాణ పోలీస్ అకాడమీ సెమినార్ హాల్–2లో శనివారం 112 మంది ప్రొబేషనరీ డిఎస్‌పిల కోసం 'పని ప్రదేశాల్లో మహిళల భద్రత – పిఒఎస్‌హెచ్ చట్టం అమలు, మహిళలు ఎదుర్కొనే సమస్యలు' అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన సిఐడి డిజిపి చారుసిన్హా, పిఒఎస్‌హెచ్ చట్టంలోని ముఖ్యాంశాలను వివరించారు. మహిళలు ఉద్యోగ స్థలాల్లో ఎదుర్కొనే లైంగిక వేధింపులు కేవలం ప్రత్యక్ష చర్యల రూపంలోనే కాకుండా, అనుచిత వ్యాఖ్యలు, ప్రవర్తన, సంకేతాలు వంటి పలు రూపాల్లో ఉంటాయని ఆమె తెలిపారు. ఇలాంటి సంఘటనలను మహిళలు సకాలంలో గుర్తించి, చట్టపరంగా అందుబాటులో ఉన్న రక్షణ వ్యవస్థలను వినియోగించుకోవాలని సూచించారు. మహిళల భద్రతను కాపాడే బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. అనంతరం విమెన్ సేఫ్టీ వింగ్ కౌన్సిలర్ ఇషా శర్వాణి మాట్లాడుతూ, మహిళలు ఉద్యోగ జీవితంలో ఎదుర్కొనే మానసిక, సామాజిక, వృత్తిపరమైన సవాళ్లు, లైంగిక వేధింపుల వివిధ రూపాలు, వాటిని ఎదుర్కొనే చట్టపరమైన మార్గాలను సోదాహరణంగా వివరించారు. మహిళల గౌరవ పరిరక్షణతో పాటు సమాజంలో పిఒఎస్‌హెచ్ చట్టంపై విస్తృత అవగాహన కల్పించడంలో పోలీసు అధికారులు కీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 112 మంది ప్రొబేషనరీ డిఎస్‌పిలు పాల్గొనగా, డిఎస్‌పి సతీష్ లైజన్ అధికారిగా వ్యవహరించారు.

# ఎస్‌బిఐ, ప్రభుత్వం మధ్య చర్చలు సఫలం

పరస్పర అంగీకారంతో సమస్యకు పరిష్కారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రభు త్వం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) మధ్య పెండింగ్‌లో ఉన్న అంశంపై శనివారం మరోసారి చర్చలు జరిగాయి. సచివాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ సుల్తానియా, టిజిఐఐసి వైస్ చైర్మన్, ఎండి కె.శశాంకతో పాటు ఎస్‌బిఐ తరఫున డిబిడి, సిడిఓ జి.ఎస్.రాణా, తెలంగాణ సిజిఎం నీలేష్ ద్వివేది, ఎజిఎం జి.పూవళగి పాల్గొన్నా రు. ప్రభుత్వం సూచించిన ప్రత్యామ్నాయ స్థలాలను జూన్ 23న ఎస్‌బిఐ ప్రతినిధుల బృందం పరిశీలించిన అనంతరం, ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రత్యామ్నాయాలను బ్యాంకు అంగీకరించినట్లు సమావేశంలో వెల్లడించారు. అయితే తుది నిర్ణయానికి ఎస్‌బిఐ బోర్డు ఆమోదం అవసరమని అధికారులు తెలిపారు. అలాగే ప్రస్తు తం కొనసాగుతున్న న్యాయస్థాన విచారణలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. చర్చల అనంతరం ప్రభుత్వం, ఎస్‌బిఐ పరస్పర అంగీకారంతో సమస్యకు సామరస్య పూర్వక పరిష్కారానికి చేరుకున్నాయి. అవసరమైన చట్టపరమైన ప్రక్రియలు పూర్తయిన వెంటనే ఈ అంశాన్ని త్వరితగతిన ముగించనున్నట్లు అధికారిక ప్రకటనలో వెల్లడించారు.

# ఓటర్ల ఎన్యూమరేషన్ గడువు పెంచాలి

- సిఇఓ సుదర్శన్ రెడ్డికి టిపిసిసి కమిటీ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ ద్వారా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా ఓటర్ల ఎన్యుమరేషన్ గడువును 30 రోజుల నుండి 60 రోజులకు పెంచాలని టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ డిమాండ్ చేసింది. టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్ నాయకత్వంలో, సభ్యులు గోపిశెట్టి రాఘవేందర్, డాక్టర్ బైకినీ లింగం యాదవ్‌లతో కూడిన బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా పులిపాటి రాజేష్ కుమార్ మాట్లాడుతూ బూత్ లెవెల్ ఆఫీసర్లు (బిఎల్‌ఓలు) 2025 ఓటర్ల జాబితా ఆధారంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందించాల్సి ఉందన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఈ ఫారాల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆయన సిఈఓ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాకుండా, ప్రస్తుతం బిఎల్‌ఓ విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు 'పల్స్ పోలియో' కార్యక్రమంలో నిమగ్నమవ్వడం వల్ల మూడు రోజుల పాటు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీకి ఆటంకం కలుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఎన్యూమరేషన్ గడువును పెంచడం ఎంతో అవసరమన్నారు. కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితా అందజేయాలని, రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన బూత్ లెవెల్ ఏజెంట్స్ (బిఎల్‌ఏలు) జాబితా ఇంకా బిఎల్‌ఓలకు అందలేదని, తక్షణమే ఈ జాబితాను వారికి అందేలా చూడాలని కోరారు. స్పందించిన సిఈఓ సుదర్శన్ రెడ్డి టిపిసిసి ప్రతినిధి బృందం వినతిపై సిఈఓ సి. సుదర్శన్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. గడువు పెంపు అంశాన్ని కేంద్ర ఎలక్షన్ కమిషన్ (ఈసిఐ) దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే క్షేత్రస్థాయిలో జరుగుతున్న జాప్యంపై, ఇతర సాంకేతిక అంశాలపై త్వరలోనే జిల్లా ఎన్నికల అధికారులు (డిఇఓ), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో (ఈఆర్ఓ) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగిన దిశానిర్దేశం చేస్తామని చెప్పారన్నారు.

# తొలగించిన ల్యాబ్ టెక్నీషియన్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

- ఎఐటియుసి డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ వైద్య విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తూ ఇటీవల తొలగించిన ల్యాబ్ టెక్నీషియన్లను తక్షణం తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎఐటియూసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా డిమాండ్ చేశారు. కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డిఎంఈ, వైద్య విధాన పరిషత్ పరిధిలో 2006 నుండి ఐసియూ, మెడికల్ కాలేజీలు, ఆర్‌టిపిసిఆర్ ల్యాబ్‌లు, రక్తనిధులు, రక్త నిల్వ కేంద్రాల్లో సేవలందిస్తున్న సుమారు 300 మంది ల్యాబ్ టెక్నీషియన్లను ప్రభుత్వం గత మార్చి నుంచి నుంచి తొలగించడం అన్యాయమని అన్నారు. కరోనా వంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలను సైతం పణంగా పెట్టి సేవలందించిన వారిని ఉద్యోగాల నుండి తొలగించడం తీవ్ర నిరాశ కలిగించేదని పేర్కొన్నారు. వీరికి సర్వీసు పొడిగింపు ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ, ల్యాబ్ టెక్నీషియన్ల తొలగింపు అన్యాయమని అన్నారు. ప్రభుత్వం ప్రారంభించనున్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) వంటి సంస్థల్లో కొత్త నియామకాలు చేయకుండా, ఇప్పటికే అనుభవం ఉన్న తొలగించిన సిబ్బందినే కొనసాగిస్తే వారికి న్యాయం జరుగుతుందని సూచించారు. తొలగించిన ల్యాబ్ టెక్నీషియన్లందరిని వెంటనే కొనసాగింపునకు అవకాశం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కిరణ్ కుమార్, వసంత రావు, పద్మ, త్రివేణి, అశోక్, అబ్దుల్ కరీమ్, నిరంజన్, శ్రీనివాస్, జలాలుద్దీన్, రవీందర్, పురుషోత్తం, జయప్రకాష్, షేక్ ఖాదర్, సైయ్యద్ రియాజ్, అరుణ్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించి తమ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

# తెలంగాణలో బిజెపి జాతీయ అధ్యక్షుడి మూడు రోజుల పర్యటన

- ఏర్పాట్లు పరిశీలించిన రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తెలంగాణలో మూడు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ పర్యటన తెలంగాణ బిజెపికి అత్యంత కీలకమైనదన్నారు. పర్యటనలో భాగంగా రంగారెడ్డి జిల్లా కార్యాలయంతో పాటు మరో 9 జిల్లాల బిజెపి కార్యాలయాలను నితిన్ నబిన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారని చెప్పారు. అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో దాదాపు 15,000 మంది బూత్ స్థాయి ప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమావేశం జరుగుతుందన్నారు. ఈ ఏర్పాట్లను బిజెపి రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, ఎంపి రేఖా శర్మ సమీక్షించారు. ఈ పర్యటనలో వరంగల్‌లో బూత్ స్థాయి సమావేశం, ఘట్‌కేసర్ వద్ద తొలి రాష్ట్ర కార్యవర్గ సమావేశంతో పాటు, విబిఐటి క్యాంపస్‌లో యువత, విద్యార్థులతో 'యూత్ అండ్ స్టూడెంట్స్ కాన్‌క్లేవ్' కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్, ఎంఐఎంలు కలిసినా తెలంగాణలో బిజెపి విజయకేతనాన్ని అడ్డుకోలేవని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# చీకటి ఒప్పందం బహిర్గతం చేయాలి

బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తన రాజకీయ గురువు చంద్రబాబు నాయుడికి గురుదక్షిణగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ జలహక్కులను తాకట్టు పెడుతున్నారని బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మంత్రి తన్నీరు హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. తుంగభద్ర గేట్‌ల ప్రారంభోత్సవం సందర్భంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులతో కలిసి రేవంత్ రెడ్డి చేసుకున్న 'చీకటి ఒప్పందం' ఏంటో రాష్ట్ర ప్రజలకు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి 'గుంపు మేస్త్రీ' అయినా తమకు అభ్యంతరం లేదు కానీ, తెలంగాణను ముంచే 'ముంపు మేస్త్రీ' కావద్దని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ నదీ జలాలపై కనీస అవగాహన లేని సిఎం అజ్ఞానం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. కర్ణాటక ప్రభుత్వం తుంగభద్రపై అక్రమంగా 35 టిఎంసిల 'నవలి రిజర్వాయర్'తో పాటు మరో 3 బ్యారేజీలు కడుతుంటే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 20 టిఎంసిల 'గుండ్రేవుల' ప్రాజెక్టుకు సిద్ధమవుతోందన్నారు. దీనివల్ల శ్రీశైలానికి నీరు రాక కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులు ఎడారిగా మారుతాయని హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని, మన రాష్ట్ర ఇంజనీర్లను బయట కూర్చోబెట్టడం వెనుక ఉన్న రహస్యమేంటని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ హయాంలో తొమ్మిదిన్నరేళ్లలో 383 టిఎంసిల గోదావరి జలాల అనుమతులు సాధిస్తే, కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లలో ఒక్క టిఎంసికి కూడా అనుమతి తేలేదన్నారు.

# చరిత్ర సృష్టించిన తెలంగాణ హస్తకళలు

- తొలిసారిగా రికార్డు లాభాల బాటలో టిజిహెచ్‌డిసి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర స్వయంపాలనలో సాంస్కృతిక వారసత్వానికి, కళా వైభవానికి సరికొత్త అధ్యాయం లిఖించబడింది. దశాబ్దాలుగా ఆటుపోట్లను ఎదుర్కొంటూ, కేవలం ప్రభుత్వ సబ్సిడీలపైనే నెట్టుకొస్తున్న 'తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ' (టిజిహెచ్‌డిసి) చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా అద్భుతమైన లాభాల బాట పట్టింది. నష్టాల్లో కూరుకుపోయిన సంస్థ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ, దార్శనికత, వ్యూహాత్మక నిర్ణయాల ఫలితంగా రికార్డు స్థాయి నికర లాభాలను నమోదు చేసి కార్పొరేట్ సంస్థలకు సైతం ఆదర్శంగా నిలిచింది. 'గోల్కొండ' హస్తకళలు, చేనేత రిటైల్ విభాగాలు మునుపెన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారి నికర లాభాలను సొంతం చేసుకున్నాయి.

## సంక్షోభం నుంచి సమృద్ధి వైపు

తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకున్న ప్రభుత్వం సంస్థకు చైర్మన్‌ను నియమించడంతో పాటు అపారమైన వ్యాపార నైపుణ్యంతో సంస్థ దశను, దిశను మార్చేసింది. సంస్థ పురోగతి కోసం ప్రధానంగా మూడు సూత్రాలపై దృష్టి పెట్టింది. పేరుకుపోయిన నిల్వలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరాను క్రమబద్ధీకరించడం, సాంప్రదాయ అమ్మకాల శైలిని మార్చడం, మార్కెట్ పోటీని తట్టుకు నేలా రిటైల్ విభాగాలను ఆధునీకరించడం తదితర చర్యలు చేపట్టింది. అంతకుముందు పరిమితంగా ఉన్న కస్టమర్ బేస్‌ను పెంచేందుకు 'గోల్కొండ' హస్తకళలు, చేనేత రిటైల్ దుకాణాలను డిజిటల్ ఇ కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లతో అనుసంధానించింది.

## గ్లోబల్ మార్కెటే లక్ష్యం

తెలంగాణ బ్రాండ్‌లు అయిన గద్వాల్, నారాయణపేట, పోచంపల్లి వంటి ప్రామాణిక చేనేత వస్త్రాలకు సమకాలీన, ఆధునిక డిజైన్లను జోడించడం ద్వారా యువతను, ఆధునిక వినియోగదారులను ఇటీవలి కాలంలో 'తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ' (టిజిహెచ్‌డిసి)విశేషంగా ఆకర్షించింది. కేవలం ఉత్పత్తికే పరిమితం కాకుండా, బలమైన సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసి పంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఫలితంగా వ్యాపార లావాదేవీలు గణనీయంగా పెరిగాయి.

## కార్మికుల్లో నూతనోత్తేజం

క్షేత్రస్థాయి, రిటైల్ సిబ్బంది రోజువారీగా ఉపయోగించే సాంకేతిక ప్లాట్‌ఫారమ్‌లను టిజిహెచ్‌డిసి మెరుగుపర్చింది. ఉద్యోగులు, కార్మికులకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించి, వారిలో జవాబుదారీతనంతో పాటు సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. సంస్థ లాభాల్లోకి రావడానికి టిజిహెచ్‌డిసి చైర్మన్ చొరవను ఉద్యోగులు, కార్మికులు అభినందిస్తున్నారు. ఒక సమర్థుడైన నాయకుడు ఉంటే నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థనైనా అద్భుతంగా లాభాల బాట పట్టించవచ్చని నిరూపించిన చైర్మన్ నాయుడు సత్యనారాయణను టిజిహెచ్‌డిసి ఉద్యోగులు, కార్మికులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ హస్తకళల వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ, చేనేత కళాకారుల శ్రమకు తగిన గుర్తింపు తెచ్చిన నాయుడు సత్యనారాయణ దార్శనికతకు ఈ సరికొత్త రికార్డు స్థాయి లాభాలే ప్రత్యక్ష నిదర్శనమని కార్మిక వర్గాలు కొనియాడుతున్నాయి.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ (రూ. లక్షలలో) | బిడ్స్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం / బిడ్స్ దాఖలుకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| 33/EE-I/MKJZ/ MMC/2026-27 | నిర్వహణ పనులు ఇతరాలు-1 | 12.00 | 25.06.2026 3.00 PM 29.06.2026 &11.30 AM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 9989930389 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.
DIPR R.O. No. : 5010-PP/CL/ADVT/2026-27, Date: 27-06-2026

తెలంగాణ ప్రభుత్వం
**పర్యవేక్షక అధికారి కార్యాలయం, నీటి పారుదల శాఖ, కామారెడ్డి జిల్లా**

టెండర్ నోటీస్ నంబర్: 03(3rd Call)/SE/IC/KMR/2026-27, Dt: 23-04-2026, రూ. 34.31 లక్షలకు, NIT.No. 08(2nd Call)/SE/IC/KMR/2026-27, Dt: 06-05-2026, రూ. 27.35 లక్షలకు, NIT.No. 28(6th Call)/SE/IC/KMR/2025-26, Dt: 06-03-2026, రూ.10.70 లక్షలకు, పనులు లభ్యమగు తేదీ: 29.06.2026 ఉదయం 11.00 నుండి 06-07-2026 సాయంత్రం 5.00గం.ల వరకు టెండర్లు ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడగలరు.
Sd/-
I/c. Superintending Engineer,
Irrigation Circle, Kamareddy.
DIPR R.O. No. : 5026-PP/CL/ADVT/2026-27, Date: 27-06-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ : మల్కాజ్‌గిరి జోన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ (రూ. లక్షలలో) | బిడ్స్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం / బిడ్స్ దాఖలుకు ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| 34/EE-I/MKJZ/ MMC/2026-27 | నిర్వహణ పనులు ఇతరాలు-2 | 34.75 | 29.06.2026 11.30 AM 02.07.2026 &11.30 AM | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ 9989930389 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @http://www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.
DIPR R.O. No. : 5056-PP/CL/ADVT/2026-27, Date: 27-06-2026

# భద్రాచలం రామాలయ పునరుద్ధరణకు శ్రీకారం

**రూ. 200 కోట్లతో తొలివిడత పనులు**
**పుష్కరాల నాటికి పూర్తి చేయడమే లక్ష్యం**
**ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావుతో పాటు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆగమశాస్త్రాను సారం వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ తొలివిడత అభివృద్ధి పనులు ఘనంగా ప్రారంభించారు. గడిచిన శ్రీరామనవమి నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన విషయం తెలిసిందే. ఈ పనులకు గానూ మొత్తంగా రూ.586 కోట్ల అంచనాలు తయారు చేయగా, మొదటి విడతగా రూ.350 కోట్లకు ఆర్థిశాఖ అనుమతి ఇవ్వడంతో ప్రస్తుతం రూ.200 కోట్లతో పనులు చేపడుతున్నారు. భక్తులకు ఎలాంటి అంతరాయం లేకుండా ఆలయాభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి ఈ పనులు పూర్తయ్యేలా మాస్టర్ ప్లాన్ తయారైందన్నారు. స్వామివారి దర్శనం, నిత్యపూజలు, అర్చనలు, ఇతర సేవలకు ఎలాంటి అంతరాయం





ఉండదని, ఇందుకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాల్లో రాజీపడేది లేదని, నిర్ణీత గడువు నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ, ఆలయ ఇఒ దామోదరావు, సర్పంచ్ పూనెం కృష్ణ, తో పాటు అర్చకులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. యాదాద్రి తరహాలో భద్రాద్రిని అభివృద్ధి చేసి తీరుతామని చెప్పిన మాట ప్రకారం ప్రభుత్వం తొలి అడుగు వేసింది. రూ.200 కోట్లతో మొదటి విడద అభివృద్ధి పనులు ఎట్టకేలకు మొదలయ్యాయి. ఈ పనులు పుష్కరాల నాటికి పూర్తి చేసి భక్తులకు అందుబాటులోనికి తెస్తారు. మొత్తంగా రూ.586 కోట్లతో అంచనా నిధులతో రామాలయాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు నడుంబిగించిన ప్రభుత్వం మొదటి దఫాగా రూ.350 కోట్లను విడుదల చేసి అందులో రూ.200కోట్ల పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో భద్రాచలం ఆలయం రూపురేఖలు మారడంతో పాటు దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఆలయంగా భద్రాచల పుణ్యక్షేత్రం నిలవనుంది. జరుగుతున్న అభివృద్ధి పనులో భాగంగా రామదాసు నిర్మించిన ప్రధాన ఆలయాన్ని ఏ మాత్రం ముట్టుకోకుండానే మిగతా ఉప ఆలయాలు, పరిపాలన భవనాలు, వంటశాలలు, హోమమండపాలు, పూజా మండపాలు, ఇతరత్రా పనులను చేయనున్నారు. మొదటి విడతగా గోదావరి ఒడ్డున రూ.75 కోట్ల పనులను చేపట్టనున్నారు. అంతే కాకుండా కాంప్లెక్స్ విస్తరణ పనులకు రూ.180 కోట్లు, ఇతర పనులకు రూ.96 కోట్లు కలిపి రూ.351 కోట్ల పనులను పుష్కరాల నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు తయారు చేశారు. కాగా ప్రస్తుతం రూ.200 కోట్ల పనులకు టెండర్లు పూర్తి కాగా మిగతా పనుల టెండర్లు పూర్తి కావాల్సి ఉంది. రెండో విడత రూ.108 కోట్ల పనులు, మూడో విడత రూ.127 కోట్లతో పనులు చేపడతారు. 16వ శతాబ్దంలో భక్త రామదాసు (కంచర్ల గోపన్న) పాల్వంచ పరగణా తహశిల్దార్‌గా పనిచేసిన కాలంలో ఇక్కడ రామాలయాన్ని నిర్మించారు. ఆ తర్వాత 1960లో ఆలయ నూతన గోపుర పనులు చేశారు. అనంతరం కొద్దిపాటి మార్పులు తప్ప ఇప్పటి వరకు ఆలయాభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగలేదు. సినీ దర్శకుడు రాఘవేంద్రరావు నిర్మించి, అక్కినేని నాగార్జున రామదాసు పాత్రలో నటించిన శ్రీ రామదాసు సినిమా అనంతరం భద్రాచలానికి భక్తుల తాకిడి క్రమంగా పెరిగింది. దీంతో ప్రభుత్వం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది దేశంలో ప్రతిష్టాత్మకమైన దేవాలయంగా మార్చేందుకు నడుంబిగించింది. రామాలయాభివృద్ధితో పాటు గోదావరి తీరం, పట్టణ రూపురేఖలు మారిపోనుండటంతో రామభక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## తిప్పనపల్లిలో మోటార్ల వైర్లు చోరీ




**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామంలో ఆరుగురు రైతులకు సంబంధించిన వ్యవసాయ బోరు మోటార్ల విద్యుత్ వైర్లు శనివారం తెల్లవారుజామున చోరీకి గురైనాయి. శనివారం ఉదయం తమ పంట చేనులకు వెళ్లిన రైతులు మీగడ ఉపేందర్, ఎల్లబోయిన వీరబాబు, మీగడ కోటయ్య, నాగినేని వీరస్వామి, రామిశెట్టి నాగేశ్వరరావు, సుబ్బారావులకు సంబంధించిన మోటర్లకు వైర్లను కట్ చేసి ఉండటం గమనించి, చోరీ చేసిన విషయాన్ని గమనించి నివ్వెరపోయారు. తమ పంట చేనుల్లో ఉండే వ్యవసాయ విద్యుత్ మోటార్ల వైర్లు గతంలో ఎన్నడూ చోరీకి గురికాలేదని, ఇప్పడే కావడం మొదటిసారి అని వాపోయారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు తెలిపారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

## మాజీ ఎమ్మెల్యే సుబ్బారావు మృతి



**ప్రజాపక్షం/పెనుబల్లిః** మాజీ శాసనసభ్యులు వంగ సుబ్బారావు (90) శనివారం తుది శ్వాస విడిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇల్లందు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పెనుబల్లి మండలం విఎం బంజర్ గ్రామానికి చెందిన వంగ సుబ్బారావు శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి 1972–78 సంవత్సర కాలంలో ఇల్లందు శాసనసభ్యులుగా సేవలందించారు. ఆయన మృతికి వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పలు పార్టీల నాయకులు విచారం వ్యక్తం చేస్తూ విఎం బంజర్ గ్రామంలోని ఆయన నివాసంలో భౌతిక ఖాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నేడు, రేపు రైతు మేళా

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఈనెల 28, 29 తేదీల్లో చింతకాని మండలంలో జరిగే రైతు మేళాను మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ రైతుమేళాలో 150 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించి యాంత్రీకరణ, విత్తనాలు, ఎరువుల వాడకం, ఆధునిక సాగు, ప్రకృతి వ్యవసాయం, పాడి పరిశ్రమ, ఉద్యానవనం, పంటల సాగు తదితర అంశాలపై రై తులకు అవగాహన కల్పించడంతో పాటు ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహించ డం జరుగుతుందన్నారు. పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సా గుకు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. మండంలోని రైతులు రైతు మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**న్యాయమూర్తి అఖిల గౌడ్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి జి. అఖిల గౌడ్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి అఖిల గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు కోసం ఎన్నో పరిస్థితులు అధిగమించి కళాశాలకు వస్తారని అటువంటి వారిని ర్యాగింగ్ చేయకూడని వారికి సపోర్టుగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. ర్యాగింగ్ నిషేధం, డ్రగ్స్ అరికట్టడం, బాల్య వివాహాలు, ఫోక్సో చట్టాలు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేసుకుని భవిష్యత్తును పాడుచేసుకోవద్దని విద్యార్థినిలకు సూచించారు. విద్యార్థినిలకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే భయపడకుండా ఉన్న చట్టాలను వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా న్యాయవాదులు టి. లిఖిత, డి. కళ్యాణి, ప్రిన్సిపాల్ డా॥ బి.రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.జె. రామారావు, సూపరింటెండెంట్ జానకిరామ్, జువాలజీ ప్రొ. రవిశంకర్, అసిస్టెంట్ ప్రొ. సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద వన మహోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. రామ్మూర్తి తెలిపారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఎదుట మొక్కలు నా టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప ద్మశ్రీ వనజీవి రామయ్య సతీమణి జానమ్మ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిఆర్ఒ రామ్మూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలు నాటి సంరక్షించు కోవడం ద్వారా భావి తరాల భవిష్యత్తుకు మెరుగైన పర్యావరణాన్ని అందించవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్టి కల్చర్ అధికారి అనిశ్రీ, గార్డెన్ ఇంచార్జి హసినాబేగం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సతీమణి నాటేందుకు అవసరమైన మొక్కలను అందజేశారు.

## రైతు భరోసా కోసం దరఖాస్తులు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా పథకం కోసం జులై ఐదు లోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. 30న చింతకాని మండలంలో జరిగే రైతు ఆశీర్వాద సభలో వానాకాలానికి సంబంధించి రైతు భరోసా నిధులు ఎకరానికి ఆరు వేల చొప్పున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేయనున్నారని తెలిపారు. అందులో భాగంగా జూన్ 15 వరకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా పథకం కోసం జూలై ఐదు లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ (ఆధార్‌తో అనుసంధానమైన ఖాతా), మొబైల్ నెంబర్, పట్టాదారు పాసుపుస్తకం లేకపోతే ఆన్‌లైన్ వన్ బి పత్రాలతో మండల వ్యవసాయ అధికారికి కానీ, వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి దరఖాస్తులు అందించవచ్చునని ఆయన తెలిపారు. అర్హులైన నూతన పట్టాదారు పాసుపుస్తకం కలిగిన రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకుని గడువు లోగా రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో సూచించారు.

## కూసుమంచి మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**వానాకాలం రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారంగా**
**వంతెనలు, బిటి రోడ్లు**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఆకాశం నుంచి వర్షపు చినుకులు నేలను తాకుతున్నా..వాతావరణం అనుకూలించకపోయినా లెక్కచేయకుండా, గ్రామీణ రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా ప్రగతి బాట సాగింది. పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో శనివారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు చిరుజల్లులు కురుస్తున్నా.. దుబ్బతండా, లాల్‌సింగ్ తండా, జీళ్లచెరువు గ్రామాల్లో రూ.16.13కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బిటి రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలో తండాలు, పల్లె ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే ఈ పనులను త్వరితగతిన మంజూరు చేయించామని పేర్కొన్నారు. వానలు పడుతున్నా ప్రజల కోసం ప్రగతి పనులు ఆపబోమని, అధికారులు కూడా అంతే వేగంతో నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువు లోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జెడ్‌పి రోడ్డు గైగోల్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10కోట్ల అంచనా వ్యయంతో, అలాగే జెడ్‌పి రోడ్డు నుంచి కొత్తూరు, ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే బిటి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్‌సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు, జీళ్ల చెరువు గ్రామంలో జీళ్లచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్లే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రెండు వంతెనల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు

**సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పేదల పక్షాన పోరాడుతున్న నాయకులను అరెస్టు చేయడం ద్వారా ప్రజా ఉద్యమాలను నిలువరించలేరని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల అనుసరిస్తున్న వైఖరి ఆక్షేపణీయమని ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారిని అమానుషంగా తొలగించడమే కాకుండా వారికి మద్దతుగా నిలిచిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుతో పాటు వామపక్ష నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గుడిసెలు తొలగించిన పేదలకు తక్షణం ప్రత్యామ్నాయ స్థలాలను చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. కూనంనేనితో పాటు వామపక్ష నేతల అరెస్టుకు తగిన మూల్యం చెల్లించక తప్పదని సురేష్ తెలిపారు. గతంలో పేదలను విస్మరించిన ప్రభుత్వాలు ఏ పరిస్థితి ఎదురైందో ఈ ప్రభుత్వానికి కూడా అదే పరిస్థితి ఎదురవుతుందన్నారు. వందల ఎకరాలు ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం తలదాచుకునేందుకు గుడిసెలు వేసుకున్న వారి పట్ల మాత్రం నిర్దాయగా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. ఖమ్మంలో పేదలను ప్రభుత్వ స్థలాల నుండి తరలించి పెద్దలు అక్రమించుకుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో జిల్లా అధికారులు సమాధానం చెప్పాలన్నారు. నివాస స్థలాలను ప్రభుత్వమే కేటాయించాలని లేని పక్షంలో పేదలను సమీకరించి రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ నేతృత్వంలో ఆందోళనలు చేపడతామని ఆయన తెలిపారు.

## ఏసిబికి చిక్కిన పంచాయతీ కార్యదర్శి



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని బాణాపురం గ్రామానికి సంబంధించిన ఇంటి నిర్మాణ అనుమతికై రూ.25వేలు అంచం అడిగి, అవినీతి నిరోధక శాఖ అధికారులకు శనివారం పంచాయతీ కార్యదర్శి తమ్మిశెట్టి సురేశ్ ప్రత్యక్షంగా పట్టుబడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఇంటి నిర్మాణ అనుమతి మంజూరు కోసమై రూ.25వేలు అడగడంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించగా అధికారులు ప్రణాళికతో నిందితుడిని పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

## పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ

**ఎమెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. శనివారం సారపాక గ్రామ పంచాయతీ పరిధిలోని సుందరయ్యనగర్ కాలనీలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రజలకు ఓటరు జాబితా సవరణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిఎల్‌ఎలు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించే సమయంలో రాజకీయాలకు అతీతంగా, ఎలాంటి పక్షపాతం లేకుండా పని చేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హులైన వారి పేరు ఓటరు జాబితాలో తప్పకుండా నమోదు కావాలని అన్నారు. కొత్త ఓటర్లు, చిరునామా మారిన వారు, పేర్లలో తప్పులు ఉన్నారు. అలాగే మరణించిన వారి పేర్లు తొలగింపు వంటి అన్ని మార్పులు ఈ ప్రక్రియలోనే చేయవచ్చని తెలిపారు. ప్రజలు తమ వివరాలను ఓటర్ పోర్టల్ లేదా బిఎల్ఒల ద్వారా సరిచూసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటరు జాబితా సవరణ కీలకమని పేర్కొన్న ఆయన, ప్రతి అర్హుడి ఓటు హక్కు రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఒలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఐక్యతతోనే సంఘాలు బలోపేతం, హక్కుల సాధన

**బాధ్యతతో అంగన్వాడీ సమస్యలపై పోరాటం**
**నూతన కమిటీ అంకితభావంతో ముందుకు**
**ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కంచర్ల**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఐక్యతోనే సంఘాల బలోపేతం, హక్కుల సాధన సాధ్యమని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో ఎఐటియుసి అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ కొత్తగూడెంప్రాజెక్టు పరిధిలోని ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన జమలయ్య మాట్లాడుతూ యూనియన్ బాధ్యతలు మన బాధ్యతలుగా గుర్తిస్తూ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీని ఆయన అధికారికంగా ప్రకటించారు. నూతన గౌరవ అధ్యక్షుడిగా గోనె మణి, అధ్యక్షుడిగా జి. ప్రమీల, ప్రధాన కార్యదర్శిగా ఎం. కోమల, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్. సరోజ, ఉపాధ్యక్షులుగా కృపమ్మ, కృష్ణవేణి, జానకి, వేణి, సహాయ కార్యదర్శులుగా కళావతి, ఎస్ రమాదేవి వెంకటరమణ, కోశాధికారి జి శ్రీదేవిలను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు వారి విధులను, బాధ్యతలను ఆయన సుదీర్ఘంగా వివరించారు. ఇదే క్రమంలో ఇంతకాలంగా ప్రధాన కార్యదర్శి సేవలందించి విధుల నుండి తప్పుకున్న గోనె మణిని శాలువా, పూల మాలతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు నేరెళ్ల రమేష్, అంగన్వాడీ అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

## సిపిఐ ఎమ్మెల్యే అక్రమ అరెస్ట్‌కు ఖండన



**ప్రజాపక్షం/కల్లూరుః** సిపిఐ ఎమ్మెల్యే సాంబశివరావుతో పాటు ఇతర వామపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ..శనివారం కల్లూరులో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, కల్లూరు సిపిఐ మండల నాయకులు కొత్తపల్లి వెంకటనారాయ ఎఐటియుసి, జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు సమావేశం నిర్వహించారు. కల్లూరులోని కార్మిక సంఘాలు ఏర్పాటుచేసిన సమావేశంలో పార్టీ బాధ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు, బలహీనవర్గాల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం దమన కాండ మానుకోవాలని అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేసి పేదలకు ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చి మంజూరు చేయాలని డిమాం డ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆశీర్వాద సభకు ముమ్మర ఏర్పాట్లు

**రైతు మేళా ఒక రోజుకు కుదింపు**
**వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తున్న అధికారులు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం 30న నిర్వహించతలపెట్టిన రైతు ఆశీర్వాద సభకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట, జిల్లా స్థాయి అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ దగ్గరుండి ఏర్పాట్లను చూస్తున్నారు. అయితే ఆది, సోమవారాల్లో జరగాల్సిన రైతు మేళాకు సంబంధించి రెండు రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వం భావించినప్పటికీ ఒక రోజుకు కుదించారు. వాతావరణ శాఖ మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని హెచ్చరిస్తున్న నేపథ్యంలో స్టాల్స్ నిర్వహణపై ఇంకా స్పష్టత రాలేదు. ఈనెల 30న జరగనున్న సభకు సంబంధించి 80 ఎకరాల్లో పార్కింగ్‌ను ఏర్పాటు చేయనుండగా మత్కేపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో 40 ఎకరాల్లో సభా స్థలిని ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ శనివారం సభా స్థలిని పరిశీలించి స్థానిక అధికారులతో సభా ఏర్పాట్లపై చర్చించారు. భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటి అన్న దానిపైన అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. ప్రస్తుతానికైతే ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఖమ్మం సిపి సునీల్ దత్, వైరా ఏసిపి సారంగపాణి, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ శాసన సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పోలీసులకు సన్మానం

**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ వేధిపులతో (2018) ఓ వ్యక్తి ఆత్మహత్య కారకులకు న్యాయస్థానం శిక్షను ఖరారు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులను శనివారం బాధిత కుటుంబీకులు సన్మానించి సత్కరించారు. మండల పరిధిలోని పేరాయిగూడెం నెహ్రూనగర్ చెందిన తగరం ముత్యాలరావు కెమిల్ ఎయిడ్స్ కర్మాగారంలో పనిచేసే తన భార్య అదే గ్రామానికి చెందిన తగరం వెంకటేశ్వరరావుతో వివాహేతర సంబంధం పెట్టుకుని వేధిస్తున్న క్రమంలో పోలీసులు విచారణ చేపట్టి ఆత్మహత్యకు కారకులైన వారికి న్యాయమూర్తి కవిత శిక్ష ఖరారు చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. నిందితులకు శిక్ష ఖరారులో నిజాయితీగా విచారణ చేపట్టిన ఎస్ఐలు వేల్పుల వెంకటేశ్వరరావు, మధు ప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ ప్రశాంత్ తదితరులను సన్మానించారు.

## యువతలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం

**అదుపు చేయడంలో అధికారులు విఫలం**




**ప్రజాపక్షం/తల్లాడ:** ఇటీవలి కాలంలో యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాదకద్రవ్యాల బారిన పడుతున్న యువత సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండటం సమాజానికి ప్రమాదకర సంకేతంగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువకులు, కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కొందరు అక్రమంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు సమాచారం. దీంతో యువత భవిష్యత్ అంధకారంలోకి వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. విద్యాసంస్థల సమీపంలో ఉన్న బడ్డీ దుకాణంలో మాదక వస్తువులు అమ్మడం పర్వసాధారణంగా మారింది. ప్రతీ గ్రామంలో మందుల దుకాణంలో మందులతోపాటు మత్తు కలిగే పాకెట్లు అమ్మడం, విద్యార్థులు వాటికి అలవాటు పడటం తీవ్రస్థాయికి చేరింది. డ్రగ్స్ అలవాటు పడిన యువత చదువుపై దృష్టి కోల్పోవడంతో పాటు కుటుంబ సభ్యులతో విబేధాలు, మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొంతమంది నేరాలకు పాల్పడటం, రోడ్డు ప్రమాదాలుకు కారణం అవడం, హింసాత్మక సంఘటనల్లో పాల్గొనడం వంటి సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే అనుమానాస్పద పరిచయాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. డ్రగ్స్ సరఫరా వినియోగాలపై సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి తగు చర్యలు తీసుకుంటారని పోలీసుశాఖ తెలియజేస్తోంది. యువత దేశ భవిష్యత్తు అని, వారిని మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొంటున్నారు.

## పటిష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలు సహకరించాలి



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** పటిష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ సుజాత ఇంటింటికి అందిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాలు, రిజిస్టర్ లో నమోదులు, యాప్ ఎంట్రీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002 ఓటరు జాబితా ప్రకారం మ్యాపింగ్ చేయాల్సి ఉన్నదని తెలిపారు. బూత్ స్థాయి సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాలు ఇస్తారని అందులో ఉన్న వివరాలు నమోదు చేయాలని ఓటర్లకు అవగాహన కల్పించారు. బూత్ స్థాయి అధికారి వద్ద ఒకరు జాబితా ఉంటుందని ప్రతి ఒక్కరు తమ పేర్లు పరిశీలించుకోవాలని తెలిపారు. జాబితాలో పరిశీలన అలాగే అనర్హులైన వారి పేర్లను తొలగించేందుకు జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమానికి సహకరించాలని ఆయన కోరారు. ఓటరు జాబితా పరిశుద్ధత ప్రజాస్వామ్యానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అర్హత ఉన్న వారు తమ పేరు నమోదు చేయించుకోవడమే కాకుండా, మరణించిన వారు, మారిన వారు వంటి అనర్హుల వివరాలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఇందుకోసం ఎన్నికల శాఖ ప్రత్యేకంగా చేపట్టిన సర్వే కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ప్రజలు సమగ్ర సమాచారం అందించి సహకరించాలని కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పర్యవేక్షణ చేస్తారని ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్వేత, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ‘నేడు’ పల్స్ పోలియో

### 293 పోలియో బూత్‌లు..16 మొబైల్ బృందాలు



**ప్రజాపక్షం/జనగామ:** ఈ నెల 28న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పిలుపునిచ్చారు. జనగామ జిల్లాలో పల్స్ పోలియో విజయవంతం చేయడం కోసం 293 పోలియో బూత్‌లు, 16 మొబైల్ బృందాలు, 16 ట్రాన్సిల్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జనగామ జిల్లాలో 5 సంవత్సరాల లోపు పిల్లలు 48వేల 493 మంది ఉన్నారన్నారు. వీరందరికి పోలియో చుక్కలు వేయడం కోసం వైద్య, ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. 28న పోలియో బూత్‌లో చుక్కలు వేయడంతో పాటు 29,30 తేదీల్లో ఇంటింటికి వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. పల్స్ పోలియో విజయవంతం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆవా వర్కర్లు, బూత్ స్థాయి వాలీంటర్లు పంచాయతీ కార్యదర్శులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పని చేయనున్నారన్నారు. వీరంతా ముందే ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి చిన్నారుల వివరాలు సేకరించారన్నారు. ముఖ్యంగా వలస కూలీలు, ఇటుక బట్టి, నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికుల పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమన్వయం చేసుకుంటు ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ వంటి రద్దీ ప్రాంతాల్లోనూ పోలియో బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చిన్నారులకు తప్పక పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

## పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు



**ప్రజాపక్షం/ములుగు:** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆరోగ్యశాఖతో పాటు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన మహిళా సంఘాలు సహకరించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు కోరారు. శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో పల్స్ పోలియో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికి వెళ్ళి చుక్కలు మిస్ అయిన పిల్లలకు వ్యాక్సిన్ అందిస్తామని చెప్పారు. జిల్లాలో 0....5 సంవత్సరాల వయస్సు గల 22572 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి 312 బూతులు, 36 రూట్ బృందాలు, బస్టాండ్ల వద్ద ప్రత్యేక బూతులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధీర్, జిల్లా టీకాల నియంత్రణ అధికారి డాక్టర్ నాగ అన్వేష్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రంజిత్, పాల్గొన్నారు.

## ట్రైనీ కలెక్టర్ సందర్శన

**ప్రజాపక్షం/వేలేరు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలు అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను డిప్యూటి ట్రైనీ కలెక్టర్ ఎన్ రోహిత్ శనివారం హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం మండల కేంద్రం శివారులోని బాల్లె శ్రీనివాస్‌కు సంబందించిన ఆయిల్ ఫామ్ వ్యవసాయ కేంద్రాన్ని సందర్శించి కేంద్రం నిర్వహణ విధానం, ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సాహక విధానాన్ని గూర్చి రైతు బాల్లె శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మండలస్థాయిలో అమలు అవుతున్న విధానం, పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, రైతు సంక్షేమ కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంపొందించుకోవడం ఈశిక్షణా పర్యటన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బిల్ల యాదగిరి, ఎంపిడిఒ కిషన్, ఎంపిఒ విజయ, జూనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్, రైతు బాల్లె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

### జిల్లా విద్యాశాఖ అధికారి యం.రాజేందర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లా లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుండి 2026–27 విద్యా సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఢిల్లీ వారు ఆహ్వానిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి యం.రాజేందర్ తెలిపారు. nationalawardstoteachers.education. gov.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తులను జులై 10వ తేది లోగా రిజిస్ట్రేషన్ చేసుకోగలరని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోగలరని రాజేందర్ తెలిపారు.

## ‘కౌశల్ మహోత్సవ్’తో యువతకు ఉపాధి అవకాశాలు

### మహోత్సవ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేలు నాయిని, కె.ఆర్. నాగరాజు



**ప్రజాపక్షం/హనుమకొండ:** కౌశల్ మహోత్సవ్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా అవుతాయని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు తెలిపారు. శనివారం హసన్ పర్తిలోని కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) లో కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ కౌశల్ మహోత్సవ్ – కౌశల్ భారత్, వికసిత్ భారత్ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు మాట్లాడుతూ తెలంగాణలో హైదరాబాద్ తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం వరంగల్ అని పేర్కొన్నారు. ఇప్పటికే వరంగల్ విద్యా కేంద్రంగా ఎదిగిందని, రానున్న రోజుల్లో హెల్త్ సిటీ, స్పోర్ట్స్ హబ్‌గా కూడా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు.మామునూరు విమానాశ్రయం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల ద్వారా వరంగల్ ప్రాంతంలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయని తెలిపారు. స్థానిక యువత ఆ అవకాశాలను అందిపుచ్చుకునేలా అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఉద్యోగాలకు అవసరమైన ప్రావీణ్యం, శిక్షణను అందించడంలో ఇలాంటి కుషల్ మహోత్సవ్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్,మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే, కిట్స్ కళాశాల చైర్మన్ ఒడితల సతీష్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

## ములుగు జిల్లా రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని మంత్రి సీతక్కకు వినతి



**ప్రజాపక్షం/ములుగు:** ములుగు జిల్లాలోని రైస్ మిల్లర్ల సమస్యలతో సతమతం అవుతున్నామని, ప్రభుత్వం స్పందించి మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైస్ మిల్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ కోరారు. ఈ మేరకు శనివారం రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులందరూ హైదరాబాద్‌కు చేరుకొని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆమెకు అందజేశారు. దానికి స్పందించిన మంత్రి సీతక్క వెంటనే సివిల్ సప్లయి కార్పొరేషన్ కమిషనర్‌కు ఫోన్ చేసి రైస్ మిల్లర్ల సమస్యను పరిష్కారం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ములుగు జిల్లాలో గత 2024–25 రబీ సీజన్‌లో 78వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రొక్యూర్మెంట్ జరిగిందని అన్నారు. ఈసారి అనూహ్యంగా దిగుబడి పెరిగి లక్ష 13వేల మెట్రిక్ టన్నుల ధాన్యం జిల్లాలో గోదాముల కొరత వలన ఆరుబయట ఓపెన్ స్పేస్‌లో నిలువ చేయడం జరిగిందని తెలిపారు. అకాల వర్షాలకు ధాన్యం క్వాలిటీ దెబ్బతిని ఎఫ్‌సిఐలో వెంటనే బియ్యం పాస్ కావని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి జిల్లాకు బాయిల్డ్ బియ్యం ఎఫ్‌సిఐకి పెట్టుటకు పర్మిషన్ ఇప్పించాలని కోరారు. అందులో భాగంగా మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి సివిల్ సప్లయి కార్పొరేషన్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సహోదరు రెడ్డి, ఎలగందుల మోహన్, గౌరవ అధ్యక్షులు పల్లెపాటి సంగిరెడ్డి, గౌరవ సలహాదారులు రాణి శ్రవణ్ కుమార్, అనిల్ కుమర్‌లు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌పై యూత్ కాంగ్రెస్ నిరసన



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మ మైదాన్‌లో ఛాత్రోంకి గూంజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్తారోకో చేపట్టి ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ మంత్రి, ఎంఎల్‌సి బస్వరాజు సారయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ ఆయూబ్‌లో పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని, పరీక్షల పేపర్ లీక్‌తో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, కాంగ్రెస్ నాయకులు నల్లగొండ రమేష్, గుండేటి నరేందర్, సోమ లక్ష్మి, కరాటే ప్రభాకర్, గజ్జల లింగమూర్తి, కోదాటి అనిల్ కుమార్, గోరంట్ల రాజు, మార్షల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి

### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ :** అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రీ స్కూల్ విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. చిన్నారులకు అందించే ఆహారం నాణ్యంగా ఉండడంతో పాటు అంగన్వాడీ కేంద్రాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించబడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ తరగతులు, విద్యార్థుల హాజరు, పోషణ్ అభియాన్ అమలు, ఐదేళ్ల లోపు పిల్లల ఎదుగుదలను, బరువును పరీక్షించడానికి శామ్, మామ్ పిల్లల పరిస్థితి తదితర అంశాలపై జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి విశ్వజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అంగన్వాడీ కేంద్రాలకు హాజరవుతున్న చిన్నారుల సంఖ్య, ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) ద్వారా హాజరు నమోదు, శామ్, మామ్ పిల్లల వివరాలు, పోషకాహార పంపిణీ తదితర అంశాలను కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరును తప్పనిసరిగా ముఖ గుర్తింపు విధానం ద్వారా నమోదు చేయాలని సూచించారు. బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి అవసరమైన పోషకాహారం అందిస్తూ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేలా క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల లోపు పిల్లల ఎదుగుదలను, బరువును పరీక్షించడానికి శామ్, మామ్ పిల్లల ఇళ్లను అంగన్వాడీ టీచర్లు నిరంతరం సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించడంతో పాటు తల్లిదండ్రులకు సమతుల్య పోషకాహారం, మంచి ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో చిన్నారులు డయేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా పరిశుభ్రత, సురక్షిత తాగునీటి వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పరిశుభ్రత తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి విశ్వజ, ఐసీడీఎస్ సిడిపిఓ లు, సూపర్‌వైజర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారానికే భూ సర్వే

### 12 ఏళ్లు మోకా మీద ఉన్న రైతులకే పట్టాలు
### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూ సమస్యల పరిష్కారానికై భూ సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగిందని, రైతులు భూముల సర్వే, పట్టాల జారీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి రూరల్ మండలం కమలాపూర్ లో అలాగే గణపురం మండలం బుద్ధారం గ్రామంలో తెలంగాణ భూ సర్వే సరిహద్దుల నిర్ధారణ పై నిర్వహించిన గ్రామ సభలలో ముఖ్య అతిథిగా గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం ఆదేశాల మేరకు భూముల సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి రైతుకు పట్టాలు అందించేందుకు చర్యలుతీసుకుంటున్నామని అన్నారు. నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది పట్టాదారులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించిందన్నారు. భూపాలపల్లి నియోజక వర్గంలో తదితర గ్రామాల్లో వేల ఎకరాల భూములకు సంబంధించి పట్టాల సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి సర్వే ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. భూమి యజమాని ప్రత్యక్షంగా హాజరు కాకపోయినా, సంబంధిత వివరాలు నమోదు చేసి సర్వే పూర్తి చేసి 12 సంవత్సరాలు సాగులో ఉన్న రైతులకు పట్టాలి ఇచ్చే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. పట్టాలు లేక రైతు భరోసా, రైతు బీమా, భూముల రిజిస్ట్రేషన్ వంటి ప్రయోజనాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రైతులందరూ సర్వే కార్యక్రమంలో పాల్గొని తమ భూముల హక్కులను నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో ఎమ్మెల్యే వెంట ఆర్డిఓ, ఏడి ల్యాండ్ సర్వే అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలియో చుక్కలు అందేలా సమన్వయంతో పనిచేయాలి: డా.స్వాతి



**ప్రజాపక్షం/నడికూడ :** జూన్ 28,2026న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పరకాల రెవెన్యూ డివిజన్ స్థాయి అన్ని శాఖల అధికారుల సన్నాహక సమావేశం నడికూడ మండలం రాయపర్తి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి అధ్యక్షతన నిర్వహించగా వైద్య ఆరోగ్య శాఖ,ఐసీడీఎస్,విద్యాశాఖ,పంచాయతీ రాజ్,ఆశా కార్యకర్తలు,అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి మాట్లాడుతూ జూన్ 28న ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయనున్నట్లు,రెండు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన పిల్లలకు సిబ్బంది పోలియో చుక్కలు అందజేస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు.

## మహిళా పోలీస్ స్టేషన్ కోసం స్థలం పరిశీలించిన సిపి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్:** సుబేదారి పోలీస్ స్టేషన్ అవరణలో ప్రస్తుతం వున్న మహిళా పోలీస్ స్టేషన్‘1 కై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శనివారం అధికారులతో కలసి స్థల పరిశీలన చేశారు. ఇందులో భాగంగా భీమారంలోని పూర్వ సి.ఆర్.పి.ఎఫ్ క్యాంపులో పలు ప్రదేశాలను పరిశీలించారు. ఇందులో భాగంగా హన్మకొండ జిల్లా నలు మూలల నుండి వచ్చే బాధితులను త్వరితగతిన మహిళా పోలీస్ స్టేషన్ చేరుకోవడంతో పాటు, నూతనంగా ఏర్పాటు మహిళా పోలీస్‌స్టేషన్‌కు అవరమైన మౌళిక వసతులతో పాటు, ఇక్కడి వచ్చే వారికి వాహన పార్కింగ్ లాంటి మొదలైన అంశాలు దృష్టిలో వుంచుకోని పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ అధికారులతో క్షేత్ర స్థాయిలో స్థల పరిశీలన నిర్వహించడంతో పాటు, నిర్మాణ పనులకు పోలీస్ కమికషనర్ అధికారులతో చర్చించారు. సిపి వెంట క్రైమ్స్ అదనపు డిసిపి బాలస్వామి, క్రైమ్స్ ఏసిపి సదయ్య, సురేంద్ర, రవికుమార్, రాఘవేందర్, సతీష్ పాల్గోన్నారు.

## 15 రోజుల్లో పరకాలను క్లీన్ సిటీగా తీర్చిదిద్దుతా

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల పట్టణాన్ని ప్రత్యేక కార్యాచరణతో 15 నుంచి 20 రోజుల్లో క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల సమన్వయంతో ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగు నీటి పారుదల, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. శనివారం పరకాల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పురపాలక సంఘం సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2027 డిసెంబర్ నాటికి పరకాల పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. స్లమ్ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ జీ ప్లస్–2 విధానంలో ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, ఇందుకు ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. మున్సిపల్ సిబ్బంది హాజరు పర్యవేక్షణ కోసం రెండు బయోమెట్రిక్ యంత్రాలను వెంటనే కొనుగోలు చేయాలని, ప్రస్తుతం ఉన్న యంత్రాన్ని మరమ్మతు చేయించాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని స్పష్టం చేశారు. వర్షాకాలంలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట్ల డ్రైనేజీ నిర్మాణానికి డీపీఆర్‌లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెల అన్ని విభాగాల పనితీరును మున్సిపల్ కమిషనర్ సమీక్షించాలని, మున్సిపల్ కార్యాలయంపై సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో పారిశుద్ధ్య నిర్వహణ పనుల కోసం రూ.4.68 లక్షల వ్యయానికి సభ్యులు ఆమోదం తెలిపారు. ఎస్సీ కాలనీల్లో ఇంటి నంబర్లు లేని ఇళ్ల అంశాన్ని రెవెన్యూ, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పరిశీలించాలని తహసీల్దార్ విజయలక్ష్మి , మున్సిపల్ కమిషనర్ పవన్‌కు సూచించారు.ఈ సమావేశంలో తహసీల్దార్ విజయలక్ష్మి , ఏసీపీ సతీష్ బాబు, వివిధ శాఖల అధికారులు, వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది నాణ్యమైన విద్యే అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం మండలంలోని కేజీబీవీ పాఠశాల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి విద్యార్థులకు అందిస్తోన్న అన్ అకాడమీ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వంటశాల, భోజన నాణ్యత, పారిశుద్ధ్యం, విద్యార్థుల వసతి, తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి స్లిప్ టెస్ట్, అలాగే మాక్ టెస్ట్ నిర్వహించి, విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేయాలన్నారు. నేడు కష్టపడి చదివితేనే రేపు డాక్టర్లు, ఇంజనీర్లు, ఉన్నతాధికారులుగా ఎదిగి మంచి ఉపాధి, ఆదాయం సంపాదించి, కుటుంబ సభ్యులను సంతోషపెట్టగలరని విద్యార్థులను ప్రోత్సహించారు. ఉపాధ్యాయులు ఫాస్ట్ మ్యాథ్స్ పుస్తకాన్ని ప్రతి రోజు అధ్యాయం వారీగా విద్యార్థులతో అభ్యసింపజేయాలని సూచించారు. ఈ సందర్శనలో ఆర్డీవో గోపిరాం, విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీవో గౌసియా బేగం, ఇతర సంబంధిత అధికారులు, కేజీబీవీ ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

**ఓటరు జాబితాల ఖచ్చితత్వమే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ లక్ష్యం: కలెక్టర్**

ఓటరు జాబితాలను పూర్తిస్థాయిలో ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించడమే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, ఈ ప్రక్రియలో భాగంగా ఎవరైనా ఓటర్ల పేర్లను తొలగిస్తారనే అపోహలను ప్రజలు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. శనివారం మండలంలో జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణి ప్రక్రియను కలెక్టర్ సందీప్ పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఫారాలను పంపిణి చేస్తున్న బీఎల్వోల పనితీరును పర్యవేక్షించి, వారికి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గోపిరాం, తహశిల్దార్, అధికారులు, బీఎల్వోలు, పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణకు ప్రజల సహకారం అవసరం: కలెక్టర్

**ప్రజాపక్షం/ములుగు:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్..2026) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఇంటింటికి వచ్చే బూత్ స్థాయి అధికారులకు (బిఎల్‌ఓలు) ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు కోరారు. జిల్లాలో 303 మంది బిఎల్‌ఓలు, 30 మంది సూపర్‌వైజర్లు ఇంటింటికి వెళ్ళి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఎన్యూమరేషన్ ఫారాన్ని అందజేసి కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా, ఓటరు నమోదు సమాచారాన్ని పరిశీలించి సరైన వివరాలు ఇవ్వాలని సూచించారు. ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్ల తొలగింపు, మరణించిన ఓటర్ల పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ వంటి ప్రక్రియలు ఈ కార్యక్రమంలో భాగమని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణకు 9 మంది సహాయ ఎన్నికల నమోదు అధికారులు, ఒక ఎన్నికల నమోదు అధికారి పర్యవేక్షణలో సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైందని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా ప్రజలు బాధ్యతగా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రతీ ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

## పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఓటరు నమోదు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జులై 3వ తేదీలోపు ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం పెద్దపల్లి పట్టణంలోని 4 వ వార్డు ప్రగతి నగర్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్వహిస్తున్న ఫారాల పంపిణీ, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జులై 3 నాటికి ఫారాల పంపిణీ ప్రక్రియను పూర్తిస్థాయిలో ముగించాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో బీఎల్‌వోలకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు పూర్తి సహకారం అందిస్తూ ఫారాల పంపిణీని వేగవంతం చేయాలని తెలిపారు.ప్రతి ఓటరికి రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని, ఒక ఫారాన్ని ఓటరు వివరాలతో నింపించి స్వీకరించగా, మరో ఫారంపై స్వీకరణ ధృవీకరణ చేసి రసీదుగా ఓటరికి తిరిగి అందజేయాలని సూచించారు.ఈ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఇంటికి చేరుకొని ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందించేలా అధికారులు, బీఎల్‌వోలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ పరిశీలనలో పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య,మున్సిపల్ కమిషనర్ వెంకటేష్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం అక్రమాలపై 11 మందిపై కేసు నమోదు

మంథని మండలం మల్లేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన అక్రమాల వ్యవహారాన్ని జిల్లా యంత్రాంగం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లైస్ శాఖ తనిఖీ నివేదికలు, పంచనామా, సంబంధిత అధికారుల నివేదికల ఆధారంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఏసిఎస్) అధికారులు మంథని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, 11 మందిపై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) FIR No: 137 తేదీ :25/06/2026 ,సెక్షన్లు318(4), 316(4),3 16 (5),338,61(2) కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.ప్రాథమిక విచారణలో ట్యాబ్ ఆపరేటర్ నకిలీ ట్రక్ చిట్లు సృష్టించడం, కొనుగోలు రికార్డుల్లో అక్రమ నమోదులు చేయడం, స్టాఫ్ అసిస్టెంట్ అక్రమ ధాన్యం రవాణాకు సహకరించడం, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ ప్రమేయంతో కుట్రపూరితంగా వ్యవహరించినట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రమేయం ఉన్న 11 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు, దర్యాప్తులో మరెవరి ప్రమేయం వెలుగులోకి వచ్చినా వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.తనిఖీల్లో మూడు లారీల్లో తరలిస్తున్న 2,213 బస్తాల (885.20 క్వింటాళ్లు) ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎనిమిది నకిలీ ట్రక్ చిట్ల ద్వారా 5,421 బస్తాల (2,168.40 క్వింటాళ్లు) ధాన్యాన్ని కొనుగోలు రికార్డుల్లో అక్రమంగా నమోదు చేసినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు పేర్కొన్నారు.రైతుల శ్రమను దోపిడీ చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పూర్తి పారదర్శకతను పాటించేలా అన్ని కొనుగోలు కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తప్పవని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రకటనలో తెలిపారు.

## రహదారి భద్రతకు క్రాష్ బారియర్ల ఏర్పాటు




**ప్రజాపక్షం/ముత్తారం :** గత కొద్ది రోజుల క్రితం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ నుండి అమరాబాద్ కు వెళ్లే బతుకమ్మ చెరువు కట్ట రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని,ఇరువైపులా రక్షణ కంచె లేకపోవడం వల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని ప్రజాపక్షం దినపత్రికలో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది.ఈ కథనానికి అధికారులు వెంటనే స్పందించారు.యుద్ధప్రాతిపదికన రక్షణ కంచె నిర్మాణంతాజాగా అధికారులు సదరు బతుకమ్మ (ఊర చెరువు) కట్ట రహదారిపై యుద్ధప్రాతిపదికన అత్యాధునిక స్టీల్ క్రాష్ బారియర్లను ఏర్పాటు చేశారు.

## ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి



**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** మల్లాపూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేవల్లి తిరుపతి ఆధ్వర్యంలో రాఘవపేట గ్రామంలో ప్లాస్టిక్ రహిత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ ప్లేట్ల వాడకాన్ని తగ్గించి స్టీల్ ప్లేట్ల వాడకాన్ని వినియోగించేలా ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేవల్లి తిరుపతి,కార్యదర్శి మండ స్వామి,శశిధర్, కోశాధికారి మిల్క నవీన్ రెడ్డి, సభ్యులు ప్రసాద్, లక్ష్మణ్ ,లక్ష్మి రెడ్డి ,నారాయణ ,తదితరులున్నారు.

## నేడు పల్స్ పోలియో

**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** 28(ఆదివారం) నిర్వహిస్తున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు వయస్సు గల ప్రతీ చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మండల వైద్యాధికారి డా.ఎల్లాల అంజిత్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.భారతదేశం పోలియో రహిత దేశంగా కొనసాగాలంటే ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్స్ పోలియో బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు ఉచితంగా పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. మొదటి రోజు బూత్‌లలో చుక్కలు వేయించిన అనంతరం, మిగిలిన రోజుల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేస్తామని వెల్లడించారు. వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు,ఏఎన్ఎంలు,అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పాల్గొంటారని తెలిపారు. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలను సమీప పల్స్ పోలియో బూత్‌కు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డా. ఎల్లాల అంజిత్ రెడ్డి కోరారు.ఒక్క చిన్నారిని కూడా మిస్ కాకుండా, ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు వేయిద్దాం, పోలియో రహిత సమాజ నిర్మాణానికి మన మందరం కలిసి కృషి చేద్దాం అని ఆయన పిలుపునిచ్చారు.

## స్మోకింగ్ జోన్లపై కఠిన చర్యలు: సిఐ



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** స్మోకింగ్ జోన్లపై కఠిన చర్యలు తప్పవని పెద్దపెల్లి సిఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.పెద్దపల్లి పట్టణంలోని బహిరంగ ధూమపాన కేంద్రాలు (స్మోకింగ్ జోన్లు) లక్ష్యంగా శనివారం పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు నిర్వహించారు.సిఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో టౌన్,రూరల్ పోలీసు బృందాలు ఏకకాలంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి.ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న పలువురికి కోప్టా చట్టం ప్రకారం జరిమానాలు విధించారు.ఈ సందర్భంగా సిఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, కోప్టా చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇకపై బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపైనా, నిబంధనలకు విరుద్ధంగా స్మోకింగ్ జోన్లు నిర్వహించే వారిపైనా కోప్టా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో టౌన్ ఎస్ఐ కె. నరేష్, రూరల్ ఎస్ఐ మధుకర్, ఎస్ఐ నరేష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినతి పత్రం



**ప్రజాపక్షం / చందుర్తి :** తమ గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కి శనివారం వినతి పత్రం అందజేసినట్లు మండలం లోని తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ కాపిల్ల శంకర్ తెలిపారు.గ్రామం లో మహిళా స్వశక్తి సంఘ భవన నిర్మాణం , పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సహకరించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఎద్ల హరీష్ , నల్లపు దివాకర్ , నందగిరి తిరుపతి,రమేష్ , రాజు , అశోక్ ,స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పోలియోకు 568 కేంద్రాలు



**ప్రజాపక్షం/సిద్దిపేట జిల్లా ప్రతినిధి :** జిల్లాలో నేడు ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. జిల్లాలో 0 నుండి 5 (సంవత్సరాల) ఎళ్ల లోపు 94,321 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి 568 కేంద్రాలు, మరియు 32 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, వలస కుటుంబాల పిల్లలకు ప్రత్యేక మొబైల్ బృందాల ద్వారా చుక్కలు వేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆదివారం కేంద్రాలకు రాని పిల్లలకు జూన్ 29 మరియు 30 తేదిల్లో ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడి సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ హైమావతి విజ్ఞప్తి చేశారు.

## అధిక ధరలకు ఎరువుల విక్రయాలు?

### పట్టించుకోని అధికారులు.. అధికారుల తీరుపై రైతులు ఆగ్రహం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలో ఎరువుల బ్లాక్ మార్కెట్ దందా యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా కొందరు డీలర్లు ఎరువులను గరిష్ట విక్రయ ధర కంటే భారీ ధరలకు అమ్ముతూ పెట్టుబడి సమయాల్లో రైతుల రక్తాన్ని పిండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, కనీస తనిఖీలు కూడా చేయడం లేదని రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చే స్తోంది.

**సుమారు రూ. 1,550 బస్తా.. రూ. 2,300 కి విక్రయం:**తాజాగా ముత్తారం మండలంలోని ఓ గ్రామంలో ఉన్న ఫర్టిలైజర్ షాపులో ఈ దోపిడీ బహిర్గతమైంది. మార్కెట్లో సుమారుగా రూ. 1,450 నుండి1550 ధర పలికే 2828 కోరమండల్ ఎరువుల బస్తాను, సదరు వ్యాపారి ఓ అమాయక రైతుకు ఏకంగా రూ. 2, 300 కు విక్రయించాడు.నిబంధనల ప్ర కారం ఫర్టిలైజర్ షాపుల్లో ధర ల పట్టికను ప్రదర్శించా ల్సి ఉన్నా, బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉన్నా ఎక్క డా అది అమలు కావడం లే దు. అధికారులు, వ్యాపారులుకుమ్మక్కుకావడంవల్లే అక్రమ విక్రయాలు సా గుతున్నాయనిరైతులుబహిరంగంగానేఆరోపిస్తున్నారు.

### చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్

పెట్టుబడులు పెరిగి, అప్పుల పాలవుతున్న తరుణంలో ఎరువుల డీలర్లు ఇలా దోపిడీకి పాల్పడటం సరికాదని రైతులు పేర్కొంటున్నారు. ముత్తారం మండలంలో తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్న ఫెర్టిలైజర్ షాపులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన షాపుల లైసెన్సులను రద్దు చేసి, యజమానులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## హక్కుల సాధన కోసం సమ్మెకైనా వెనుకాడం

### ఎఐటియుసి అధ్యక్షుడు సీతారామయ్య



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం ఎఐటియుసి సమ్మెకైనా వెనుకాడదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు.శనివారం జిడికె 11వ ఇంక్లైన్ లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణి లో కార్మికుల సమస్యల పరిష్కారంలో పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించేందుకు ఎఐటియుసి ముందుంటుని అన్నారు. సింగరేణి లో కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం గా యాజమాన్యం తో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో ఒప్పుకున్న వాటిని యాజమాన్యం అమలు చేయనందుకు నిరసిస్తూ 31 డిమాండ్ ల పై సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. దీని పై ఈ నెల 25 న హైదరాబాద్ లో ఆర్ ఎల్ సి వద్ద చర్చలు జరిగాయని, జూలై 10 లోపు పరిష్కారం చేసుకోవాలని ఎ.ఎల్.సి యాజమాన్యం కు సూచించించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. యాజమాన్యం సమ్మె నోటీసు లోని డిమాండ్ ల పై పరిష్కారం చేయాలని లేకుంటే అన్ని కార్మిక సంఘాల తో చర్చించిన తర్వాత సమ్మె కు పిలుపునిస్తామని ఆయన అన్నారు.ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్,వీరభద్రం ,కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి,బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను,నాయకులు సిద్దమల్ల రాజు, నాయిని శంకర్,గొడిశల నరేశ్,తదితరులు పాల్గొన్నారు.

## రైతులను తప్పుదోవ పట్టిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

### విత్తనాలు, యూరియా వెంటనే అందుబాటులోకి తేవాలి
### రైతు భరోసా నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయాలని రైతు ఐక్యవేదిక డిమాండ్

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నా గేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీ నుంచి వర్చువల్‌గా రైతు వేదికల ద్వారా విత్తనాల పంపిణీని ప్రారంభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎక్కడా రైతులకు విత్తనాలు అందుబాటులో లేవని జగిత్యాల జిల్లా రైతు ఐక్యవేదిక ఆరోపించింది.జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల రమేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి,నాయకులు మల్లన్న,మారు మురళీధర్ రెడ్డి,శ్రుకంటి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారని, అలాంటి సమయంలో ప్రభుత్వం విత్తనాలు, ఎరువుల సరఫరాలో ని ర్లక్ష్యం వహించడం రైతాంగానికి మరింత ఇబ్బందులు కలిగిస్తో ందని విమర్శించారు. యూరియా పంపిణీ కోసం కొత్తగా తీసుకొచ్చిన యాప్ రైతులకు ఉపయోగపడటం లేదని, యాప్ ద్వారా యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేట్ దుకాణాలపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు.ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వం వెంటనే పాత విధానంలోనే యూరియా సరఫరా పునరుద్ధరించాలని, రైతు వేదికల ద్వారా విత్తనాలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.అలాగే గత రబీ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను పూర్తిగా విడుదల చేయడంతో పాటు, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు కూడా ఎలాంటి షరతులు లేకుండా ప్రతి అర్హ రైతుకు, ప్రతి ఎకరాకు రైతు భరోసా నిధులు అందించాలని డిమాండ్ చేశారు.తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని జిల్లా రైతు ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## విద్యుత్ మరమ్మతులు త్వరితగతిన పూర్తి

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** విద్యుత్తు సరఫరా సక్రమంగా అమలు చేస్తూనే పెండింగులో ఉన్న మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు .జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యుత్ ప్రగతి భవన్లో విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు.జగిత్యాల నియోజకవర్గంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పైన ఉన్న విద్యుత్ లైన్ ను ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలకు ఇబ్బంది కాకుండా షిఫ్ట్ చేయాలన్నా రు. గ్రామాల్లో తాగునీటికి సరఫరాకు,ఖరీఫ్ లో పంట సాగుకుఇబ్బంది కలగకుండా ఉదయం మూడు గంటల వరకే త్రీఫేస్ కరెంటును ఇవ్వాలన్నారు.మెడికల్ కాలేజీ కి నలువైపులా రోడ్డు పనులకు ఇబ్బందిగా ఉన్న కరెంటు పోల్స్ లను త్వరిత గతిన షిఫ్టింగ్ చేయాలని ఆదేశించారు.వర్షాకాలంలో ప్రజలకు విద్యుత్ సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు .అర్హులకు 200 యూనిట్ల కరెంట్ అందించే విధంగా చూడాలన్నారు.రైతులకు ఇబ్బందిలేకుండా పంట పొలాల్లో,గ్రామాల్లో ప్రజలకు సమస్య లేకుండా వంగిపోయిన,ఇరిగిపోయిన పోల్స్ ను త్వరిత గతిన మార్చే విదంగా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంలో ప్రజలకు విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఇసుదర్శనం,డిఇ గంగారం,ఎడిఇ లు జవహర్ నాయక్, సిందూర్ శర్మ,ఎస్ఎఒ శ్రీనివాస్,ఎఇలు,విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండస్ట్రియల్ పార్క్‌తో ఎలాంటి నష్టం లేదు

### ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని దర్యాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేయబోయే ఇండస్ట్రియల్ పార్కు వల్ల స్థానిక రైతులకు ఎలాంటి నష్టం జరగదని ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి స్పష్టం చేశారు.శనివారం దర్యాపూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 144, 145 లో భూములు కోల్పోతున్న రైతులతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాపెల్లి రాజయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా భూసేకరణ, పరిహారంపై అధికారులు, రైతులకు మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది.

**బలవంతపు భూసేకరణ ఉండదు :తహసీల్దార్** గ్రామసభలో తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, గ్రామం ఎంతో అభివృద్ధి చెందుతుందని వివరించారు. ప్రభుత్వ భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధర కంటే ఎక్కువ పరిహారంతో పాటు పునరావాస ప్యాకేజీని అందిస్తామని హామీ ఇచ్చారు.

**లిఖితపూర్వక హామీ ఇస్తేనే భూములిస్తాం:రైతులు** : అధికారుల మాటలపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మూడు తరాలుగా నమ్ముకున్న భూములను వదులుకుంటే తమకు దిక్కెవరని ప్రశ్నించారు.గత ప్రాజెక్టుల్లో పరిహారం సరిగా రాని అనుభవాలు ఉన్నాయని,ఈసారి ఎకరాకు ఎంత ఇస్తారో,ఎప్పుడు ఇస్తారో ముందే తేల్చాలని డిమాండ్ చేశారు.కలెక్టర్ ఆధ్వర్యంలో ధరల కమిటీరైతుల ఆందోళనపై తహసీల్దార్ స్పందిస్తూ.. సోమవారం నుంచి ప్రారంభమయ్యే సర్వే పూర్తయిన తర్వాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ధరల కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు.సర్వే కోసం రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం,ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో సిద్ధంగా ఉండి, పొలం సరిహద్దులు చూపించాలని కోరారు.ఈ గ్రామసభలో ముత్తారం ఎస్ఐ రవికుమార్,రామగిరి ఎస్ఐ శ్రీనివాస్,సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు నూనె కుమార్,బిఆర్ఎస్ నాయకులు తాత బాలయ్య, రామగాళ్ల మధుకర్,శేరు రమేష్‌లతో పాటు బాధిత రైతులు తిత్తుల శ్రీనివాస్,జంగ స్వామి,నరేష్, రాజే శం ,చంద రవి,సల్లసతీష్,కిష్టాయ్యతోపాటుపాల్గొన్నా రు.

## విద్యార్థుల జీవితాలతో కేంద్ర సర్కార్ చెలగాటం

### జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి




**ప్రజాపక్షం/గజ్వేల్:**దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర స ంక్షోభంలోకి వెళ్లిందని, చదువురాని ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం వెనుకడుగు వేస్తూ నిరుద్యోగం, ప్రశ్న పత్రాల లీకేజీకి వారి నుండి జవాబు కరువైందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన చాత్రోస్ కీ గూంజ్ కు మద్దతుగా సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో శనివారం విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి, పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల్లో జాప్యం, నీట్ వంటి ఉత్తమ పరీక్షల పేపర్ లీకేజీ తదితర కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో వందలాది మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత భవిష్యత్తు కోసం కష్టపడి చదువుతున్న విద్యార్థుల శ్రమ వృధా అవుతుందని, వారి జీవితాలతో ఆటలాడుకుంటున్న బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని స్పష్టం చేశా రు.ముఖ్యంగా విద్యా వ్యవస్థ వైఫల్యాలకు, విద్యార్థుల ఆత్మబలిదానాలకు కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. యుపిఎస్‌సి, ఆర్‌సిబి, జెఇఇ, నీట్ వంటి పరీక్షలతో కాంగ్రెస్ విద్యార్థులను తీర్చి దిద్దగా, ప్రస్తుత బిజెపి సర్కార్ వాటిని నిర్వీర్యం చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొండల్ రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సమీర్, మాజీ ఎంపీపీ మోహన్, సీనియర్ నేతలు మొనగారి రాజు, సారిక శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు నాయిని సత్యలక్ష్మి , లక్ష్మి శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింహా రెడ్డి, ఉపేందర్ రెడ్డి, గుగ్లోతు రమేష్, నక్క సంతోషి రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక’తో పాలన మరింత చేరువ

### కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా అధికారులతో కలిసి సమీక్ష
### పవర్ పాయింట్ ప్రజెంటేషన్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో పాలన ప్రజలకు మరింత చేరువ అయిందని ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ, పర్యావరణ, అటవీ శాస్త్ర సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ తెలిపారు. మార్చి 6 వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద 10 అంశాలతో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు, భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ , పర్యావరణ, అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ హాజరుకాగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పుష్పగుచ్ఛం అందజేసి. స్వాగతం పలికారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులు ప్రజలకు చేరవేయడం, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడమే లక్ష్యంగా మార్చి 6 వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు జిల్లాలో చేసిన అభివృధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలు, వివిధ ఫైళ్ల పరిష్కారం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంపై జిల్లా యంత్రాంగం రూపొందించిన పిపిటి ప్రదర్శనను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ పరిశీలించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, దేవాదాయ శాఖ, పర్యావరణ, అటవీ శాస్త్ర మరియు సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ ప్రతి శాఖ భవిష్యత్ కార్యాచరణను స్పష్టంగా నిర్దేశించుకుని, 99 రోజుల కార్యక్రమం ద్వారా సాధించిన విజయాలను డాక్యుమెంటరీ రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయడం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతి, డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం, రోడ్డు భద్రతలో భాగ ంగా సిపిఆర్ శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య సంరక్షణ, ఇతర పనుల్లో పురోగతిపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అభినందించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్‌పి చంద్రయ్య, డిఆర్ఒ జయశ్రీ, సిపిఒ శ్రీనివాసాచారి, జెడ్‌పిసిఇఒ వెంకట మాధవ రావు, డిఆర్‌డిఒలక్ష్మీ నారాయణ, జిల్లా పశువైద్య అధికారి , వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆయా మండలాల ఎంపిడిఒలు పాల్గొన్నారు.

## 'ఛాత్రోన్ కీ గూంజ్'కు మద్దతివ్వండి

- ప్రచారాన్ని దేశవ్యాప్త ఉద్యమంగా మార్చుదాం
- అందరికీ సమాన అవకాశాలు కల్పించే కొత్త వ్యవస్థకు మార్గం సుగమం చేద్దాం
- కాంగ్రెస్ శ్రేణులకు రాహుల్‌గాంధీ పిలుపు



**న్యూఢిల్లీ :** 'అణచివేత, దోపిడీ'తో కూడిన ప్రస్తుత విద్యా వ్యవస్థకు వ్యతిరేకంగా, కాంగ్రెస్ యువజన విభాగం, ఎన్‌ఎస్‌యుఐ ప్రారంభించిన విద్యార్థి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం పార్టీ నాయకులకు సూచించారు. 'ఛాత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గళం) ప్రచారాన్ని దేశవ్యాప్త ఉద్యమంగా మార్చి, అందరికీ సమాన అవకాశాలు కల్పించే కొత్త వ్యవస్థకు మార్గం సుగమం చేయాలని రాహుల్ గాంధీ ఒక లేఖలో పార్టీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఇన్‌చార్జ్‌లు, అన్ని రాష్ట్ర, జిల్లా, నగర విభాగాల అధిపతులను కోరారు. భారతదేశ యువత గతంలో ఎప్పుడూ లేని విధంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, పేపర్ లీక్‌లు, పరీక్షల రద్దు, పదే పదే పునఃపరీక్షలు, నియామకాలలో జాప్యం, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు, పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా వ్యయం వంటివి వారికి, వారి కుటుంబాలకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ఈనెల 17న కోటాలో జరిగిన మొదటి 'ఛాత్రోన్ కీ గూంజ్' ర్యాలీలో గాంధీ ప్రసంగించారు. ప్రయాగ్రాజ్, పాట్నా, ఢిల్లీలలో కూడా ఇలాంటి ఇతర ర్యాలీలలో ప్రసంగించనున్నారు. ప్రస్తుత విద్యావ్యవస్థ యువత తమ కెరీర్ మార్గాలను ఎంచుకుని, తమకంటూ ఒక బలమైన భవిష్యత్తును నిర్మించుకునే క్రమంలో వారికి మద్దతు ఇవ్వడానికి బదులుగా, వారిపై విపరీతమైన ఒత్తిడిని పెంచి, వారి కుటుంబాలను అప్పుల ఊబిలోకి, నిరంతర ఒత్తిడి, బాధల సుడిలోకి నెట్టేస్తున్న వ్యవస్థ అని మనందరికీ తెలుసునన్నారు. భారత యువత ఎదుర్కొంటున్న అణచివేత, దోపిడీల నిజానిజాలను మనం బయటపెట్టావని, ఈ సందేశాన్ని దేశవ్యాప్తంగా సమన్వయంతో, సమర్థవంతంగా వ్యాప్తి చేయడానికి అవసరమైన ఊపును తీసుకురావాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు తన లేఖలో పేర్కొన్నారు. యువతను ఈ అణచివేత వ్యవస్థ నుండి విముక్తి చేయడానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని, వారికి అర్థమైన అవకాశాలు, మద్దతును అందించే కొత్త వ్యవస్థకు పునాది వేద్దామని రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా నీట్ పేపర్ లీక్, సిబిఎస్ఇ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వివాదం నేపథ్యంలో, విద్యార్థులను, జెన్ జెడ్ తరాన్ని ఆకట్టుకుని, మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వారి మద్దతును కూడగట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక చేసిన ప్రణాళికలో భాగంగానే ఈ నిరసన ర్యాలీలు ఉన్నాయి.

## ముడి చమురు ధరలు తగ్గినా పెట్రో ధరలు తగ్గించరా?

- ప్రజలను బిజెపి దోచుకుంటోంది
- ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రజలను సాధనంగా మార్చుకుంది
- కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మండిపాటు



**న్యూఢిల్లీ :** ఇంధన ధరల విషయంలో కేంద్రంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. పశ్చిమాసియా యుద్ధానికి ముందున్న స్థాయికి అంతర్జాతీయ ముడి చమురు ధరలు తిరిగి వచ్చినప్పటికీ ఇంకా అధికంగానే ఇంధన ధరలు కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. బిజెపిని ప్రజలను దోచుకుంటోందని, జేబులు కాజేస్తుందని ఆయన ఆరోపించారు. ప్రజలు కేవలం పన్నులు వసూలు చేయడానికి, తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి బిజెపికి ఒక సాధనంగా మారారని ఆయన అన్నారు. అంతర్జాతీయ ముడి చమురు ధరలు యుద్ధానికి ముందున్న స్థాయికి పడిపోయినప్పటికీ, ప్రజలు పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి కోసం ఎందుకు ఎక్కువ డబ్బు చెల్లించాల్సి వస్తోందని ఖర్గే ప్రశ్నించారు. ముడి చమురు ధరలు తగ్గుతున్నా, పెట్రోల్, డీజిల్‌గ్యాస్ ధరలను తగ్గించడానికి బదులుగా... మోదీ ప్రభుత్వం ప్రజల పొదుపు సొమ్ముపై భారాన్ని పెంచుతూనే ఉంది ఎక్స్‌లో హిందీలో ఖర్గే పోస్టు చేశారు. ప్రభుత్వాన్ని మూడు ప్రశ్నలు సంధించారు. పశ్చిమాసియాలో యుద్ధం ఉధృతంగా ఉన్నప్పుడు ముడి చమురు ధర బ్యారెల్‌కు 138 డాలర్లుగా ఉండేదని కాంగ్రెస్ అధినేత గుర్తుచేశారు. అప్పట్లో పెట్రోల్ ధర లీటరుకు రూ. 94.77, డీజిల్ ధర రూ. 87.67గా ఉండేవని, కానీ నేడు ముడి చమురు ధర బ్యారెల్‌కు 70.71 డాలర్లకు పడిపోయిందని ఆయన చెప్పారు. 'అయినా మోదీ ప్రభుత్వం పెట్రోల్‌ను లీటరుకు రూ. 102.12కు, డీజిల్‌ను లీటరుకు రూ. 95.20కు ఎందుకు విక్రయిస్తోందన్నారు. 'యుద్ధం సాకుతో బిజెపి ప్రభుత్వం వాణిజ్య ఎల్‌పిజి ధరలను రెట్టింపు చేసింది. ఇప్పుడు సరఫరా సాధారణ స్థితికి వచ్చినప్పటికీ, ఎల్‌పిజి ధరలను ఎందుకు తగ్గించడం లేదు?, ప్రజలకు కనీసం ఒక్క పైసా ఉపశమనం కూడా ఎందుకు లభించడం లేదు? అని ఆయన ప్రశ్నించారు. గృహ వినియోగ సిలిండర్లు, వలస కార్మికులకు ఉపయోగపడే 5 కిలోల చిన్న సిలిండర్లు, సిఎన్‌జి వంటి వాటి ధరలూ భారీగా పెంచారని ఖర్గే మండిపడ్డారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చినప్పుడు, ధరలను తగ్గించే విషయంలో మోదీ ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందన్నారు.

# రామాలయం నిర్వహణలో ఎన్నో లోపాలు

- అడుగడుగునా ప్రామాణిక నిర్వహణ విధానాల ఉల్లంఘన
- విరాళాల దుర్వినియోగంపై 'సిట్' విచారణలో వెల్లడవుతున్న విస్తుపోయే విషయాలు

**లక్నో :** అయోధ్యలోని రామమందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగం వ్యవహారం పెద్ద వివాదంగా మారింది. ఆలయ విరాళాల నిర్వహణ వ్యవస్థలో లోపాలు ఉన్నట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గుర్తించగా, నగదు, విలువైన వస్తువుల లెక్కింపుతో సంబంధం ఉన్న ఎనిమిది మందిని అరెస్టు చేసిన విషయం విధితమే. ఈ దర్యాప్తులో ఇప్పటివరకు వెల్లడైన వివరాలు పరిశీలిస్తే... విరాళాలు ఎలా, ఎంత మొత్తంలో దుర్వినియోగం అయ్యాయనే దానిపై ఇంకా దర్యాప్తు జరుగుతున్నప్పటికీ, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తమ ప్రాథమిక నివేదికలో కొన్ని కీలక లోపాలను ఎత్తిచూపింది. నివేదికలోని అంశాలను ఉటంకిస్తూ, లెక్కింపు ప్రక్రియలో భద్రతా సిబ్బందిని నియమించడం, లెక్కింపు గదిలోకి వెళ్లేటప్పుడు, బయటకు వచ్చేటప్పుడు సిబ్బందిని తనిఖీ చేయడం, అలాగే విరాళాల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని 180 రోజుల పాటు భద్రపరచడం వంటి ప్రామాణిక నిర్వహణ విధానాలను (ఎస్‌ఒపిఎస్) ఉల్లంఘించినట్లు వర్గాలు తెలిపాయి. నిబంధనలకు విరుద్ధంగా, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ మాజీ డ్రైవర్ రామశంకర్ యాదవ్ (అలియాస్ తిన్ను యాదవ్) వద్ద అనేక 'హుండీల' (విరాళాల పెట్టెల) తాళాలు ఉండేవని వారు పేర్కొన్నారు. 'అక్కడ చాలా హుండీలు ఉన్నాయి. తిన్ను వద్ద తాళాలు ఉన్న హుండీల ద్వారా వచ్చిన నగదు, ఎస్‌ఒపిల అమలులో నిర్లక్ష్యం కారణంగా దుర్వినియోగం అయినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన కచ్చితమైన పద్ధతి ఇంకా నిర్ధారించాల్సి ఉంది' అని ఒక అధికారి తెలిపారు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో ఏదో తేడా ఉందని ట్రస్ట్ అధికారులకు అనుమానం కలిగిన తర్వాత, ట్రస్ట్ అధికారులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధుల సమావేశంలో ఖరారు చేసిన ఎస్‌ఒపిలను అమలులోకి తెచ్చారు. ఆలయ ట్రస్ట్ కీలక సభ్యుడు అనిల్ మిశ్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన గోవింద్ మిశ్రా ఈ ఎస్‌ఒపిలపై అధికారికంగా సంతకాలు చేశారు. వాటిలో భాగంగా విరాళాల లెక్కింపు సిబ్బంది జేబులు లేని దుస్తులు ధరించడం, సైనిక్ సెక్యూరిటీ సర్వీసెస్ (ఎస్ఐఎస్) ఏజెన్సీ ద్వారా గార్డును నియమించడం, లెక్కింపు గదుల్లోకి వెళ్లే, బయటకు వచ్చే సిబ్బందిని క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, అకస్మాత్తు తనిఖీలు చేయడం వంటి నిబంధనలు ఉన్నాయి. కానీ వీటిలో ఏ ఒక్క నిబంధననూ పాటించలేదు అని ఆ అధికారి చెప్పారు. సిట్ గుర్తించిన మరో ప్రధాన ఉల్లంఘన... విరాళాల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని తప్పనిసరిగా ఉంచాల్సిన 180 రోజులకు బదులుగా కేవలం 45 రోజులు మాత్రమే భద్రపరిచారు. సిట్ నివేదిక ప్రకారం, విరాళాల లెక్కింపు బాధ్యుడు, నిందితుడైన సుభాష్ శ్రీవాస్తవను ట్రస్ట్ అత్యున్నత స్థాయి ముగ్గురు అధికారులలో ఒకరి సిఫార్సు మేరకు నియమించారు.



రామమందిరానికి వచ్చిన విరాళాలలో అక్రమాలు జరిగాయని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఆరోపించడంతో ఈనెల 7న ఈ వివాదం మొదలైంది. అయితే రాయ్ ఈ ఆరోపణలను కొట్టిపారేశారు. కొనసాగుతున్న అంతర్గత ఆడిట్‌లో చెప్పుకోదగ్గ అక్రమాలేవీ వెలుగులోకి రాలేదు అని రాయ్ పేర్కొన్నారు. ఈ సంచలనాత్మక ఆరోపణలపై విచారణ జరిపేందుకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు 13న ఏర్పాటు చేసిన సిట్, రాయ్ వాదన తప్పని నిరూపించినట్లు కనిపిస్తోంది. విచారణలో వెల్లడైన అంశాల దృష్ట్యా, రామమందిర నిర్వహణ వ్యవస్థలో భారీ మార్పులు జరగనున్నాయని సంబంధిత వర్గాలు అంగీకరించాయి. ఈ కేసులో అరెస్టు చేసిన ఎనిమిది మంది సోమవారం వరకు జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులలో ఆరుగురి వద్ద నుండి దాదాపు రూ. 80 లక్షల నగదు, కొంత విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. వాదం చెలరేగిన తర్వాత, సిట్ ఏర్పాటుకు కొద్ది క్షణాల ముందు, విరాళాల లెక్కింపు గది సమీపంలోని ఒక మరుగుదొడ్డి నుండి రూ. 2.5 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు వర్గాలు తెలిపాయి.

## మోదీ మౌనమేల?

- రామమందిర విరాళాల దుర్వినియోగం కుంభకోణానికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** అయోధ్యలోని రామమందిర నిర్మాణానికి సంబంధించిన విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహించడం ఏమిటని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఈ కుంభకోణం వెనుక ఉన్నవారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసింది. శనివారం కాంగ్రెస్ అధికార ప్రతినిధి అఖిలేష్ ప్రసాద్ సింగ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ అవినీతి వ్యవహారం లోతుగా పాతుకుపోయినందున, దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో విచారణ జరగాలన్నారు. తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రస్ట్ బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయినందున ఆ ట్రస్ట్‌ను రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. స్వయంగా విచారణకు ఆదేశించకపోవడం ద్వారా శ్రీరాముని మర్యాదను కాపాడలేదని, దీనిని బట్టి బిజెపి నాయకులు నిజమైన రామభక్తులు కాదని తేలిపోయిందని సింగ్ ఆరోపించారు. ఇంత పెద్ద విషయంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారో దేశ ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. 'ప్రజల విశ్వాసం చెక్కుచెదరకుండా ఉండేలా, ఈ కేసులో నిష్పక్షపాత విచారణ జరిగేలా ప్రధాని నరేంద్ర మోదీ చొరవ తీసుకోవాలి' అని ఆయన అన్నారు. 'వీరు రామభక్తులు కాదని విరాళాల దుర్వినియోగం ఘటన రుజువు చేసింది. ఒకవేళ వారు నిజమైన రామభక్తులైతే, శ్రీరాముని మర్యాదను కాపాడేవారు; సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ట్రస్ట్ ఏర్పాటైనందున, దాని పర్యవేక్షణలో స్వతంత్ర విచారణ జరపాలని కఠిన ఆదేశాలు జారీ చేసేవారు' అని సింగ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత జైరామ్ రమేస్ హిందీ చిత్రం 'ఉప్‌కార్'లోని ఒక సంభాషణను ఉటంకిస్తూ, 'దేవుడినే మోసం చేసేవారు ఇక మనుషులను వదిలిపెడతారా?' అని వ్యాఖ్యానించారు. 'విశ్వాసం, దేశభక్తి, నైతికత గురించి గొప్పగా చెప్పుకుంటూనే, జవాబుదారీతనం విషయంలో మాత్రం మౌనం వహించడం... వారికి ప్రమాణాలు, వాగ్దానాలు, దేశభక్తి, విశ్వసనీయత అన్నీ కేవలం మాటలే; వారి మాటలకు విలువ ఏముంది?' అని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

## రామమందిర నిధుల దుర్వినియోగం...
# దురదృష్టకరం, సిగ్గుచేటు

- విరాళాల సేకరణ, భద్రతకు బాధ్యత వహించిన వారిని కూడా జవాబుదారీగా చేయాలి
- వయనాడ్ ఎంపి ప్రియాంకాగాంధీ వాద్రా డిమాండ్



వయనాడ్ : అయోధ్యలోని రామమందిరం కోసం సేకరించిన విరాళాలు దుర్వినియోగానికి గురయ్యాయన్న ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా తీవ్ర స్పందించారు. ఈ ఘటన 'దురదృష్టకరం', 'సిగ్గుచేటు' అని అభివర్ణించారు. ఈ విరాళాల సేకరణ, భద్రతకు బాధ్యత వహించిన వారిని కూడా జవాబుదారీగా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. శనివారం వయనాడ్ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశం తర్వాత విలేకరులతో మాట్లాడిన ప్రియాంక, ఈ ఆరోపిత ఘటనపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 'ఇది నిజంగా దురదృష్టకరం. దేశవ్యాప్తంగా ప్రజలు నమ్మకం, విశ్వాసం ఉన్నవారు విరాళాలు ఇచ్చారు, ఇప్పుడు ఆ విరాళాలు చోరీకి గురయ్యాయని వార్తలు వస్తున్నాయి. ఇది దురదృష్టకరం, సిగ్గుచేటు అని భావిస్తున్నాను' అని ఆమె అన్నారు. ఏం జరిగింది, ఎలా జరిగింది, ఎందుకు జరిగింది అనే విషయాలపై ప్రభుత్వం విచారణ జరపాలని ఆమె పేర్కొన్నారు. దేశవ్యాప్త విరాళాల సేకరణ కార్యక్రమంలో భాగంగా చాలా మంది ప్రజలు ఆలయం కోసం విరాళాలు అందించారని, ఆ విరాళాలను సేకరించిన వారు కూడా బాధ్యత వహించాలని ప్రియాంక అన్నారు. 'ప్రజలు ఇచ్చారు, మహిళలు తమ పొదుపు సొమ్ము నుండి, తమ ఇళ్ల నుండి ఇచ్చారు, పేదలు కూడా ఇచ్చారు... ఇవి కేవలం పెద్ద కార్పొరేట్ సంస్థలు ఇచ్చిన నిధులు కావు. ఇవి సాధారణ పౌరుల నుండి సేకరించిన నిధులు. వీటిని సేకరించడానికి ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది' అని ఆమె అన్నారు. 'దీనికి ఎవరు బాధ్యులు? మీరు వాటిని సేకరించినట్లయితే, వాటిని సురక్షితంగా ఉంచడం మీ బాధ్యత,' అని ఆమె పేర్కొన్నారు.

## హిందూమహాసముద్ర భద్రతలో
# భారత్‌కు కీలక భాగస్వామి సేషెల్స్

### విక్టోరియాలో మోదీకి ఘన స్వాగతం



విక్టోరియా(సేషెల్స్): హిందూమహాసముద్రంలో ఒక ద్వీప సమూహదేశం సేషెల్స్ రిపబ్లిక్‌లో మూడు రోజుల పర్యటన నిమిత్తం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెళ్ళారు. శనివారం ఆ దేశ రాజధాని విక్టోరియాకు చేరుకున్న తర్వాత అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఆయనకు ఘన స్వాగతం లభించింది. సుమారు 115 పైగా ద్వీపాల సమూహంగా ఉన్న సేషెల్స్ రిపబ్లిక్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీతో సంభాషణలు చేయడంతోపాటు ఆ దేశ జాతీయ స్వాతంత్ర్య దినోత్సవ స్వర్ణోత్సవ వేడుకలలో కూడా పాల్గొంటారు. మోదీ వెంట రెండు భారత సైనిక నౌకలు,భారత సాయుధ బలగాలు కూడా ఈ స్వాతంత్ర్య స్వర్ణోత్సవ వేడుకలలో పాల్గొంటున్నాయి. ఆ దేశ జాతీయ అసెంబ్లీలో కూడా ఆయన ప్రసంగిస్తారు. అదేవిధంగా అక్కడ ఉన్న భారతీయుల వేదిక సమావేశంలో పాల్గొంటారు. ఇంతకుముందు 2015లో మోదీ సేషెల్స్ దేశంలో పర్యటించారు. ఈ ఏడాది ఆరంభంలోనే ఆ దేశ అధ్యక్షుడు హెర్మినీ భారత్‌లో పర్యటించారు. రెండు దేశాలమధ్యా 1976 నుండి మైత్రీబంధం ఉంది. నాయకులు ఇద్దరు రెండు దేశాల ఆర్థిక అభివృద్ధి గురించి ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. గడచిన ఐదు దశాబ్దాలలో రెండు దేశాలమధ్య రక్షణ,పర్యావరణం సహా పలు రంగాలలో సహకారం విస్తృతం అవుతోంది. ''సేషెల్స్‌కు చేరుకున్నాను, వారు నాకు ఎంతో ఘన స్వాగతం పలికారు, అందుకు వారికి నా హర్షాతిరేకాలు ప్రకటిస్తున్నాను'' అని ఎక్స్ వేదికగా మోదీ ఒక పోస్టింగ్ పెట్టారు. ''సేషెల్స్ దేశం ఒక అత్యంత విలువైన సముద్ర ప్రాంత దేశ భాగస్వామి. హిందూమ హాసముద్రంలో భారత్‌కు సన్నిహిత మిత్రదేశం. ఈ దేశంలో నా పర్యటన విజయవంతం కావాలని, మంచి ఫలితాలు ఈ పర్యటనలో లభించాలని ఎదురుచూస్తున్నాను, తదుపరి ఈ దేశంతో సంబంధాలు మరింత దీర్ఘకాలం పటిష్టం కావాలి. వారి ప్రభుత్వంతో, ప్రజలతో సహకార ప్రయోజనం విస్తృతం కవాలి,మన రెండు దేశాల ప్రజలు ప్రయోజనం పొందాలి'' అని పేర్కొన్నారు.
ఈ దేశానికి బయలుదేరే ముందుగా న్యూఢిల్లీలో మోదీ మాట్లాడుతూ, సేషెల్స్ దేశం ఎంతో విలువైన ఒక ద్వీపదేశమన్నారు. ''మహాసాగర్'' అనే భవిష్యత్ దార్శనిక కార్యక్రమంలో ఈ దేశం ఒక భాగస్వామి, ఈ ప్రాంతాలలో భద్రతకు, అభివృద్ధికి,పురోగతికి సేషెల్స్ దేశం ఎంతో కీలకమైనది, గ్లోబల్ సౌత్‌లో దేశాల అభ్యున్నతికి భారతదేశం కట్టుబడి ఉంది అన్నారు. సేషెల్స్‌దేశం ద్వీప సమూహాల దేశమైనప్పటికీ ఇందులో ఒక లక్ష లోపు మాత్రమే జనాభా ఉంటారు. తూర్పు ఆఫ్రికాకు తూర్పున 1500 కి.మీ దూరంలో ఉన్న ఈ దేశం ఆఫ్రికా సమాఖ్య,సదరన్ ఆఫ్రికన్ డవలప్‌మెంట్ కమ్యూనిటీ, కామన్వెల్త్ నేషన్స్, ఐక్యరాజ్యసమితిలో సభ్యదేశంగా ఉంది. 1976లో బ్రిటన్ నుండి స్వాతంత్ర్యం స్వీకరించింది. ఆ తర్వాత ఈ యాభై ఏళ్ళలో వ్యవసాయపరంగా ఉత్పత్తుల అభివృద్ధి,మార్కెట్ విస్తరణలో అద్భుతమైన ప్రగతి సాధించింది.

## ట్రక్కు వ్యాను ఢీ..
# నలుగురి మృతి.. పలువురికి గాయాలు

కొప్పల్: కర్ణాటకలోని కొప్పల్ జిల్లాలో శనివారం తెల్లవారుజామున ట్రక్ రోడ్ దాటి ఎదురుగా వస్తున్న వాన్‌ను ఢీకొట్టడంతో మంత్రాలయంకి వెళ్లే యాత్రికులు నలుగురు మృతి చెందగా, చిన్నారులు సహా పలువురు గాయపడ్డారు . ఈ ప్రమాదం కుకనూరు తాలూకాలోని భానాపూర్ సమీపంలోని జాతీయ రహదారి63పై చోటుచేసుకుంది. మృతులు హావేరి జిల్లాలోని రట్టిహళ్లి తాలూకా కబ్బర్ గ్రామానికి చెందినవారు. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మంత్రాలయానికి యాత్రకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ట్రక్ అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న వాన్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. మృతులను కెంచమ్మ బాలేకాయి (35), అమృత కోట్యాల్ (25), రమేశ్ బళ్ళారి (45), ప్రవీణ్ (23)గా గుర్తించారు. వాన్‌లో ఉన్న పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. గాయపడిన వారిలో నలుగురు చిన్నారులు ఉన్నారని, ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. గాయపడిన వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి కుకునూరు పోలీస్ స్టేషన్‌లో దర్యాప్తు ప్రారంభించారు.

# డిఎంకె కూటమితో ఎండిఎంకె తెగదెంపులు

అన్నాడిఎంకెతో కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు యత్నిస్తోందని ఆరోపణ
'లౌకిక భావజాలం ఆధారిత కూటమి' అనే నినాదాన్ని అర్థరహితం చేసిందని మండిపాటు



**చెన్నై :** తమ దీర్ఘకాల మిత్రపక్షమైన డిఎంకెతో సంబంధాలు తెంచుకుంటున్నట్లు ఎండిఎంకె శనివారం ప్రకటించింది. డిఎంకె, అన్నాడిఎంకెతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఎండిఎంకె అధినేత వైకో ఆరోపించారు. ఈ నేపథ్యంలో తాము ఆ పార్టీ నుంచి తెగదెంపులు చేసుకుంటున్నామన్నారు. హిందుత్వ మతతత్వ శక్తులతో ఎన్నికలకు ముందే పొత్తు పెట్టుకున్న అన్నాడిఎంకె ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి చేసిన ప్రయత్నం, డిఎంకె 'లౌకిక భావజాలం ఆధారిత కూటమి అనే నినాదాన్ని అర్థరహితం చేసిందని ఎండిఎంకె పేర్కొంది. శనివారం చెన్నైలో జరిగిన సమావేశంలో ఆమోదించిన తీర్మానంలో, మే 4న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత, ప్రజలు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా 'తెరవెనుక రాజకీయ ఒప్పందాలు' జరిగాయని ఎండిఎంకె ఆరోపించింది. డిఎంకెను పేరును నేరుగా ప్రస్తావించకుండానే, అన్నాడిఎంకె ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు జరిగాయన్న విషయం బహిరంగ రహస్యమని ఎండిఎంకె పేర్కొంది. ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'హిందుత్వ మతతత్వ శక్తులతో' పొత్తు పెట్టుకోవడం ద్వారా అన్నాడిఎంకె కేవలం 47 స్థానాలను మాత్రమే గెలుచుకుంది. అన్నాడిఎంకె ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించడం ద్వారా, 'సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్' అనేది ఒక 'భావజాలపరమైన కూటమి' అని డిఎంకె చేసిన ప్రకటనను కొన్ని స్వార్థ ప్రయోజన శక్తులు పూర్తిగా అర్థరహితం చేశాయి. 'ఈ పరిస్థితులలో, మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కజగం (ఎండిఎంకె) కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, ఇకపై డిఎంకె నేతృత్వంలోని కూటమిలో పార్టీ కొనసాగకూడదనే తమ అభిప్రాయాన్ని ఆ తీర్మానంలో వ్యక్తం చేశారు. అందువల్ల, డిఎంకె నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ నుండి వైదొలగాలని ఈ జనరల్ కౌన్సిల్ నిర్ణయించింది. ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు పొత్తుల విషయంలో పార్టీ తగిన నిర్ణయాలు తీసుకుంటుందని ఈ జనరల్ కౌన్సిల్ తీర్మానించింది. తాము ఎనిమిదేళ్లకు పైగా డిఎంకె నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్‌లో భాగంగా ఉన్నామని ఎండిఎంకె గుర్తుచేసింది. డిఎంకెతో పొత్తు పెట్టుకోవడానికి వైకో నేతృత్వంలోని పార్టీ డిసెంబర్ 3, 2017న జరిగిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. తమిళనాడులో మతతత్వ శక్తులు పాగా వేయకుండా అడ్డుకోవడానికి, ద్రవిడ ఉద్యమ ప్రధాన భావజాల సూత్రాలు దెబ్బతినకుండా రక్షించుకోవడానికి ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఎండిఎంకె తెలిపింది.

## ప్రమాదకరంగా ఉన్న నివాస ప్రాంగణాల కోసం...
# జాతీయ భద్రతా చట్టాన్ని రూపొందించాలి

- సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్
- కేంద్రం, ఇతరులను ఆదేశించాలని పిటిషనర్ అభ్యర్థన



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా అధిక ప్రమాదకరమైన, ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే భవనాల కోసం అగ్ని ప్రమాదనివారణ, ప్రాణ రక్షణకు సంబంధించిన జాతీయ విధానాన్ని రూపొందించేలా కేంద్రం, ఇతరులను ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. ఈ ఫ్రేమ్‌వర్క్‌లో పాఠశాలలు, కోచింగ్ సెంటర్లు, హాస్టళ్లు, హోటల్స్, గెస్ట్ హౌస్‌లు, బెడ్–అండ్–బ్రేక్‌ఫాస్ట్ సంస్థలు, రెస్టారెంట్లు, మాల్స్, సినిమాహాల్స్, హాస్పిటల్స్, అధిక జనసంచారం ఉండే ఇతర వాణిజ్య ప్రాంగణాలను చేర్చాలని పిటిషన్‌లో కోరారు. న్యాయవాది నరేష్‌కుమార్ గోస్వామి దాఖలు చేసిన ఒక పిటిషన్‌లో కోచింగ్ హబ్‌లు, పాఠశాలలు, హాస్పిటల్స్, హోటల్స్, రెస్టారెంట్లు, బాంక్వెట్ హాల్స్, మాల్స్‌కు ప్రాధాన్యతనిస్తూ, అధిక ప్రమాదం ఉన్న బహిరంగ ప్రదేశాలలో మూడు నాలుగు నెలల్లోగా ప్రత్యేక అగ్ని, ప్రాణ భద్రతా తనిఖీని నిర్వహించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. భారతదేశంలో జరిగిన కొన్ని అత్యంత ఘోరమైన అగ్నిప్రమాద విషాధాలను ఇటీవల ఢిల్లీ, లక్నోలలో జరిగిన కొన్నింటిని ప్రస్తావిస్తూ ఇటువంటి సంఘటనలు పదేపదే జరగడానికి గల తీవ్రమైన కారణాలలో ఒకటి 'ప్రజలు అధికంగా ఉండే ప్రాంగణాల కోసం ఏకరీతి, అమలుచేయదగిన జాతీయ కనీస అగ్ని, ప్రాణభద్రతా చట్టం లేకపోవడం' అని పిటిషన్‌లో పేర్కొన్నారు.అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదించి, కేంద్రం, ఇతర సంబంధిత అధికార సంస్థలు అధిక రద్దీ గతల బహిరంగ ప్రాంగణాల కోసం 'ఒక నిర్దిష్ట కాలపరిమితిలో జాతీయ కనీస అగ్ని, ప్రాణ భద్రతా నిబంధనల పాటింపు, ఆడిట్, వెల్లడి, జవాబుదారీతనం చట్టాన్ని రూపొందించాలి' అని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు.ఇతర ప్రార్థనలతో పాటు, నిర్ణీతకాలంలోగా తుది ముసాయిదాను సిఫార్సు చేయడానికి ఒక జాతీయ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని కూడా పిటిషన్ కోరింది. కొనసాగుతున్న క్రిమినల్ దర్యాప్తులకు ఆటంకం కలిగించకుండా ఢిల్లీలోని మాల్వీయ నగర్, లక్నోలోని అలీగంజ్‌లో జరిగిన అగ్నిప్రమాదాలకు సంబంధించిన అన్ని తనిఖీ రికార్డులు, ఫైర్ ఎన్‌ఓసీలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు, లైసెన్స్‌లు, సిసిటివి ఫుటేజ్, ఉత్తర ప్రత్యుత్తరాలను భద్రపరచాలని మధ్యంతర ప్రార్థనగా పిటిషన్‌లో కోరారు. జూన్ 3న దక్షిణ ఢిల్లీలోని మాల్వీయ నగర్‌లో ఉన్న ఒక బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ సెంటర్‌లో జరిగిన ఒక ఘోర అగ్ని ప్రమాదంలో 21మందిప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. జూన్ 22న లక్నోలోని అలీగంజ్‌లో మూడు అంతస్తుల వాణిజ్య భవనంలో సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో 15మంది మరణించగా, 9మంది గాయపడ్డారు.

# మహారాష్ట్రలో 'టెట్' పరీక్షా పత్రం లీక్

- భివాండీలో అసలు ప్రశ్నపత్రాన్ని పోలీ ఉన్న కొన్ని ప్రశ్నలు కొందరి వద్ద ఉన్నట్లు గుర్తింపు
- పరీక్షను వాయిదా వేసిన మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్

**పుణె/థానె :** నీట్ పేపర్ లీక్ వివాదం సమసిపోక ముందే మరో పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ ఘటన వెలుగుచూసింది. మహారాష్ట్రలో ఆదివారం జరగాల్సి ఉన్న 'టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్' (టెట్) 2026 వాయిదా పడింది. థానే జిల్లాలోని భివాండీ పట్టణంలో జరిపిన సోదాల్లో, అసలు ప్రశ్నపత్రాన్ని పోలి ఉన్న కొన్ని ప్రశ్నలు కొందరి వద్ద ఉన్నట్లు గుర్తించడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ముగ్గురు వ్యక్తులపై భివాండీ పోలీసులు కేసు నమోదు చేశారు. పరీక్షను పూర్తి పారదర్శకతతో నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నామని మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎంఎస్‌సిఇ) ఒక ప్రకటనలో తెలిపింది. పరిస్థితి తీవ్రత, సమగ్ర విచారణ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈనెల 28న జరగాల్సిన పరీక్షను వాయిదా వేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షా పత్రాలకు సంబంధించిన అనధికార సమాచారం కొందరి వద్ద ఉందన్న రహస్య సమాచారం మేరకు భివాండీ పోలీసులు శనివారం తెల్లవారుజామున చర్యలు చేపట్టగా, ఈ ఉల్లంఘన వెలుగులోకి వచ్చిందని థానే జిల్లా యంత్రాంగం తెలిపింది. 'అనుమానిత ప్రదేశంలో వెంటనే సోదాలు నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న సామగ్రిని పరిశీలించడానికి మహారాష్ట్ర స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎగ్జామినేషన్ సీనియర్ అధికారులను పోలీసులు వెంటనే పిలిపించారు. క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, అనుమానితుల వద్ద ఉన్న ప్రశ్నలలో కొన్ని టెట్ కోసం రూపొందించిన అసలు ప్రశ్నపత్రంలోని ప్రశ్నలతో సరిపోలుతున్నట్లు నిర్ధారించారని థానే జిల్లా యంత్రాంగం పేర్కొంది. అభ్యర్థులు వదంతులను నమ్మవద్దని కౌన్సిల్ కోరింది. టెట్‌కు సంబంధించిన సవరించిన తేదీలు, తాజా షెడ్యూల్‌ను త్వరలో కౌన్సిల్ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటిస్తామని తెలిపింది.

# హెజ్బొల్లా నిర్మూలనకు ఇజ్రాయెల్–లెబనాన్ ఎంఒయు

**• సమస్య పరిష్కారం,శాంతి దిశగా తొలి అడుగు:రుబియో • ఇజ్రాయెల్ బేషరతుగా ఖాళీచేసి వెళ్ళిపోవాలి • లెబనాన్‌లో అంతర్యుద్ధ ప్రమాద హెచ్చరిక**



**వాషింగ్టన్:**అమెరికా మధ్యవర్తిత్వంలో ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య శాంతి దిశగా మొదటిసారి ఒక ఎంఒయు (తాత్కాలిక ఒప్పందం) కుదిరింది. ఈ ఎంఒయుపై రెండు దేశాల ఉన్నతస్థాయి దౌత్యవేత్తలు శనివారం సంతకాలు చేశారు. అమెరికాలో ఇజ్రాయెల్ రాయబారి యెచియల్ లిటర్, లెబనాన్ రాయబారి హమదేహ్ మొవార్డ్ అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో మధ్యవర్తిత్వంలో ఆయన సమక్షంలో ఈ తాత్కాలిక ఎంఒయుపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, ఇజ్రాయెల్ దళాలు సెక్యూరిటీ జోన్లు వదిలి వెళ్ళే కొలదీ లెబనాన్ ప్రభుత్వ సాయుధ దళం (ఎల్ఎఎఫ్) దక్షిణ లెబనాన్‌లో ఈ ప్రాంతాలపై తన పట్టు బిగిస్తుంది. లెబనాన్‌లో తన పూర్తి సార్వభౌమాధికారాన్ని పునరుద్ధరిస్తుంది. తన నేలపై విదేశీ సైన్యాలను నిర్మూలించడానికి అరబ్ దేశాలు,అమెరికా సహాయం తీసుకుంటుంది. ప్రభుత్వేతర సమూహాలపై బలప్రయోగం ద్వారా లెబనాన్ తన ఏకస్వామ్యాన్ని పునరుద్ధరిస్తుంది. అంతర్జాతీయ మద్దతుతో లెబనాన్ పునర్నిర్మాణం జరుగుతుంది. క్రమంగా ప్రజలు ఈ ప్రాంతాలకు తిరిగి వస్తారు. ''ట్రంప్ నాయకత్వంలో అమెరికా పూర్తి మద్దతుతో ఇజ్రాయెల్–లెబనాన్ ప్రభుత్వాలు శాశ్వత శాంతి,భద్రత ఉమ్మడి లక్ష్యాన్ని పునరుద్ఘాటిస్తున్నాయని 14 ప్రధాన అంశాలతో కూడిన ఈ త్రైపాక్షిక ఒప్పందంలోని తొలి వాక్యాలు పేర్కొన్నాయి.దీని ఆధారంగా భవిష్యత్తులో జరిగే ఒప్పందాలు ఇరు దేశాల సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడుకోవాలనే ఆంకాంక్షను ప్రతిబింబించాయి. సంఘర్షణ తలెత్తడానికి గల మూలకారణాలను పరిష్కరించి తద్వారా వచ్చిన యుద్ధాన్ని నివారించాలన్న ఆకాంక్షను ఇరు దేశాలు వ్యక్తం చేశాయి. క్రమబద్ధమైన ఈ ప్రక్రియ పూర్తిచేయడానికి ఒక స్పష్టమైన షరతులకు కట్టుబడి ఉన్నట్లు ఒప్పందంలో ఇరు దేశాలు అంగీకరించాయి. దీని ప్రకారం హెజ్బొల్లా ఉగ్రవాదం ఇజ్రాయెల్‌కు సమస్యగా ఉంది. దీనిని నిర్మూలించాల్సిన అవసరం ఉంది. ఈ అంశాన్ని హెజ్బొల్లా తీవ్రంగా వ్యతిరేకించింది.ఆ తర్వాత మార్కో రుబియో మాట్లాడుతూ,హెజ్బొల్లా నిరాయుధీకరణ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఉన్న లెబనాన్‌కు 100 మిలియన్ డాలర్ల సహాయం ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నెలల తరబడి జరుగుతున్న యుద్ధం తర్వాత ఈ ఒప్పందంపై సంతకాలు చేయడం ద్వారా ఇజ్రాయెల్–లెబనాన్ దేశాలు శాంతి దిశగా తొలి అడుగు వేశాయన్నారు. ఈ ఒప్పందంలో హెజ్బొల్లాను చేర్చలేదు. హెజ్బొల్లాను నిర్మూలించడానికి, దానితో పోరాటం చేయడానికి, ఇజ్రాయెల్ దళాలు యుద్ధంలో స్వాధీనం చేసుకున్న భూభాగాలను తిరిగి లెబనాన్ సంపాదించుకోవడానికి వీలుగా ఒక ఫ్రేమ్‌వర్క్ ప్రక్రియను ఏర్పాటు చేస్తామని రుబియో చెప్పారు. ఈ ఫ్రేమ్‌వర్కును అమలు చేసేందుకు కొత్తగా సృష్టించిన ''లెబనాన్ కోసం మిలిటరీ కో–ఆర్డినేషన్ గ్రూప్''కు అమెరికా సహాయ సహకారాలు అందజేస్తుందని, 100 మిలియన్ డాలర్ల మానవతా సహాయం కూడా లెబనాన్‌కు చేస్తుందని అమెరికా విదేశీ వ్యవహారాలమంత్రిత్వశాఖ ప్రకటించింది.సుదీర్ఘంగా కొనసాగుతున్న సంక్షోభం నుండి బయట పడటానికి ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా ఒక మార్గం లభిస్తుందని పేర్కొంది. ఇజ్రాయెల్ ఉత్తర సరిహద్దు ప్రాంతంలో హెజ్బొల్లా నుండి ఎదురవుతున్న ముప్పును తొలగించేందుకు ఒక పర్యవేక్షణ మార్గాన్ని ఆ దేశం కోసం సృష్టించినట్లు తెలిపింది. లెబనాన్‌లో ఉన్న హెజ్బొల్లా సైనిక సంస్థ ప్రధాన నాయకుడు నయీమ్ క్వాస్సెమ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ముందుగా దక్షిణ లెబనాన్ ప్రాంతాల నుండి ఇజ్రాయెల్ సైనిక దళాలు బేషరతుగా తక్షణం పూర్తిగా ఖాళీ చేసి వెళ్ళిపోవాలని డిమాండ్ చేశారు. ఇది ఒప్పందం కాదని,తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనని, దీనికి విశ్వసనీయత లేదని, ఈ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ సమ్మతించి అమలు చేసే అవకాశం లేదని విమర్శించారు. ఈ ఒప్పందంలో హెజ్బొల్లా ఒక భాగంగా లేదని, అందువల్ల ఇది లెబనాన్‌లో అతర్యుద్ధానికి దారితీసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. హెజ్బొల్లాను నిరాయుధులను చేసేందుకు ప్రయత్నం చేస్తే అంతర్యుద్ధం తప్పదన్నారు. అమెరికా–ఇరాన్ మధ్య జూన్ 17–18 తేదీల్లో సంతకాలు చేసి కుదుర్చుకున్న ఒప్పందాన్ని ''అమెరికా–ఇజ్రాయెల్ అధికారిక ఓటమి ప్రకటన''గా క్వాస్సెమ్ అభివర్ణించారు. లెబనాన్‌లో ప్రతి అంగుళం భూమి నుండి ఇజ్రాయెల్ వైదొలగి వెళ్ళిపోవడం తప్ప ఇజ్రాయెల్‌కు మరోమార్గం లేదని అన్నారు. ఈ శాంతి చర్చల్లో పాల్గొనవద్దని మొదటి నుండి లెబనాన్ నాయకులకు హెజ్బొల్లా నాయకత్వం హెచ్చరికలు చేస్తూ వస్తోంది. తాము దక్షిణ లెబనాన్‌ను వదిలి వెళ్ళేదిలేదని, ఇష్టమైనంతకాలం అక్కడే ఉంటామని ఇప్పటికే ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూ ప్రకటించారు.

# వెనెజులా, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్‌లో భూకంపం

**• కారకస్‌లో సహాయ చర్యలకు ఆటంకాలు • వెనెజులాకు భారత్ సహాయ సామాగ్రి పంపిణీ**



**కారకస్,ఇస్లామాబాద్:**వెనెజులా,పాకిస్థాన్,ఫిలీప్పీన్స్‌దేశాల్లో శుక్ర,శనివారాలలో భూకంపాలు సంభవించాయి. వెనెజులాలో మరోసారి భూమి కంపించడంతో ఇప్పటికే తీవ్ర భయాందోళనలో ఉన్న ప్రజలు చెల్లాచెదురైపోయారు. మూడు రోజుల క్రితం రెండుసార్లు పెను భూకంపం వచ్చిన తర్వాత మరో 30 సార్లు కూడా ఆ దేశంలో భూ ప్రకంపనలు వచ్చాయి. శనివారం ఉదయం కారకస్‌లో,ఇతర ప్రాంతాలలో 4.9 తీవ్రతతో మరోసారి భూమి కంపించి మరోసారి ఆస్తినష్టం సంభవించింది. సజీవులైన ప్రజలు వీధుల్లో రోడ్డు డివైడర్ల మధ్యలో కాపురాలు పెట్టారు. అక్కడే నిద్రిస్తున్నారు. ప్రభుత్వం పాఠశాలలను మూసివేసి వాటిని బాధిత కుటుంబాలకు ఆవాసాలుగా మార్చింది. ఆటంకాలమధ్య మూడోరోజు శనివారం కూడా శిథిలాలలో సజీవులకోసం సహాయ బృందాలు గాలింపు కొనసాగించాయి.అదేవిధంగా పాకిస్థాన్,దక్షిణ ఫిలిప్పీన్స్‌లలో కూడా భూకంపాలు వచ్చాయి. అక్కడ ఎలాంటి ఆస్తి,ప్రాణ నష్టంవాటిల్లలేదు.ఐక్యరాజ్యసమితి సహా 2000 మంది అంతర్జాతీయ సహాయ బృందాలు వెనెజులాకు తరలివెళ్ళి శిథిలాలను తొలగించి సజీవులకోసం గాలించే చర్యల్లో పాల్గొంటున్నాయి. భారతదేశం కూడా ఉత్తర ప్రదేశ్ విమానాశ్రయం నుండి రెండు విమానాలలో 35 టన్నుల సహాయ సామాగ్రిని వెనెజులాకు పంపించింది. వైద్యులు సహా రెండు అత్యాధునిక మొబైల్ ఆసుపత్రులు,ఔషధాలు,ఇతర సహాయ సామాగ్రి పంపింది. కాగా బ్రిటన్ రాజు ఛార్లెస్ వెనెజులాకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ ఒక సందేశం పంపారు. జూన్ 24వ తేదీ సాయంత్రం సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య 950 దాటినట్లు వెనెజులా తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగ్జ్ అధికారికంగా ప్రకటించారు. సజీవులను సురక్షితంగా వెలికి తీస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు. 63 వేల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనావేశారు. భూకంపం తర్వాత ప్రపంచ దేశాలు వెనెజులాకు సహాయ బృందాలను ఆర్థిక సహాయాన్ని విరివిగా పంపిస్తున్నాయి. కాగా చైనా సహాయంతో పనిచేస్తున్న సహాయ సంస్థలు కూడా తక్షణం స్పందించి భారీ వాహనాలు తీసకువెళ్ళి శిథిలాలను తొలగించే ప్రక్రియలో పాల్గొంటున్నాయి.గాయపడిన 3,360 మంది చికిత్స పొందుతున్నారు. మరణించిన తల్లీ బిడ్డలలో ఒక చిట్టిపాపను సహాయ బృందాలు రక్షించగా, తల్లి మరణించింది. దాదాపు 50,000 మంది ఇంకా శిథిలాలలోనే ఉండిపోయారని అంచనావేస్తున్నారు. చైనా, స్పెయిన్, పోర్చుగల్ దేశీయులు కూడా వెనెజులాలో మరణించిన వారిలో ఉన్నారు. పోర్చుగల్‌కు చెందిన తొమ్మిదిమంది భూకంపంలో మరణించగా, స్పెయిన్‌కు చెందిన ముగ్గురు మరణించారు. మరో 99 మంది స్పెయిన్ దేశీయుల జాడ తెలియలేదు. వీరంతా శిథిలాల్లో కూరుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. ఇద్దరు చైనా పౌరులు మరణించారు. దక్షిణ ఫిలిప్పీన్స్‌లో వచ్చిన భూకంపం తీవ్రత రిచ్‌టర్ స్కేలుపై 6.7 గా నమోదైంది. పాకిస్థాన్‌లో 24 గంటల వ్యవధిలో నాలుగుసార్లు భూమి కంపించింది.రిచ్‌టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 5.5 గా నమోదైంది. శనివారం ఉదయం 8.35 గంటలకు అత్యంత తీవ్రంగా భూమి కంపించింది. బలూచిస్థాన్ ప్రాంతంలో 40కి.మీ లోతున ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు యూరోపియన్–మెడిటరేనియన్ సెస్మోలాజికల్ సెంటర్ ప్రకటించింది.ఐతే ఎలాంటి ఆస్తి,ప్రాణ నష్టం వాటిల్లలేదని నివేదికలు అందాయి. కాగా చాలా స్వల్ప వ్యవధిలోనే దక్షిణ ఫిలిప్పీన్స్‌లో రెండుసార్లు 6.5 – 6.7 తీవ్రతతో భూమి కంపించింది.

# యూరప్ దేశాలపై నూరుశాతం పన్ను



**వాషింగ్టన్:** అమెరికా దిగ్గజాలైన టెక్ కంపెనీలపై సర్వీస్ టాక్స్ వేస్తే వాటి సరుకుల దిగుమతిపై నూటికి నూరుశాతం సుంకాలు విధిస్తామని యూరప్ దేశాలకు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. పలు యూరప్ దేశాలు ఈ విధమైన పన్ను అమెరికా టెక్ దిగ్గజ కంపెనీలపై విధించేందుకు ప్రయత్నం చేస్తున్నాయని, ఈ విషయం గురించే చర్చిస్తున్నాయని ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. అలాంటి పన్నులు విధిస్తే తమ కఠినమైన జరిమానా సుంకాలను తక్షణమే అమలు చేస్తామని చెప్పారు. కానీ బ్రిటన్‌లో ఈ విధమైన పన్ను 2020 నుండీ అమలులో ఉంది. అందువల్ల బ్రిటన్‌పై ట్రంప్ హెచ్చరిక ఎలాంటి ప్రభావం చూపిస్తుందన్న విషయం వెంటనే తెలియరాలేదు. ఆపిల్, గూగుల్, మెటా,అమెజాన్ సహా మరికొన్ని పెద్ద కంపెనీలపై బ్రిటన్ పన్నులు ప్రభావం చూపిస్తున్నాయి.

# బంగ్లాదేశ్‌కు 110 కోట్ల డాలర్ల ఆర్థికసహాయం

**రైతులకు ఎరువులు,ఆహార భద్రత మద్దతు ఆమోదించిన ప్రపంచ బ్యాంకు**

**ఢాకా:**బంగ్లాదేశ్‌కు 110 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని అందజేసేందుకు ప్రపంచ బ్యాంకు ఆమోదం తెలియజేసింది. పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాలతోపాటు ముందునుండీ దివాళా ఆర్థిక పరిస్థితులవల్ల కుదేలైన బంగ్లాదేశ్‌కు దిగుమతి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ ఒత్తిడి తగ్గించుకునేందుకు ఆ దేశ నాయకులు మహ్మద్ యూనుస్ ప్రభుత్వ కాలం నుండి ప్రపంచబ్యాంకు వెంటపడ్డారు. ఆర్థిక వెసులుబాటు లేకపోవడంతో బంగ్లాదేశ్‌లో రైతులు,పేదలు,చిన్న కుటుంబాలు తీవ్ర ప్రభావానికి గురవుతున్నాయి.దిగుమతి ఖర్చులను తగ్గించి ప్రజలను ద్రవ్యోల్బణం బారి నుండి తప్పించేందుకు చేసే ప్రయత్నమే ఈ ఆర్థిక సహాయం లక్ష్యమని ప్రపంచ బ్యాంకు ప్రకటించింది. ఈ ఒప్పందంలో భాగంగా రైతుల కోసం 6,00,000 మెట్రిక్ టన్నుల ఎరువుల దిగుమతికి,ఆహార భద్రత కింద అత్యవసర ప్రాజెక్టులకు 300 మిలియన్ డాలర్లు ప్రపంచబ్యాంకు ఇస్తుంది. ఈ ప్రాజెక్టుకు అనుగుణంగా ఆ దేశంలో 14 లక్షల హెక్టార్లు (34.60 లక్షల ఎకరాలు) పంటభూమికి ఎరువుల సరఫరా చేస్తారు. బంగ్లాదేశ్‌లో వ్యవసాయ అవసరాల నిమిత్తం 85 శాతం ఎరువులను దిగుమతి చేసుకుంటారు. సరఫరా వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు కూడా ఇంకా పరిస్థితిని చక్కదిద్దాల్సి ఉంది. దిగుమతులపై ఆధారపడిన బంగ్లాదేశ్‌లో గడచిన మార్చి నుండీ యుద్ధంవల్ల సామాన్య ప్రజలు, ముఖ్యంగా రైతులు సంక్షోభం ఎదుర్కొంటున్నారు. ఇంధన సంక్షోభం కారణంగా రైతులు వ్యవసాయ పనులు చేపట్టడంలేదు. దాదాపు చాలా పెట్రోలు బంకులు మూతపడ్డాయి. వారు ట్రాక్టర్లు నడపడానికి కూడా భయపడుతున్నారు.ఐతే దేశంలో ఉద్యోగాలు,జీవనోపాధిని కాపాడుతూనే ఈ సంక్షోభ సమయంలో వేగంగా స్పందించడానికి ఈ సహాయం ఉపయోగపడుతుందని ప్రపంచబ్యాంకు పేర్కొంది.

# జంట తుఫానులతో జపాన్ గడగడ

**టోక్యో:**జంట తుఫానులు జపాన్‌ను తీవ్రంగా భయపెడుతున్నాయి. ఈ కారణంగా ఆ దేశంలోని టోక్యో సహా ప్రధాన నగరాలు గడగడ లాడుతున్నాయి. 10,00,000 మంది ప్రజలను ఇళ్ళు వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళిపోవాలని ప్రభుత్వం హెచ్చరిక జారీ చేసింది. అతి ఎత్తైన పర్వతాలకు నిలయమైన యమునాషి ప్రిఫిక్చర్ ప్రాంతంలో ఇరవైనాలుగు గంటల క్రితమే 5.7 తీవ్రతతో భూకంపం వచ్చిన తర్వాత జపాన్‌లోని అనేక ప్రాంతాలలో రెండు శక్తిమంతమైన పసిఫిక్ సముద్ర ఉష్ణమండల తుఫానులు బీభత్సం సృష్టిస్తున్నాయి. టోక్యో సహా పలు నగరాలలోని భవంతులు ఇప్పటికే వరదనీటి ప్రభావంతో నీట మునిగాయి. 108 కి.మీ వేగంతో ఈ ప్రాంతంలో గాలులు వీస్తున్నాయి. 120 దేశీయ విమాన సర్వీసులను ప్రభుత్వం రద్దు చేసింది.

# పిడుగుపాటుకు నలుగురు మృతి

**ఛింద్వారా:** మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లాలో రెండు వేర్వేరు పిడుగుపాటు ఘటనల్లో నలుగురు మృతి చెందగా, మరో ఎనిమిది మంది గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం, ఈ ఘటనలు శుక్రవారం బైహార్, గర్హీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి.

# గుర్తింపు సంఘం ఎన్నికలు (మొదటి పేజీ తరువాయి)

వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి, ఇతర ఆర్‌టిసి ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తు చేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్‌టిసి యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడిల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్‌టిసి గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పిఆర్‌సి, ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనం. పిఆర్‌సి విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్‌టిసి కార్మికుల మొదటి డిమాండ్ ఆర్‌టిసి గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను, కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్‌టిసి విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు. అయితే ఆ కమిటీలో ఉండే కార్మిక నాయకులు గుర్తింపు పొందిన సంఘం నుంచి ఉండాలంటే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయం అందరి సమక్షంలో తీసుకున్నామని వెల్లడించారు. దీనిలో భాగంగానే ప్రభుత్వం ఇప్పటికే గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిందని, లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను ఎన్నికల నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి త్వరలోనే గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించే దిశగా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకే ముందుగా గుర్తింపు సంఘాల ఎన్నికలు నిర్వహించి, ఆ సంఘం నుంచి ప్రతినిధులను విలీన కమిటీలో చేర్చే ప్రక్రియను ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ మాదిరి విలీనం తర్వాత ఇబ్బందులు కలగవద్దని గుర్తింపు కార్మిక సంఘాల నేతలను కమిటీలో చేర్చి విధివిధానాలు రూపొందించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు.

# భారత్ మౌనమెందుకు? (మొదటి పేజీ తరువాయి)

అని అన్నారు.'2025 సెప్టెంబర్‌లో, ఆక్రమిత పాలస్తీనా భూభాగంపై ఐక్యరాజ్యసమితి స్వతంత్ర అంతర్జాతీయ విచారణ కమిషన్, గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ అధికారులు జాతి నిర్మూలనకు పాల్పడుతున్నారని నిర్ధారించింది. 2026 జూన్‌లో ప్రముఖ భారతీయ న్యాయకోవిదుడు, రిటైర్డ్ జస్టిస్ ఎస్. మురళీధర్ నేతృత్వంలోని అదే కమిషన్, గాజాలోని పాలస్తీనియన్ల పిల్లలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా వారి ఉనికినే నాశనం చేయాలనే ఉద్దేశంతోనే ఇజ్రాయెల్ చర్యలు ఉన్నాయని హృదయవిదారకంగా పునరుద్ఘాటించిందని సోనియాగాంధీ తెలిపారు '94 పేజీల ఈ నివేదిక చదివితే ఒళ్లు గగుర్పొడుస్తుంది. గాజాలో ఇజ్రాయెల్ జరిపిన విధ్వంసం తీవ్రత, దాని చర్యల వెనుక ఉన్న జాతి నిర్మూలన ఉద్దేశంపై భయంకరమైన వివరాలు ఇందులో ఉన్నాయి. కనీసం 20,000 మంది పిల్లలు చనిపోయారు, మరో 44,000 మంది గాయపడ్డారు, వీరిలో చాలామంది గాయాలు జీవితాంతం ఉంటాయని' అని ఆమె అన్నారు. పిల్లలను లక్ష్యంగా చేసుకోవడం యాదృచ్ఛికం కాదని, ఇది ఒక ఉద్దేశపూర్వక వ్యూహమని ఆమె నొక్కి చెప్పారు.'చనిపోయిన లేదా గాయపడిన వారిలో ఇరవై ఏడు శాతం మంది పిల్లలేనని, వారిలో చాలా మంది బాలుర తల, మెడలపై బుల్లెట్ల గాయాలతో కనిపించారని' ఆమె అన్నారు.పిల్లల ఆసుపత్రులతో సహా ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయని, దీని ఫలితంగా గర్భస్రావాలు, ప్రసవ సంబంధిత సమస్యలు 300 శాతం పెరిగాయని గాంధీ తెలిపారు. ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన 'హేయమైన, భయంకరమైన, ఏమాత్రం ఆమోదయోగ్యం కాని దాడి' జరిగి రెండున్నరేళ్లు గడిచాక, ఇజ్రాయెల్ సాయుధ దళాలు, రాజకీయ నాయకత్వం ప్రతీకారం 'అడ్డూ అదుపూ లేని క్రూరత్వం, అనాగరికత'తో కూడుకుని ఉందని స్పష్టమైందని ఆమె అన్నారు. 'ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు, ఆయన సీనియర్ క్యాబినెట్ సహచరులతో సహా ఇజ్రాయెల్ ఉన్నత నాయకులు, గాజాపై 'సంపూర్ణ ముట్టడి', 'పూర్తి నిర్మూలన'కు పిలుపునిచ్చారు. పాలస్తీనియన్లను 'జీవించే హక్కు లేని జంతువులు'గా ఖండించారు. 'లక్షలాది మంది గాజా నుండి పారిపోవడమే' ఇజ్రాయెల్ విజయంగా నిర్వచించారు,' అని సోనియాగాంధీ పేర్కొన్నారు. ఈ స్పష్టమైన 'జాతి నిర్మూలన ఉద్దేశం' ఉన్నప్పటికీ, వాషింగ్టన్ డీసీలోని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ మద్దతు, పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ ప్రభుత్వం తన 'క్రూరమైన ప్రచారాన్ని' కొనసాగించడానికి వీలు కల్పించిందని ఆమె అన్నారు. ఈ విషయం మిగతా ప్రపంచం మనస్సాక్షిని కలచివేసిందని ఆమె అన్నారు. అమెరికా అడ్డంకుల కారణంగా ఐక్యరాజ్యసమితి ఎలాంటి దృఢ సంకల్పంతో చర్యలు తీసుకోలేకపోయింది, కానీ తన ఏజెన్సీల ద్వారా ఇజ్రాయెల్ యుద్ధ నేరాలను నమోదు చేయడంలో అద్భుతమైన పాత్ర పోషించిందని ఆమె ప్రశంసించారు. పాశ్చాత్య కూటమితో చారిత్రాత్మకంగా సంబంధం ఉన్న ఫ్రాన్స్, యుకె, కెనడా, ఆస్ట్రేలియా వంటి అగ్రరాజ్యాలు, పాలస్తీనా సమస్య పట్ల దశాబ్దాల ఉదాసీనత తర్వాత పాలస్తీనా రాజ్య ప్రతిపత్తిని గుర్తించాయని ఆమె పేర్కొన్నారు.వలసవాద వ్యతిరేక సంఘీభావం విషయంలో భారతదేశంతో సుదీర్ఘ ఉమ్మడి చరిత్ర కలిగిన దక్షిణాఫ్రికా, 1948 నాటి మారణహోమంపై ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు ఇజ్రాయెల్‌ను అంతర్జాతీయ న్యాయస్థానానికి లాగిందని సోనియా గాంధీ గుర్తు చేశారు.

అనేక యూరోపియన్ దేశాలు ఇజ్రాయెల్‌కు ఆయుధాల అమ్మకాలను పరిమితం చేశాయని, పలు లాటిన్ అమెరికన్ దేశాలు ఆ దేశంతో తమ సంబంధాలను తగ్గించుకున్నాయని లేదా తెంచుకున్నాయని కూడా ఆమె తెలిపారు.అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఇజ్రాయెల్ రాజకీయ నాయకత్వంపై అరెస్టు వారెంట్లు కూడా జారీ చేసిందని ఆమె అన్నారు.భారతదేశం సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న చాలా దేశాలు గాజాలో ఇజ్రాయెల్ చర్యలను మారణహోమంగా గుర్తించాయని గాంధీ తెలిపారు.ఇజ్రాయెల్‌పై ప్రజాగ్రహం పెరుగుతున్నప్పటికీ, గాజాపై జరిగిన అన్యాయమైన క్రూరత్వాన్ని అంతర్జాతీయ సమాజం గుర్తిస్తున్నప్పటికీ, భారతదేశం మౌనం వహించిన ఏకైక స్వరంగా మిగిలిపోయింది,' అని ఆమె అన్నారు. గాజా మారణహోమానికి వ్యతిరేకంగా కొత్త చర్చలకు, క్రియాశీలతకు దారితీసిన జస్టిస్ మురళీధర్ నివేదికపై నరేంద్ర మోదీ ప్రభుత్వం 'నిశ్శబ్దంగా' వ్యవహరిస్తోందని మాజీ కాంగ్రెస్ అధినేత్రి విమర్శించారు.ఇందులో ఆశ్చర్యపడాల్సిన విషయమేమీ లేదు 2020 ఢిల్లీ అల్లర్లకు ముందు బిజెపి నాయకుల రెచ్చగొట్టే ప్రకటనలపై ఢిల్లీ పోలీసులు చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నించిన తర్వాత జస్టిస్ మురళీధర్‌ను ఢిల్లీ హైకోర్టు నుండి బదిలీ చేశారన్న విషయాన్ని గుర్తుచేసుకోవాలి అని ఆమె అన్నారు.వలసానంతర ఐక్యత, జాతీయ సార్వభౌమత్వం, అంతర్జాతీయ శాంతి పట్ల మన నిబద్ధత విషయంలో ప్రపంచ దేశాలలో భారతదేశం చారిత్రాత్మకంగా విశిష్టమైనదని సోనియాగాంధీ పేర్కొన్నారు. 'ప్రపంచ నియమాల ఆధారిత వ్యవస్థను బరితెగించి ఉల్లంఘిస్తున్నా, దక్షిణార్థ భూగోళంలోని మన తోటి ప్రజలు బాధపడుతున్నా, గాజా, వెస్ట్ బ్యాంక్‌లో బహిరంగంగా మానవ గౌరవాన్ని అణచివేస్తున్నా, నేడు మనం అసాధారణ రీతిలో నిరంతరం ఉదాసీనంగా ఉన్నాం' అని ఆమె తన వ్యాసంలో పేర్కొన్నారు.హింద్ రజబ్ విషాద గాథను గుర్తుచేసుకుంటూ, గాజాలో ఇజ్రాయెల్ జరిపిన వర్ణనాతీతమైన క్రూరత్వానికి ఆమె ప్రతీక అని సోనియగాంధీ అన్నారు. 'కేవలం ఐదేళ్ల బాలిక తన కుటుంబంతో కలిసి గాజా నగరం నుండి పారిపోతుండగా, ఇజ్రాయెల్ దళాలు వారి కారుపై 335 రౌండ్ల కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఆమె ఆరుగురు కుటుంబ సభ్యులు మరణించారు. పారామెడిక్స్ ఆమెను రక్షించడానికి ప్రయత్నిస్తుండగా, ఆమె తన బంధువుల మృతదేహాలతో పాటు కారులో చిక్కుకుపోయింది. చివరికి, ఇద్దరు పారామెడిక్స్‌తో పాటు ఆమె కూడా హత్యకు గురైంది,' అని ఆమె అన్నారు.భారతదేశం తన వ్యూహాత్మక ప్రయోజనాలను, నైతికతను త్యాగం చేయడం వల్ల, ప్రధానమంత్రి మోదీ, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహుల మధ్య స్నేహం తప్ప మరేమీ మిగలలేదు. ప్రస్తుతం నెతన్యాహు అమెరికాతో సహా ప్రపంచవ్యాప్తంగా దాడులను ఎదుర్కొంటున్నారు అని సోనియా గాంధీ అన్నారు.

# మళ్లీ మొదటికే!

(మొదటి పేజీ తరువాయి)

రెపరెపలాడుతోంది. పర్షియన్ గల్ఫ్ అంతటా లక్ష్యంగా చేసుకుని ఇరాన్ డ్రోన్ల దాడులు చేసింది. దీంతో మరోసారి యుద్ధంపై నియంత్రణ కోల్పోయే పరిస్థితి వచ్చింది.గురువారం నాడు హోర్ముజ్ జలసంధి నుండి బయటకు వచ్చేందుకు అమెరికా నౌక ప్రయత్నం చేసినప్పుడు ఇరాన్ దానిని అడ్డుకుని దాడులు చేసిందన్నది అమెరికా సెంట్‌కామ్ ఆరోపణ. బహ్రైన్‌పైనే ఎక్కువగా ఇరాన్ దాడులు చేసింది. ఎందుకంటే ఇదే అమెరికాకు గల్ఫ్‌లో అతిబలమైన స్థావరం. పెద్ద సంఖ్యలో ఇరాన్ డ్రోన్లు తమ దేశాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేశాయని బహ్రైన్ విదేశీమంత్రిత్వశాఖ శనివారం ప్రకటించింది. కాగా బ్రిటిష్ మిలిటరీకి చెందిన యుకెఎంటిఓసి)సముద్ర వాణిజ్య కార్యకలాపాల కేంద్రం) ఒక ప్రకటన చేస్తూ, శనివారం హోర్ముజ్ జలసంధిలో ఒక ట్యాంకర్‌పై దాడి జరిగిందని, ఐతే సిబ్బంది క్షేమంగా ఉన్నారని, పర్యావరణానికి ఎలాంటి హానీ జరగలేదని పేర్కొంది. ఐతే ఈ దాడి ఇరాన్ పనే అని వెంటనే సందేహాలు రేకెత్తాయి.

ఒప్పందం తర్వాత హోర్ముజ్ జలసంధిలో జల మార్గాల పునరుద్ధరణ సవాలుగా మారింది. సుంకాలు విధించేందుకు అమెరికా వ్యతిరేకిస్తుండగా, ఫీజులు వసూలు చేసేందుకు ఇరాన్–ఒమన్ సిద్ధపడుతుఆన్నయి. పోను పోను అదే పెద్ద వివాదంగా మారుతోంది. ఇరాన్ నిర్దేశించిన నౌకా రవాణా మార్గాలను కాదని కొత్త దారులలో నౌకలను నడిపేందుకు ప్రయత్నం చేస్తూ ఇరాన్‌కు అమెరికా ఆగ్రహం రప్పించడమే రెండు దేశాల తక్షణ ఉద్రిక్తతలకు ప్రధాన అంతర్గత కారణం.అమెరికా నావికాదళం పర్యవేక్షణలో ఉండే మల్టీనేషనల్ మారిటైమ్ విభాగం ఒమన్ సమీపంలో ఒక దారిన్ని సృష్టించింది. ఇకమీదట హోర్ముజ్‌లోకి నౌకలు ఈ దారిలోనే రాక–పోకలు సాగిస్తాయని పేర్కొంది.దీనిని బ్రిటన్ సముద్ర పర్యవేక్షణ సంస్థ కూడా ధృవీకరించింది. ఇదే సమయంలో తమ మార్గాలనే ఉపయోగించాలన్న ఇరాన్ డిమాండ్‌ను అమెరికా, గల్ఫ్,అరబ్ దేశాలు కూడా తిరస్కరించాయి. ఇదే ఇరాన్ ఆగ్రహానికి కారణం. ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించి ప్రవర్తించిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శలు చేయగా, ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు అమెరికా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఐఆర్‌జిసి తీవ్ర హెచ్చరిక జారీ చేసింది.

ఆ తర్వాత సోషల్ మీడియా వేదికగా ట్రంప్ స్పందిస్తూ, ఇరాన్‌పై దాడులు పూర్తిచేశామని, హోర్ముజ్ సాధారణ స్థితికి వచ్చిందని చెప్పారు. ఇరాన్ సైన్యాన్ని ఇప్పటికే శక్తిహీనం చేశామని, ఆ దేశాన్ని సైనికంగా 30 ఏళ్ళు వెనక్కు నెట్టామని ట్రంప్ మరోసారి చెప్పారు.'వారు' ఒప్పందాన్ని ఉల్లంఘించి హోర్ముజ్ జలసంధిలో తమ ట్యాంకర్‌పై దాడి చేసినందువల్లనే సెంట్‌కామ్ యుద్ధ దాడులతో ఆ దేశాన్ని శిక్షించిందని చెప్పారు. ఐతే తర్వాత జలసంధిలో నౌకల రవాణా సాధారణంగా జరుగుతోందని చెప్పారు. కాగా, తాము నిర్దేశించిన జల మార్గాలలోనే నౌకలన్నీ అనివార్యంగా ప్రయాణం చేయాలని, ప్రయాణ సమయంలో తమ నావికావిభాగాధికారులతో నౌకలు అనుసంధానమై సమన్వయంతో వ్యవహరించాలని ఇరాన్ తన హెచ్చరికను పునరుద్ఘాటించింది. ఇరాన్ నిర్దేశించిన మార్గాలలో నౌకలు ప్రయాణించడం ద్వారా సుంకాలు లేదా జల రవాణా నిర్వహణ ఖర్చుల పేరుతో ఫీజు వసూలు ఇరాన్‌కు సాధ్యపడుతుంది. కొత్త మార్గాలలో నౌకలు ప్రయాణం చేస్తే ఇరాన్‌కు ఆర్థికనష్టం వాటిల్లుతుంది. అమెరికా మాట చెల్లుబాటవుతుంది. ఈ పరిస్థితుల్లో ఛానల్–16 ద్వారా మాత్రమే ప్రయాణాలు సాగించాలని అంతర్జాతీయ నౌకలను ఇరాన్ హెచ్చరిస్తోంది. దీంతో షిప్పింగ్ కంపెనీలు ఆందోళన చెందుతున్నాయి. ఇంతన దరలతో ఇప్పటికే ద్రవ్యోల్బణం పెరిగింది. ఈ ఏడాది గల్ఫ్ ప్రాంతంలో ఆర్థిక అభివృద్ధి కూడా 2.6 శాతం క్షీణించింది. ఈ ఏడాది జూన్ 20వ తేదీ నాటికి జలసంధిలో రోజుకు 42 నౌకలు రాకపోకలు చేయగా, యుద్ధానికి ముందు రోజుకు 152 నౌకలు రాకపోకలు సాగించేవి.

# పరిహారం కోరొచ్చు

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించినందున పరిహారం కోరే దావా తప్పనిసరిగా స్వాధీనాన్ని అప్పగించే చర్యకు ముందు కాలం నుంచే ఉత్పన్నమవుతుందని అత్యున్నత న్యాయస్థానం గమనించింది. 'తర్వాత స్వాధీనం స్వీకరించిన మాత్రాన ఆరోపించబడిన జాప్యానికి నష్టపరిహారం కోరే కేటాయింపుదారుడి హక్కు రద్దు కాదు' అని ధర్మాసనం తన జూన్ 4వ తేదీ ఉత్తర్వులో పేర్కొంది. ఫ్లాట్ స్వాధీనాన్ని అప్పగించడంలో జాప్యం కారణంగా, సేవాలోపం జరిగిందని ఆరోపిస్తూ అప్పీల్‌దారుడు జిల్లా వినియోగదారుల ఫోరమ్‌లో వినియోగదారుల ఫిర్యాదును దాఖలు చేశారు. జులై 2009లో, జిల్లా ఫోరం పార్టీలను ఆర్‌బిఐకి సూచించింది. ఆ ఉత్తర్వును ఫిబ్రవరి 2013లో ఢిల్లీ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కర కమిషన్ ధృవీకరించింది. అనంతరం అప్పీల్‌దారుడు ఎన్‌సిడిఆర్‌సిపి ఆశ్రయించగా అది 2016జనవరిలో అతడి రివిజన్ పిటిషన్‌ను కొట్టివేసింది. జిల్లా ఫోరమ్ దాఖలు చేసిన వినియోగదారుల ఫిర్యాదును స్వీకరించి సొసైటీకి నోటీస్ జారీచేసినట్లు, ఆ తర్వాత వివాదాన్ని మధ్యవర్తిత్వానికి సూచించాలని కోరుతూ ఒక దరఖాస్తును దాఖలు చేసినట్లు అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.పార్టీల మధ్య ఒప్పందంలో మధ్యవర్తిత్వ నిబంధన ఉన్నంత మాత్రాన వినియోగదారుల ఫోరమ్ ముందు అప్పీల్‌దారుడి కేసు కొట్టివేయడానికి అది సరిపోదని బెంచ్ తెలిపింది. ఫిర్యాదు దాఖలు చేయడానికి ముందే స్వాధీనం అప్పగించబడినందున అప్పీల్‌దారుడు వినియోగదారుడు కాకుండా నిర్ధారించడం ద్వారా ఈ సమస్యలను ప్రాథమిక దశలోనే ముగించలేమని ధర్మాసనం వెల్లడించింది.అప్పీల్‌ను అనుమతిస్తూ ఎన్‌సిడిఆర్‌సి,, రాష్ట్ర కమిషన్, జిల్లా ఫోరం ఇచ్చిన ఉత్తర్వులను ధర్మాసనం రద్దు చేసింది.ఇది వినియోగదారుడి ఫిర్యాదును పునరుద్ధరించి, దాని యోగ్యతల ద్వారా నిర్ణయం తీసుకోవడం కోసం ద్వారకలోని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌కు అప్పగించాలని బెంచ్ తెలిపింది.

# అంగీకరించబోం (మొదటి పేజీ తరువాయి)

యథాతథంగా అంగీకరించబోదని స్పష్టం చేశారు. అవసరమైతే ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధమని ప్రకటించారు. సచివాలయంలో శనివారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమిక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను కేంద్రీకరించి, గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను బలహీనపర్చే ప్రయత్నమే ఈ చట్టమని ఆరోపించారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉండే ఎ చట్టాన్నీ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించదని స్పష్టం చేశారు. ఈ చట్టంలోని పలు నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని న్యాయ నిపుణులు సూచించారని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి ఉమ్మడి న్యాయపరమైన, రాజకీయ కార్యాచరణ చేపట్టాలని ఉపసంఘం నిర్ణయించినట్లు వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను వ్యతిరేకించాయని, తెలంగాణకు ప్రత్యేక ఉపాధి హామీ చట్టం తీసుకురావాలని సూచించాయని చెప్పారు. కేంద్రం ప్రతిపాదించిన 60 రోజుల ఉపాధికి బదులుగా ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల ఉపాధి హామీకల్పించాలని, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని వారు కోరినట్లు వివరించారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్య విధానం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారం మోపే అవకాశం ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం ఇప్పటికే కేంద్రానికి సమగ్ర సూచనలు పంపినా వాటిని పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు.తెలంగాణ ప్రజల హక్కులు, రాష్ట్ర రాజ్యాంగబద్ధ అధికారాలు, గ్రామీణ పేదల జీవనోపాధిని కాపాడేందుకు ప్రభుత్వం అన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. ఈ అంశంపై జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

# భారత్ 'ఏ'కు స్వల్ప ఆధిక్యం

మొదటి అనధికారిక టెస్టులో భారత ఏ బౌలర్ల ధాటికి రోజున్నరకే శ్రీలంక ఏ ఆలౌటైంది. అకీబ్ నబీ దార్(4–58) పేస్‌ను ఎదుర్కోలేక ఆతిథ్య జట్టు బ్యాటర్లు తోకముడవగా.. 330 రన్స్‌కే కుప్పకూలింది. దాంతో, భారత ఏ జట్టుకు 160 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లోనూ టీమిండియాకు శుభారంభమివ్వాలనుకున్న ఓపెనర్ సాయి సుదర్శన్(7) రిటైర్డ్ హర్టయ్యాడు. ప్రస్తుతం ఆయుష్ పాండే, దేవ్‌దత్ పడిక్కల్ ఆడుతున్నారు. గాలే స్టేడియంలో జరుగుతున్న మొదటి అనధికారిక టెస్టులో భారత ఏ పట్టుబిగించింది. రంజీ వీరుడు అకీబ్ నబీ(4–58) బంతితో విజృంభించగా మూడోరోజే శ్రీలంక ఏ కుప్పకూలింది. ఓవర్ నైట్ స్కోర్ 113/2తో ఇన్నింగ్స్ మొదలెట్టిన లంకను యశ్ ఠాకూర్(2–



51) దెబ్బకొట్టాడు. అర్ధశతకంతో విసిగించిన నువనిందు ఫెర్నాండో(84)ను ఔట్ చేసిన ఠాకూర్ వికెట్ల వేటకు తెరతీశాడు. అంజల బండార(70)ను వెనక్కి పంపిన నబీ.. లోయర్ ఆర్డర్‌ను పడగొట్టాడు. నబీ ధాటికి శ్రీలంక ఏ 330 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ సాయి సుదర్శన్(132), ఆయుష్ పాండే(25)లు భారత ఏ జట్టుకు శుభారంభమిచ్చారు. తొలి వికెట్‌కు 92 రన్స్ జోడించిన సాయి.. ఆ తర్వాత దేవ్‌దత్ పడిక్కల్(12), రుతురాజ్ గైక్వాడ్(22)లతో విలువైన భాగస్వామ్యాలు నెలకొల్పాడు. షేక్ రషీద్(63), ధ్రువ్ జురెల్(141 నాటౌట్) మెరవగా.. తొలి రోజే 4 వికెట్ల నష్టానికి 333 రన్స్ కొట్టిన భారత్.. రెండో రోజూ జోరు చూపింది. రషీద్‌తో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన జురెల్ రెండో రోజు లంక బౌలర్లను పరీక్షించాడు. హర్ష్ దూబే(30)తో కలిసి స్కోర్ నాలుగొందలు దాటించాడు. దూబేను గుణశేఖర( 3–84) ఔట్ చేశాక 452–6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది భారత ఏ.

# హైదరాబాద్ 'ఈ' ఛాంపియన్స్ హ్యాట్రిక్ విజయం



**హైదరాబాద్:** టీజీ20 లీగ్‌లో హైదరాబాద్ 'ఈ' ఛాంపియన్స్ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. మెదక్ ఫాల్కన్స్‌తో జరిగిన మ్యాచ్లో 46 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 241 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన మెదక్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 194 రన్స్‌కు పరిమితమైంది. విక్రమ్ నాయక్ (75; 42 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సు) రాణించాడు. రవితేజ 31, ఇషాన్ శర్మ 27, వరుణ్ 38 రన్స్ చేశారు. హైదరాబాద్ బౌలర్లలో అజయేవ్ గౌడ్ 4, ప్రణవ్ వర్మ 2 వికెట్లు పడగొట్టారు. శ్రీనికేత్, నితిన్ నాయక్ చెరో వికెట్ తీశారు. మెదక్ ఫాల్కన్స్కు నాలుగు మ్యాచ్ వరుసగా ఇది మూడో ఓటమి. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఓపెనర్లు సాయివికాస్ రెడ్డి (93; 48 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సు), అభిరథ్ రెడ్డి (59; 27 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సు) జట్టు భారీ స్కోరు సాధించడానికి గట్టి పునాది వేశారు. చివర్లో గడుగు గణేశ్ (22 *; 7 బంతుల్లో 3 సిక్సు) దూకుడుగా ఆడాడు. నితిన్ నాయక్ (18), అరవింద్ (17), పరుగులు చేశారు. మెదక్ బౌలర్లలో సయ్యద్ ఘాజీ అబ్బాస్ 2, విక్రమ్ నాయక్ 2, సాయివరుణ్, కార్తికేయ, రవితేజ, అశ్విన్ రామ్ ఒక్కో వికెట్ తీశారు.

# ఇరాన్‌కు షాకిస్తూ నాకౌట్‌కు ఈజిప్ట్

ఫిఫా వరల్డ్‌కప్‌లో ఇరాన్ నాకౌట్ బెర్తు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. టోర్నీలో అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నా గొప్పగా ఆడిన ఆ జట్టు ఈజిప్ట్‌తో మ్యాచ్‌ను 1–1తో డ్రా చేసుకోవమే అందుకు కారణం. చివరి నిమిషంలో ఇరాన్ ఆటగాడు ఖలిజదేహ్ గోల్ చేసినా వీడియో అసిస్టెంట్ రిఫరీ మాత్రం లెక్కలోకి తీసుకోకపోవడం ఈజిప్ట్ 32వ రౌండ్‌కు దూసుకెళ్లింది. దాంతో.. ఇరాన్ ఆటగాళ్లు నిరాశలో మునిగిపోయారు గ్రూప్ జీలోని ఇరాన్, ఈజిప్ట్ నాకౌట్ బెర్తు లక్ష్యంగా హోరాహోరీగా తలపడ్డాయి. ఐదో నిమిషంలోనే మహమూద్ సబెర్() గోల్ అందించగా.. ఈజిప్ట్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. కాసేపటికి ఇరాన్‌కు పెనాల్టీ లభించినా సద్వినియోగం చేసుకోలేదు. ప్రత్యర్థి డిఫెన్స్‌ను ఛేదిస్తూ 14వ నిమిషంలో రమిన్ రజీయన్ గోల్‌తో ఇరాన్ 1—1తో స్కోర్ సమం చేసింది. ఆ తర్వాత ఇరజట్ల ఆటగాళ్లు తీవ్రంగా ప్రయత్నించారు. ఇక మ్యాచ్ డ్రా ఖాయమనుకున్న వేళ.. 93వ నిమిషంలో ఆట ముగుస్తుందనగా.. ఇరాన్ ప్లేయర్ ఖలిజదేహ్ ఈజిప్ట్ గోల్‌పోస్ట్‌లోకి బంతిని పంపాడు. 2–1తో ఆసియా జట్టు గెలిచిందనుకుంటే.. బంతి ఆఫ్ సైడ్ వెళ్లిందని వీడియో అసిస్టెంట్ రిఫరీ గోల్ ఇవ్వలేదు. దాంతో, 1–1తో మ్యాచ్ డ్రాగా ముగియడంతో ఈజిప్ట్ నాకౌట్‌లో అడుగుపెట్టింది. గ్రూప్ జీ నుంచి బెల్జియం, ఈజిప్ట్ 32వ రౌండ్‌కు చేరగా.. మూడో స్థానంతో ఇరాన్ నాకౌట్ చేరే అవకాశముంది.




బిజినెస్

## ఈ వారం స్టాక్ మార్కెట్లు

**బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ/ క్లోజింగ్):** సెన్సెక్స్ ప్రారంభం 75,527.95 పాయింట్లు. ముగింపు 77,100.47 పాయింట్లు. లాభం: 1,572.52 పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ/ క్లోజింగ్):** నిఫ్టీ ప్రారంభం 23,622.90 పాయింట్లు. ముగింపు 24,056.00 పాయింట్లు. లాభం: 433.10 పాయింట్లు.

## బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (శనివారం నాటికి)

**24 క్యారెట్లు:** రూ. 1,41,600

**22 క్యారెట్లు:** రూ. 1,29,800

**18 క్యారెట్లు:** రూ. 1,06,200

# హోమ్ లోన్ 'ఓవర్‌డ్రాఫ్ట్'తో వినియోగదారులకు లాభం



సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు చాలా మంది హోమ్ లోన్ తీసుకుంటారు. అయితే 15–20 ఏళ్లపాటు ఈఎంఐలు చెల్లించడం వల్ల వడ్డీ భారం గణనీయంగా పెరుగుతుంది. అలాంటి పరిస్థితుల్లో 'హోమ్ లోన్ ఓవర్‌డ్రాఫ్ట్' సదుపాయం వడ్డీ భారాన్ని తగ్గించడంతో పాటు అత్యవసర సమయాల్లో ఆర్థిక వెసులుబాటును కూడా కల్పిస్తుంది. ఈ విధానంలో హోమ్ లోన్ ఖాతాను ఓవర్‌డ్రాఫ్ట్ ఖాతాతో అనుసంధానిస్తారు. సాధారణ ఈఎంఐతో పాటు చేతిలో ఉన్న అదనపు నగదును ఈ ఖాతాలో జమ చేయవచ్చు. బ్యాంకు మొత్తం రుణంపై కాకుండా, జమ చేసిన మొత్తాన్ని మినహాయించిన తర్వాత మిగిలిన రుణంపైనే వడ్డీ లెక్కిస్తుంది. ఉదాహరణకు, రూ.40 లక్షల రుణంలో రూ.5 లక్షలు అదనంగా జమ చేస్తే, వడ్డీ కేవలం రూ.35 లక్షలపైనే పడుతుంది. అవసరమైతే ఆ డబ్బును తిరిగి ఉపసంహరించుకునే అవకాశం కూడా ఉంటుంది. ఈ సదుపాయం వల్ల వడ్డీ ఖర్చు తగ్గడంతో రుణం త్వరగా తీరుతుంది. అదనపు ప్రీపేమెంట్ ఛార్జీలు ఉండవు. ముఖ్యంగా వ్యాపారులు, ఫ్రీలాన్సర్లు, కమిషన్ ఆధారిత ఆదాయం ఉన్న వారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే ఈ విధానంలో కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి. సాధారణ హోమ్ లోన్లతో పోలిస్తే వడ్డీ రేటు కొద్దిగా ఎక్కువగా ఉండవచ్చు. అలాగే ఈ ఖాతాలో నిల్వ చేసే డబ్బును ఇతర పెట్టుబడుల్లో పెట్టి ఎక్కువ రాబడి పొందే అవకాశం కోల్పోవచ్చు. ఎప్పుడైనా డబ్బు తీసుకునే వెసులుబాటు ఉండటంతో అనవసర ఖర్చులకు వినియోగించే ప్రమాదం కూడా ఉంది. అంతేకాకుండా, సాధారణ హోమ్ లోన్‌కు లభించే పన్ను మినహాయింపులు తప్ప అదనపు పన్ను ప్రయోజనాలు ఉండవు. అందువల్ల, చేతిలో తరచూ అదనపు నిధులు ఉండే వారు క్రమశిక్షణతో ఈ సదుపాయాన్ని వినియోగిస్తే వడ్డీ భారాన్ని గణనీయంగా తగ్గించుకుని లక్షల రూపాయలు ఆదా చేసుకునే అవకాశం ఉంటుంది.

# భారత్ జిడిపి వృద్ధి అంచనాను పెంచిన 'గోల్డ్‌న్ శాక్స్'

అంతర్జాతీయ ఆర్థిక సేవల సంస్థ 'గోల్డ్‌న్ శాక్స్' భారత ఆర్థిక వ్యవస్థపై సానుకూల అంచనాలు వెల్లడించింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి భారత స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటు అంచనాను 6.3 శాతం నుంచి 6.5 శాతానికి పెంచింది. పశ్చిమాసియా ప్రాంతంలో పరిస్థితులు క్రమంగా స్థిరపడడం, అంతర్జాతీయ ముడిచమురు ధరలపై ఒత్తిడి తగ్గడం, దేశీయ ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండటం ఈ సవరణకు ప్రధాన కారణాలని సంస్థ పేర్కొంది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బిఐ) వడ్డీ రేట్లపై అనుకూల వైఖరి కొనసాగించే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ద్రవ్యోల్బణం తగ్గితే వినియోగదారుల కొనుగోలు శక్తి పెరగడంతో పాటు పెట్టుబడులు, వినియోగం కూడా మెరుగుపడే అవకాశం ఉంటుంది. ఇదే ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుందని గోల్డ్‌న్ శాక్స్ విశ్లేషించింది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల మధ్య కూడా భారత ఆర్థిక వ్యవస్థ బలమైన దేశీయ డిమాండ్ ప్రభుత్వ మూలధన వ్యయం, సేవల రంగం వృద్ధి వంటి అంశాల ఆధారంగా వేగంగా అభివృద్ధి చెందే ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా కొనసాగుతుందని సంస్థ పేర్కొంది.



# ద్రవ్యోల్బణం.. వడ్డీ రేట్లు

టోకు ధరల ఆధారంగా లెక్కించే హోల్‌సేల్ ద్రవ్యోల్బణం 3.85 శాతానికి తగ్గడం ధరల ఒత్తిడి కొంత మేర తగ్గుతున్న సంకేతంగా భావించవచ్చు. దీనివల్ల భవిష్యత్తులో ద్రవ్యోల్బణ నియంత్రణకు అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. ఇదే సమయంలో రూపాయి విలువ అమెరికా డాలర్‌తో పోలిస్తే సుమారు రూ. 94.39 వద్ద కొనసాగుతోంది. రూపాయి బలహీనంగా ఉంటే చమురు వంటి దిగుమతుల వ్యయం పెరిగి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చు. మరోవైపు, ద్రవ్యోల్బణం అదుపులో ఉంటే కేంద్ర బ్యాంకు వడ్డీ రేట్లపై తక్షణ మార్పులు చేయకుండా వేచి చూసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో రుణగ్రహీతలు, పెట్టుబడిదారులు, వ్యాపార రంగానికి కొంత స్థిరత్వం లభించవచ్చు.

# పెట్టుబడి ప్రోత్సాహకాలపై సమీక్ష!

పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు అందిస్తున్న రివార్డ్‌లు, క్యాష్‌బ్యాక్‌లు, రిఫరల్ బోనస్‌లు వంటి ప్రోత్సాహకాలపై మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెబీ' సమీక్ష చేపడుతున్నట్లు సమాచారం. ఈ తరహా పథకాలు పెట్టుబడిదారులను అధిక ప్రమాదం ఉన్న పెట్టుబడుల వైపు మళ్లించే అవకాశాలు ఉన్నాయా? అనే అంశాన్ని పరిశీలిస్తోంది. మరోవైపు, అనిల్ అంబానీకు సంబంధించిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కేసులో ఆయన దాఖలు చేసిన సెటిల్‌మెంట్ అభ్యర్థనను సెబీ తిరస్కరించినట్లు వార్తలు వచ్చాయి. ఈ పరిణామాలు మార్కెట్‌లో పారదర్శకత, పెట్టుబడిదారుల రక్షణ, కార్పొరేట్ పాలన ప్రమాణాల అమలుపై సెబీ కఠిన వైఖరిని ప్రతిబింబిస్తున్నాయి.

# సింగరేణిపై రాజకీయ పార్టీల ప్రచారం అసత్యం

- మెడికల్ బోర్డు ఆపింది రాష్ట్ర ప్రభుత్వమే
- కాంగ్రెస్ హయాంలో రాజకీయ జోక్యం పెరిగింది
- హక్కుల సాధనకు అవసరమైతే సమ్మె
- వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిలో బొగ్గు మాయమైందని బిజెపి, బిఆర్ఎస్, టిఆర్ఎస్ రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని, దుర్మార్గమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ ఖండించారు. శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం పట్టించుకోకుండా రాజకీయ పార్టీలు బాయి బాటలు పడుతూ సంస్థపై దుష్ప్రచారం చేస్తున్నాయని వారు మండిపడ్డారు. సింగరేణిలో టార్గెట్ రీచ్ కోసం అధికారులు అదనంగా బొగ్గు కలిపి చూపించడం వాస్తవమేనని, కానీ అది సరైన విధానం కాదని వారు అంగీకరించారు. అయితే బొగ్గు మాయమైందనే ప్రచారం మాత్రం బూటకమని వారు స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 75 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని అప్పుడు కాంగ్రెస్ నాయకులు ఆరోపించారని, ఇప్పుడు అదే నాయకుడు బిఆర్ఎస్‌లో ఉన్నారని వారు గుర్తు చేశారు. అదేవిధంగా సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటియుసి ఎప్పుడూ ముందుంటుందని వారు తెలిపారు. యాజమాన్యం సమ్మె నోటీసులోని డిమాండ్లను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే అన్ని కార్మిక సంఘాలను కలుపుకొని అవసరమైతే సమ్మెకు వెళ్తామని వారు హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జూన్ 8న యాజమాన్యానికి 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని చెప్పారు.ఈ నెల 25న హైదరాబాద్‌లోని ఆర్ఎల్‌సి వద్ద చర్చలు జరిగాయని, జూలై 10లోపు యూనియన్‌తో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలని ఆర్ఎల్.సి యాజమాన్యానికి సూచించినట్లు వారు వివరించారు. అదేవిధంగా సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహణను ఆపింది యాజమాన్యం కాదని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని వారు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సింగరేణిలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందని వారు ఆరోపించారు. అదేవిధంగా సింగరేణిలో 12వ వేజ్ బోర్డు సాధన కోసం అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమం చేస్తామని, కొత్త గనుల ఏర్పాటు కోసం ఏఐటియుసి ముందుండి పోరాటం చేస్తుందని ప్రకటించారు. 2014 నుండి సింగరేణికి చెందిన సిఎస్ఆర్, డిఎంఎఫ్‌టి నిధులు ఇతర ప్రాంతాలకు తరలి పోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ ప్రభుత్వ మూలంగానే సింగరేణి బొగ్గు పరిశ్రమ సర్వనాశనమైందని, బిఆర్ఎస్ హయాంలోనే సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకులను అమ్ముకున్నారని వారు విమర్శించారు.

ఎఐటియుసి అంటేనే పారదర్శకతకు కేరాఫ్ అడ్రస్ అని నొక్కి చెప్పారు.ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు మడ్డి ఎల్లా గౌడ్, వై.వి. రావు, కే. వీరభద్రం, కే. స్వామి,రాజరత్నం,రాంచందర్,గౌతమ్ గోవర్ధన్,రంగు శ్రీను, గంధం సాంబశివరావు, టి. రమేష్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.




# రైతుల్లో విశ్వసనీయత కోల్పోతున్న ప్రభుత్వం

- సీతారామ ప్రాజెక్టు పూర్తికి నిర్దిష్ట గడువు ప్రకటించాలి
- రైతు భరోసా సంపూర్ణంగా అందిస్తారా?
- హామీల అమలుకు కృషి చేయండి
- మీడియా సమావేశంలో సిపిఐ నేత బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, రైతులకు సంబంధించిన సంక్షేమ పథకాలు సంపూర్ణంగా పూర్తి చేయకపోవడంతో రైతుల్లో ప్రభుత్వం పట్ల విశ్వసనీయత సన్నగిల్లుతుందని సిపిఐ నేత, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు తెలిపారు. రైతుల్లో ఉన్న అసంతృప్తి ఆగ్రహంగా మారక ముందే రైతులకు సంబంధించిన పథకాలను పూర్తి చేయడంతో పాటు ఖమ్మం జిల్లాలో అతిపెద్ద జల వనరులుగా ఉన్న సీతారామ ప్రాజెక్టు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో రైతు ఆశీర్వాద సభ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రకటించాలని డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ సిపిఐ గోదావరి నీటిని ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు అందించాలని అనేక చారిత్రక సమరశీల పోరాటాలు నిర్వహించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా దుమ్ముగూడెం ప్రాజెక్టు ప్రారంభమైందని, ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తర్వాత అది సీతారామ ప్రాజెక్టుగా రూపాంతరం చెందిందన్నారు. రూ.11,300 కోట్ల అంచనాలతో ప్రారంభమైన సీతారామ అంచలంచెలుగా ఎదిగి నిర్మాణ వ్యయం రూ.19,365 కోట్లకు చేరిందని, ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ సీతారామ పూర్తి కావడం లేదన్నారు. కొన్ని ప్యాకేజీలలో పనులు ఇంకా ప్రారంభం కాలేదని పంట కాలువల తవ్వకాలకు ఇటీవలే టెండర్లు పూర్తి చేశారని హేమంతరావు తెలిపారు. కాంగ్రెస్ మూడు బడ్జెట్లతో కలిపి వెయ్యి కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. పూర్తి స్థాయిలో బడ్జెట్ కేటాయింపు కాలయాపన లేకుండా సీతారామ పూర్తి చేసి ఐదు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. లింక్ కెనాల్‌పై ఉన్న శ్రద్ధ సీతారామపై స్థానిక మంత్రులకు లేదన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, పంటల బీమా విషయంలో ఈ ప్రభుత్వం మాట తప్పడంతో రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. రుణమాఫీకి సంబంధించి విడుదల చేసిన జిఒలో రెండు లక్షల రుణం పైబడిన రైతుల రుణాలు సైతం మాఫీ చేస్తామని చెప్పారని ఎందుకు చేయలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. భరోసాపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం ఇప్పటికైనా పూర్తి స్థాయిలో ఇస్తుందా అనే అనుమానం వస్తుందన్నారు. మొక్కజొన్న డబ్బు లు, ధాన్యం బోనస్ ఇవ్వాలని, అన్ని రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా పేదలకు నివాస స్థల పట్టాలు పంపిణీ చేయాలన్నారు. ఖమ్మం జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలని, గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వ వైఖరి ఆక్షేపణీయమన్నారు. భూ భారతి ద్వారా భూ సమస్యలు పరిష్కరించినప్పుడే ఆశీర్వాద సభ ఫలితం ఉంటుందన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించాలని, నాగార్జున సాగర్ కాలువను ఖమ్మం నగరంలో కొందరు ధనవంతులు ఆక్రమించారని వాటిని తొలగించాలని లేని పక్షంలో పేదల పక్షాన ఆందోళన చేపడతామన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతా దేవి, గోవిందరావు, బిజి క్లైమెంట్ పాల్గొన్నారు.

# ఇండ్లులేని పేదల పక్షాన సమష్టిగా పోరాడుదాం

**బాధితుల హక్కుల సాధనకు జూలై 1 కలెక్టరేట్ ఎదుట ధర్నా : ఎస్‌కే సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇండ్లు లేని పేదల పక్షాన సమిష్టిగా పోరాడుదామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో జరిగిన సిపిఐ, సిపిఎం ముఖ్యనాయకుల రౌండ్ టేండ్ సమావేశం జరిగింది. ఇండ్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, పేదలు నిర్మించుకున్న ఇండ్లకు ఇంటి నెంబర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అదేవిధంగా పేదల ఇండ్ల కూల్చివేతను ఆపాలని డిమాండ్ చేస్తూ జూలై1న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నా కార్యక్రమం విజయవంతానికి ఈసమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలు ఇండ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న నివాసాలకు కనీస వసతులైన ఇంటి నెంబర్లు, విద్యుత్ కనక్షన్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం పేదల ఇండ్లను కూల్చే దుర్మార్గపు చర్యలను తక్షణమే మానుకోవాలని, వారికి పూర్తి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బాధితుల హక్కుల సాధన కోసం జూలై 1న జరగబోయే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయడానికి ఉమ్మడిగా కదలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గోనె నాగేశ్వరరావు, మాస్‌లైన్ నాయకులు పి సతీష్ మాట్లాడారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, మేయర్ మూడ్ గణేష్, సిపిఎం రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, జిల్లా నాయకులు, సిపిఐ, న్యూడెమోక్రసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే

**సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్**



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** సమాజంలో నిరంతరం ప్రజల కోసం వారి సంక్షేమం కోసం నిలబడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, గుంటూర్‌పల్లిలో సిపిఐ గ్రామ శాఖ ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను పంజాల శ్రీనివాస్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం, వర్గరహిత సమాజం కోసం కార్మిక వర్గ ప్రయోజనాలే ముఖ్యమని సిపిఐ వందేళ్లుగా ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. అనేక పార్టీలు పుట్టుకొచ్చి కాలగర్భంలో కలిసిపోయాయని కానీ నేటికీ సజీవంగా ఉన్న పార్టీ సిపిఐ పార్టీ అని అన్నారు. సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ కమ్యూనిస్టులు ఉండి వాటి పరిష్కారం కోసం పోరాడుతారని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పులు పెరిగాయని ప్రజలపై పన్నుల భారం విపరీతంగా పడుతుందని కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల బతుకులు మారుతయాని అనుకుంటే గత పాలకుల మాదిరిగా వ్యవహరిస్తున్నారని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పేదల సంక్షేమం కోసం పని చేయకపోతే రానున్న రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఐ పోరాటాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు నలువాల సదానందం, సిపిఐ గుంటూరుపల్లి శాఖ కార్యదర్శి సాయివేణి రాయమల్లు, సీనియర్ నాయకులు సామల్ల కొమురయ్య, చిందం మల్లయ్య, నాయకులు తంగెళ్ల లక్ష్మయ్య, పిల్లి రమేశ తాత సమ్మయ్య, తంగెళ్ల సంపత్, సదయ్య, గొడుగు సంపత్, సాయవేణి రాజు తదితరులు పాల్గొన్నారు.

# 'అమరగిరి'పై సవతి తల్లి ప్రేమెందుకు?

**ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి ఫయాజ్**



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** అమరగిరి గ్రామంపై సమితి తల్లి ప్రేమ ఎందుకని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం అభివృద్ధికి నోచుకోని అమరగిరి గ్రామానికి తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ముందుగా ఎన్‌టిఆర్ చౌరస్తాలో రాస్తారోకో అనంతరం ప్రదర్శనగా వెళ్లి ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక ఆర్డిఓకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన ఆందోళన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ ప్రసంగిస్తూ 2025 ఫిబ్రవరి 8వ తేదీన పంచాయితీరాజు ఎంఆర్ఆర్ నిధుల నుండి కొల్లాపూర్ పట్టణం నుండి అమరగిరి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అక్షరాల మూడు కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందని స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు తదితర ప్రజాప్రతినిధులు అధికారులు కలసి శిలాఫలకానీ ఏర్పాటు చేసి శంకుస్థాపన చేశారని ఆయన గుర్తు చేశారు. సంవత్సరాల క్రితం అరకొరగా వేసిన రోడ్లన్ని పాడైపోయి అనేక వాహన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఆర్‌టిసి బస్సులు నడపక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పచ్చటి నల్లమల్ల అడవి వేల సంవత్సరాలుగా సజీవంగా పారుతున్న కృష్ణానది ఒడ్డున వెలసిన అమరగిరి గ్రామం ప్రకృతి అందాలకు అడవి సోయగాలకు పుట్టినిల్లు కాస్త అంతా ప్రభుత్వం యంత్రాంగం చిత్తశుద్ధి చూస్తే రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా పర్యాటక కేంద్రంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారు లు స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చెరువు తీసుకొని రోడ్డు పనులు ప్రారంభమై పూర్తి ఎలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సింగోటం మాజీ సర్పంచు ఆర్.ఇందిరా, సిపిఐ కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



## ఏడు సన్న వరి రకాలకు ప్రోత్సాహం

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : రైతులందరూ సన్న రకాల విత్తనాలను సాగు చేసి ప్రభుత్వ ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి అన్నారు. శనివారం మండలంలోని కేసారం రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ వానాకాలం 2026 సీజన్‌లో వ్యవసాయ శాఖ ఏడు రకాల సన్న వరి రకాలను ప్రోత్సహిస్తోందన్నారు. ఆ రకాలను సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రత్యేక బోనస్ అందజేస్తుందని తెలిపారు. రైతుల సౌకర్యార్థం మండలంలోని రైతు వేదికల్లో విత్తనాల పంపిణీ ఈనెల 30 వరకు కొనసాగుతుందన్నారు. అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా ఎరువుల పంపిణీ పూర్తిగా పారదర్శకంగా జరిగేలా రైతులు ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియాను తీసుకోవాలని సూచించారు. అందరూ ఒకేసారి దుకాణాలకు రాకుండా క్రమపద్ధతిలో ఎరువులు పొందాలన్నారు. తద్వారా రద్దీ తగ్గడంతోపాటు ప్రభుత్వ సబ్సిడీ యూరియా పక్కదారి పట్టకుండా నియంత్రించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## 'విబి-జి-రామ్‌జి' చట్టాన్ని రద్దు చేయాలి



**ప్రజాపక్షం/దేవరకొండ/చందంపేట** : విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేసి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా ఉపాధ్యక్షులు మొగిల్ల వెంగళయ్య డిమాండ్ చేశారు. శనివారం దేవరకొండ నియోజకవర్గ సమావేశం సిపిఐ కార్యాలయం పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంగళయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంతో పాటు అటవీ హక్కుల చట్టం అమలు చేయాలని అన్నారు. జులై01న జాతీయ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయాలని గ్రామ గ్రామాన నిరసన తెలిపాలని పిలుపునిచ్చారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు హుస్సేన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బుచ్చయ్య, దేవరకొండ మండల అధ్యక్షులు పుల్లయ్య, చందంపేట మండల కార్యదర్శి శంకర్, భారీములు, వెంకటయ్య, మహేష్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభం ఢీకొట్టి ఇద్దరు యువకులు దుర్మరణం



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ మున్సిపల్ పరిధిలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై శ్రీరంగాపురం వద్ద మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ఇద్దరు యువకులు దుర్మరణం పాలైన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు వెల్లడించిన ప్రకారం బిహర్ రాష్ట్రానికి చెందిన రాజేష్, శివాజీ అనే యువకులు గత రెండు సంవత్సరాలుగా కోదాడలోని ఓ రైస్ మిల్లులో హమాలీలుగా పనిచేస్తున్నారు. అయితే శనివారం రాత్రి తెల్లవారుజామున మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై డ్రైవింగ్ చేస్తూ జాతీయ రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంబాన్ని ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన సంభవించినట్లు పోలీసులు నిర్ధారించారు. పట్టణ సిఐ శివశంకర్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## భువనగిరి రిస్క్ సినీనటుడు సందీప్ సందడి



**ప్రజాపక్షం/భువనగిరి** : భువనగిరి వసుంధర సినిమా థియేటర్లో రిస్క్ సినిమా హీరో సందీప్, డైరెక్టర్, ప్రొడ్యూసర్ రావి సురేష్ రెడ్డితో కలిసి సందడి చేశారు. రిస్క్ సినిమా హీరోకి వసుంధర థియేటర్లో ప్రేక్షకులు ఘన స్వాగతం పలికారు. ప్రేక్షకులతో కలిసి కొద్దిసేపు సినిమాని చూసి అనంతరం మీడియాతో మాట్లాడుతూ రిస్క్ సినిమాలో నన్ను హీరోగా తీసుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఆంధ్ర, తెలంగాణలో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందని తెలిపారు. ఇలాంటి సినిమా తీయాలంటే ప్రొడ్యూసర్ రావి సురేష్ రెడ్డితోనే సాధ్యం అన్నారు. వివిధ థియేటర్లలో తిరుగుతూ ప్రేక్షకులతో కలిసి సక్సెస్‌ఫుల్ సందడి చేస్తున్నామని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రజలందరూ కూడా ఈ సినిమాను చూడాలని ఆయన కోరారు. బోనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఫోన్ చేసి రిస్క్ సినిమా పోస్టర్ ఆవిష్కరణ చేయాలని అడగగానే ఆయన కాదనకుండా చేద్దాం అని తెలిపారు. ఎమ్మెల్యే కూడా మాకు చాలా సహకరించారని మీడియాతో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ తంగడపల్లి శ్రీవాణి మాట్లాడుతూ రిస్క్ సినిమాలో హీరో మన తెలంగాణ బిడ్డవడం గర్వకారణమని, ప్రొడ్యూసర్ మా భువనగిరి మండల బొల్లపల్లి సాయుధ పోరాటయోధుడైన రావి నారాయణరెడ్డి ఫ్యామిలీ నుంచి రావి సురేష్ రెడ్డి ఈ సినిమా తీయడం సంతోషంగా ఉందని మ్యూజిక్ డైరెక్టర్ కూడా మన తెలంగాణ బిడ్డ కావడం చాలా చాలా గర్వంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిక్కుల వెంకటేష్ పాల్గొన్నారు.

## మూడేళ్ల శిక్షణకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ఈవిద్యా సంవత్సరంలో న్యాయవాద వృత్తిలో 3 సంవత్సరాల శిక్షణ కోసం నల్లగొండ జిల్లాలోని ఎస్‌సికులానికి చెందిన న్యాయ పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. న్యాయ శాస్త్రంలో డిగ్రీ ఉత్తీర్ణులై, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించని ఎస్‌సి అభ్యర్థులు అర్హులు.3 ఏళ్ల శిక్షణ కాలంలో నెలకు రూ.3వేల చొప్పున స్టైఫండ్, పుస్తకాల కొనుగోలు కోసం ఒకసారి మాత్రమే రూ.50వేలు చెల్లించబడతాయి.అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా జూలై 316 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

# 'నేడు' నల్లగొండకు సిఎం రాక

భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం

కనగల్‌లో రూ.13,006 కోట్ల హ్యాం రోడ్లకు శంకుస్థాపన-తాగునీటి ప్రాజెక్టు ప్రారంభం

ఎన్‌జి కళాశాల మైదానంలో బహిరంగ సభ-ఏర్పాట్లను సమీక్షించిన జిల్లా కలెక్టర్, ఎస్‌పి



**ప్రజాపక్షం/నల్లగొండ** : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదివారం నల్లగొండ జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్,జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ శనివారం కనగల్,నల్లగొండలోని కార్యక్రమ ప్రాంగణాలను సందర్శించి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి ముందుగా కనగల్‌లో రూ.13,006 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించనున్న హామ్ విధాన రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.ఈ ప్రాజెక్టు రాష్ట్ర రహదారి వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు రవాణా రంగ అభివృద్ధికి దోహదపడనుంది. అనంతరం ముఖ్యమంత్రి నల్లగొండకు చేరుకుని నాగార్జున ప్రభుత్వ కళాశాల (ఎన్‌జి) మైదానంలో 50వేల మందితో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొననున్నారు.ఈ సందర్భంగా నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేపట్టనున్న తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు.ఈ ప్రాజెక్టు అమలుతో పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందే అవకాశం ఏర్పడనుంది.బహిరంగ సభ విజయవంతం కోసం వేదిక నిర్మాణం,శిలా ఫలకాల ఏర్పాటు,ప్రజల కోసం సీటింగ్ ఏర్పాట్లు,బ్యారికేడ్లు,వీఐపీలు,మహిళలు,సాధారణ ప్రజల కోసం ప్రత్యేక గ్యాలరీలను కలెక్టర్ పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, మరుగుదొడ్లు,ఎండ నుంచి రక్షణ కోసం టెంట్లు, వర్షం కురిసినా ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లాకు కీలకమైన రహదారుల అభివృద్ధి పనులు,తాగునీటి ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టబడుతుండటంతో ప్రజల్లో ఆసక్తి నెలకొంది.ఈ కార్యక్రమాలు జిల్లాలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని అధికారులు, ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

**సిఎం పర్యటన నల్లగొండలో ట్రాఫిక్ ఆంక్షలు**

ప్రత్యామ్నాయ మార్గాలు,పార్కింగ్ ఏర్పాట్లు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో ఆదివారం నల్లగొండ పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఎన్‌జి కళాశాల మైదానంలో జరిగే సభకు వచ్చే ప్రజల సౌకర్యం,భద్రత కోసం ఈ ఆంక్షలు విధిస్తున్నామన్నారు.

మిర్యాలగూడ,తిప్పర్తి వైపు నుంచి దుప్పలపల్లి,పానగల్ మీదుగా వచ్చే వాహనాలకు కళాభారతి,మేకల అభినయ్ స్టేడియం,ఆర్య సమాజ్,రైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్.



సాగర్,దేవరకొండ,కనగల్ వైపు నుంచిమునుగోడు బైపాస్ మీదుగా వచ్చి రాఖిల్స్ కాలనీ,విటి కాలనీ,ఎల్‌వి పెట్రోల్ బంక్,ఆర్‌ఆర్‌ఆర్, రాఘవేంద్ర కాలనీ,రవీందర్ నగర్‌లో పార్కింగ్. ద్విచక్ర వాహనాలు పోలీస్ పరేడ్ గ్రౌండ్,బీట్ మార్కెట్ వద్ద పార్కింగ్.

**ఆంక్షలు ఉన్న ప్రాంతాలు :** డీటీసీ,మహిళా ప్రాంగణం, డీఈఓ కార్యాలయం,క్లాక్ టవర్ నుంచి ఎన్‌జి కళాశాల వరకు సాధారణ వాహనాలకు అనుమతి లేదు.పానగల్ వాసులు రామాలయంబస్టాండ్ మార్గం,హైదరాబాద్ రోడ్డు వాసులు వివేకానంద విగ్రహం నుంచి ప్రత్యామ్నాయ మార్గాలు వాడుకోవాలి. వివేకానంద విగ్రహం నుంచి ఏజీ కళాశాల వరకు పూర్తిగా నిషేధం.

## ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుడికి అందాలి

రాష్ట్ర అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సెక్రటరీ, మార్కెటింగ్ డైరెక్టర్ కె. సురేంద్ర మోహన్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** :ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సెక్రటరీ, మార్కెటింగ్ డైరెక్టర్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సూర్యాపేట జిల్లా ప్రత్యేక అధికారి కె. సురేంద్ర మోహన్ అన్నారు. శనివారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి సమీక్షించారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో లబ్ధిదారునికి అందుతున్నది లేనిది తెలుసుకోవడంతోపాటు, వివిధ పథకాల అమలులో ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలను తెలుసుకునేందుకు 99 రోజుల పాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు. ఎక్కడైతే ప్రజలకు విద్య, వైద్యం సక్రమంగా అందుతుందో అక్కడ పేదరికం ఉండదన్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమ పద్ధతిలో విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆయన జిల్లా కలెక్టర్‌తోపాటు, అధికారులందరిని అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలని, ఎట్టి పరిస్థితులలో లబ్ధిదారున్ని మర్చిపోకూడదని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విద్య, వైద్యం, ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాలు అమలులో జిల్లాలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను అభినందిస్తూ ప్రపంచంలో ఎక్కడ చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రణాళిక అనే గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. నిధులు లేకున్నప్పటికి జిల్లాలో సమర్థవంతమైన కార్యక్రమాలను నిర్వహించారని అభినందించారు. అధికారులు ఆర్థిక విషయాల పట్ల పూర్తి అప్రమత్తంగా ఉంటూ పథకాలను అమలు చేయాలని, ప్రభుత్వం ఏ ఉద్దేశంతో అయితే ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందో ఈ కార్యక్రమం సూర్యాపేట జిల్లాలో వందకు వంద శాతం విజయవంతం అవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన సమాచారం, యూరియా యాప్, సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్ 18001237157 ద్వారా తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా సంక్షేమ హాస్టల్స్‌లో సంక్షేమ అధికారులు వారానికి ఒకసారి సందర్శించి బడ్జెట్ మీద ఆధారపడకుండా మానవతా దృక్పథంతో ఫ్యాన్లు రిపేర్ చేయించడం, చెప్పులు లేని విద్యార్థులకు చెప్పులు కొనివ్వాలని సంక్షేమ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి కె. నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జడ్‌పి సిఈఓ శిరీష, డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, డిఆర్‌డిఏ సన్యాసయ్య, డిఇఓ అశోక్, సిపిఓ కిషన్ నాయక్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ఇళ్ల పట్టాలు,ఇందిరమ్మ ఇళ్ల హామీలను వెంటనే అమలు చేయాలి

పేదలకు ఇళ్ల పట్టాల కోసం జూలై 1న ధర్నా : వీరస్వామి పిలుపు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించాలన్న ప్రభుత్వ హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో జూలై 1న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.శనివారం నల్లగొండలోని మాగ్దూమ్ భవనంలో పార్టీ టౌన్ కమిటీ సమావేశం కోమటిరెడ్డి ప్రద్యుమ్నామారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వీరస్వామి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో గత ఐదేళ్లుగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలు ఇళ్ల కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పారదర్శకత పాటించాలని,2002,2005 సంవత్సరాల ఓటరు జాబితాలను బీఎల్‌ఓలకు అందుబాటులో ఉంచి అర్హుల పేర్లు తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే ఆసరా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులందరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని,పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డి, సహాయ కార్యదర్శి వి లెనిన్,నాయకులు ఎం నందం, సద్దాం సీతారాములు,దోటి అక్కలయ్య,వల్కి వెంకటేష్, యూసుఫ్, వీరయ్య,నర్సింహా, అంజయ్య ఉన్నారు.

## 'నేడు' నుండి పల్స్‌పోలియో

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : జిల్లా వ్యాప్తంగా జూన్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు వయస్సు గల 95,281 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నారని పేర్కొన్నారు. వీరిలో 809 మంది సంచార జాతులు, వలసదారుల పిల్లలు కూడా ఉన్నట్లు వివరించారు. జూన్ 28న జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 575 పల్స్ పోలియో బూత్‌లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయనుండగా, జూన్ 29, 30 తేదీల్లో బూత్‌లకు రాని చిన్నారులను గుర్తించి ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లాలో 11 ట్రాన్సిట్ పాయింట్లు, 103 హైరిస్క్ ప్రాంతాలు ఏర్పాటు చేశామన్నారు. 2,300 మంది ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వాలెంటీర్లు, 57 మంది సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో 27 మొబైల్ బృందాలు సేవలందించనున్నట్లు తెలిపారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** స్థానిక లక్కారం ఎస్‌ఎంఆర్ కన్వెన్షన్ హాల్ లో సిపిఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్‌రెడ్డి కుమారుడు సుమంత్ రెడ్డి, దివ్య రెడ్డిల వివాహ వేడుకకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంలు ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆనందమయం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో కొనసాగాలని ఆశీర్వదించారు. పరస్పర అవగాహన, ప్రేమ, గౌరవంతో జీవితం ముందుకు సాగాలని నూతన దంపతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, ముత్యాల యాదిరెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా సీపీఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు సంజీవ, మల్లారెడ్డి పాల్గొన్నారు.

### నల్లగొండ జిల్లాలో హత్యల పరంపర...

# ప్రజల్లో పెరుగుతున్న భయం

పక్కా ప్రణాళికతో జరిగిన హత్యలకు పోలీస్ నిఘా లోపమా..?

మిర్యాలగూడలో ముగ్గురు...నల్లగొండలో యువకుడు..మరో నలుగురు హత్య





**ప్రజాపక్షం/నల్లగొండ** : నల్లగొండ జిల్లాలో వరుసగా వెలుగుచూస్తున్న హత్యలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.ఇటీవల మిర్యాలగూడలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి హత్య కేసు,నల్లగొండ పట్టణంలో యువకుడు హత్య ఈ ఘటనల నుంచి ప్రజలు ఇంకా కోలుకోక ముందే మరవక ముందే ఒకే ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యుల దారుణ హత్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. మిర్యాలగూడ ఘటనలో తొలుత అగ్నిప్రమాదంగా కనిపించిన సంఘటన వెనుక పక్కా హత్యా కుట్ర బయటపడగా,నల్లగొండలో జరిగిన నాలుగు హత్యల వెనుక డబ్బు,బంగారం,వ్యక్తిగత కక్షలు,కుటుంబ విభేదాలు ప్రధాన కారణాలుగా పోలీసులు నిర్ధారించారు. నిందితులు ముందుగానే ప్రణాళిక రచించి,ఆధారాలు మాయం చేసేందుకు ప్రయత్నించిన తీరు సమాజాన్ని కలవరపరిచింది.నల్లగొండ పట్టణంలో మరో దారుణ హత్య చోటుచేసుకుంది.గొల్లగూడ పరిధిలోని పెద్దబండ, సత్యనారాయణ కాలనీకి చెందిన బోత్ సాయి అనే యువకుడు హ్యాపీ హోమ్స్ ఎదురుగా ఉన్న వెంచర్ ప్రాంతంలో హత్యకు గురయ్యాడు.బండరాళ్లతో తలపై దాడి చేసి అత్యంత దారుణంగా హత్య చేశారు.నల్లగొండ నాలుగు హత్యల కేసు దర్యాప్తులో బయటపడిన అంశాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి.ఆర్థిక ఇబ్బందులు, అప్పులు, కుటుంబ వివాదాలు,పాత కక్షలు కలిసి ఒక వ్యక్తిని నలుగురి ప్రాణాలు తీసే స్థాయికి నెట్టాయి. హత్యకు ముందు పోలీసులకు చిక్కకుండా ఉండే మార్గాల గురించి ఇంటర్నెట్‌లో వెతకడం,శవాలు ఎన్ని రోజులకు కుళ్లిపోతాయనే సమాచారం సేకరించడం,ముందుగానే ఆయుధం సిద్ధం చేసుకోవడం వంటి విషయాలు ఈ నేరం ఎంత ప్రణాళికాబద్ధంగా జరిగిందో తెలియజేశాయి. అయితే వరుసగా వెలుగుచూస్తున్న ఈ హత్యలు ఒక కీలక ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. సమాజంలో పెరుగుతున్న వ్యక్తిగత కక్షలు, ఆర్థిక ఒత్తిళ్లు, కు టుంబ విభేదాలు నేరాలకు దారితీస్తున్నాయా?లేక నేరాల నివారణలో సామాజిక, పరిపాలనా వ్యవస్థలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందా?మరోవైపు, మిర్యాలగూడ,నల్లగొండ కేసులను పోలీసులు వేగంగా ఛేదించిన తీరు ప్రశంసనీయమే. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ విశ్లేషణ,ప్రత్యేక బృందాల సమన్వయంతో నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. దీంతో నేరస్తులు ఎంత ప్రణాళికాబద్ధంగా వ్యవహరించినా ఆధునిక దర్యాప్తు పద్ధతుల నుంచి తప్పించుకోవడం కష్టమనే సందేశం వెళ్లింది.అయితే ప్రజల్లో నెలకొన్న భయం మాత్రం తగ్గడం లేదు.మిర్యాలగూడలో ముగ్గురు, నల్లగొండలోయువకుడి, మరో నలుగురు,హత్య కేవలం కొద్ది రోజుల వ్యవధిలో జరిగిన ఈ ఘటనలు సమాజంలో పెరుగుతున్న హింసాత్మక ధోరణులకు అద్దం పడుతున్నా యి. హత్యలకు కారణాలు ఏవైనా కావచ్చు.కానీ కోపం, కక్ష,డబ్బు,ఆస్తి,వ్యక్తిగత విభేదాలు ప్రాణాల కంటే విలువైనవిగా మారుతున్న పరిస్థితి సమాజానికి ప్రమాదకర సంకేతాలను పంపుతోంది. నేరం జరిగిన తర్వాత నిం దితులను పట్టుకోవడం ఎంత ముఖ్యమో,అలాంటి నేరాలు జరగకుండా ముందుగానే నివారించే సామాజిక అవగాహన, కుటుంబ బంధాల బలోపేతం,మానసిక ఆరోగ్యంపై దృష్టి, పోలీసు ప్రజల సమన్వయం కూడా అంతే అవసరం.







## మాదకద్రవ్యాలకు దూరంతోనే భవిష్యత్

న్యాయవిజ్ఞాన సదస్సులో జడ్జిలు కె.సురేష్, భవ్య

**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్యలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోదాడలోని తేజ విద్యాలయం, సన ఇంజనీరింగ్ కళాశాలలో వేరువేరుగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. తమ జీవితాలలో వెలుగులు నింపుకునేందుకు లక్ష్యాలను నిర్దేశించుకుని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులు కలలు సాకారం చేయాలన్నారు. మత్తు పదార్థాలకు లోనై యువత తమ జీవితాలను నాశ నం చేసుకుంటున్న పరిస్థితులను కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాల జోలికి వెళ్లమంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సులో గ్రామీణ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, అసోసియేట్ ఉపాధ్యక్షులు గట్ల నర్సింహారావు, కళాశాల ప్రిన్సిపాల్ గోపిరెడ్డి, న్యాయవాదులు ఎడ్లపల్లి వెంకటేశ్వర్లు, యశ్వంత్ రామారావు, ఉయ్యాల నర్సయ్య, నవీన్, హుస్సేన్, శరత్‌కుమార్, రియాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# అపరిశుభ్రత పరిసరాల్లో మాంసం అమ్మకాలు!

● కంపుకొడుతున్న మటన్, చేపల మార్కెట్ ● రోడ్లపై మాంసం విక్రయాలు ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**ప్రజాపక్షం/ మెదక్ :** మెదక్ జిల్లా కేంద్రంలోని మాటన్ మార్కెట్‌లో పార్శిద్ధ్య పరిస్థితులు అధ్వాన్నంగా మారాయి. మార్కెట్ పరిసరాలు చెత్తాచెదారం, మురుగు నీటితో నిండిపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాలు కురిస్తే పరిస్థితి ఇంకా అధ్వానంగా తయారవుతుంది. ఇలాంటి అపరిశుభ్ర వాతావరణంలోనే మాంసం, చేపల విక్రయాలు జరుగుతుండటంతో ప్రజల ఆరోగ్యం పై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మెదక్ పట్టణంతో పాటు చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు మటన్, చేపలు ఇక్కడి నుంచి కొనుగోలు చేస్తారు. మాంసం, చేపలు విక్రయించే ప్రదేశంలో ఎక్కడ కూడా కనీస పరిశుభ్రతా ప్రమాణాలు పాటించిన దాఖలాలు లేవు, మాంసాన్ని బహిరంగంగా ఉంచడం, మార్కెట్ పరిసరాల్లో చెత్త పేరుకుపోవడం వంటి కారణాలతో అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ లో దుమ్ము, ఈగలు, మురుగు నీరు, దుర్వాసనల మధ్యనే మాంసం, చేపలు విక్రయాలు కొనసాగుతున్నా సంబంధిత అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి మార్కెట్ లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాల్సిన్నప్పటికీ, ఆ దిశగా ఎలాంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఇటువంటి పరిస్థితులపై తక్షణమే స్పందించి, మటన్, చేపల మార్కెట్ లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.మెదక్ జిల్లా కేంద్రంలో రోడ్లపైనే బహిరంగంగా మాంసం విక్రయాలు కొనసాగుతున్నప్పటికి సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పరిశుభ్రత వాతావరణం నాన్ వెజ్ మార్కెట్ లో అమ్మాల్సిన మాంసాన్ని రోడ్ల వెంబడి తోపుడు బండ్లపె పెట్టి సంబంధిత వ్యాపారులు ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. బహిరంగంగా మాంసం అమ్ముతున్న పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. విక్రయ దారులకు ఎవ్వరూ అడ్డుచెప్పకపోవడంతో అదే అదునుగా భావించి యదేచ్ఛగా అమ్మకాలు జరుపుతున్నారు. దుమ్ము దూళి, వాహనాల కాలుష్యం మధ్య విక్రయస్తున్నా మటన్ తో ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతోంది. ఆహార భద్రతా నిబంధనలను పూర్తిగా విస్మరించి కొందరు వ్యాపారులు ఇష్టానుసారంగా మాంసం అమ్మకాలు జరుపుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన ప్రదేశాల్లో, షెట్టర్లు, గ్లాస్ తో తయారు చేసిన అల్మారాలు, చల్లగా ఉంచే సౌకర్యాలతో విక్రయించాల్సి ఉండగా చాలా చోట్ల రోడ్డు పక్కనే మాంసాన్ని వేలాడదీసి అమ్ముతున్నారు. దీంతో దుమ్ము, ఈగలు, ఇతర క్రిములు మాంసంపై చేరి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే ఇటువంటి అక్రమ విక్రయాలపై ఆహార భద్రతా అధికారులు, పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి,



నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రికార్డు అసిస్టెంట్‌ను.. సస్పెండ్ చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నిజామాబాద్:** నిజామాబాద్ నార్త్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జె.రాహుల్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్లువు జారీ చేశారు. రెవెన్యూ రికార్డుల (పహాణీల)లో అక్రమ మార్పులు చేయటం, రికార్డుల తారుమారు, విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కఠిన చర్యలకు ఉపక్రమించారు. సదరు ఉద్యోగిని సస్పెండ్ చేయటంతో పాటు శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. నార్త్ మండలం పరిధిలోని కంఠేశ్వర్ ప్రాంతంలో సర్వే నెంబర్ 291/ఎ, 291ఎఎ, 292లకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో టాంపరింగ్ జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పందిస్తూ, ప్రాథమిక విచారణ జరిపించారు. రెవెన్యూ రికార్డుల టాంపరింగ్ వాస్తవమేనని విచారణలో వెల్లడైంది. దీంతో విచారణ నివేదిక ఆధారంగా, రెవెన్యూ రికార్డులలో అక్రమ మార్పులు చేయటం, రికార్డుల తారుమారు, విధినిర్వహణలో అతవకతవలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రికార్డు అసిస్టెంట్ జె.రాహుల్‌ను సస్పెండ్ చేయటంతో పాటు శాఖాపరంగా సమగ్ర విచారణ చేపట్టాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన విచారణసమగ్ర నివేదికను అనుసరిస్తూ తదుపరి చర్యలు ఉంటాయని కలెక్టర్ వెల్లడించారు. రెవెన్యూ రికార్డులను తారుమారు చేయటం, విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

## నేటి పల్స్ పోలియో

వైద్యాధికారి డాక్టర్ మేజర్ మురళీ కృష్ణ



**ప్రజాపక్షం/జైనూర్ :** జూన్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పా టు పల్స్ పోలియో టీకాకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జైనూర్ వై ద్యాధికారి డాక్టర్ మేజర్ మురళీ కృష్ణ తెలిపారు.భాగంగా తొలి రోజు మండలంలోని అన్ని పోలియో బూత్‌లలో 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. జూన్ 29, 30 తేదీల్లో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఇతర ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. అర్హత కలిగిన ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే పలు మార్లు పోలియో చుక్కలు వేసుకున్నా లేదా సాధారణ టీకాలు పూర్తయినా కూడా 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.పోలియో రహిత భారతదేశం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## పోడు భూసమస్య పరిష్కరించాలి

**ప్రజాపక్షం/కేరమేరి :** కేరమేరి మండలం సూర్దాపూర్ గ్రామంలో గత కొన్ని రోజులుగా నడుస్తున్న పోడు భూమి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు ఆసిఫాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండి మునీర్ హైమద్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన శాసనసభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి సమస్య తీవ్రతను వివరించారు. ఈ సందర్భంగా ఎండి మునీర్ హైమద్ మాట్లాడుతూ పోడు భూమి సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యేంతవరకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఇప్పటికే జిల్లా పాలనాధికారికి కూడా విన్నవించామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆత్రం కుసుమరావు, రైతులు నందన్, కలిమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## 24 శాతం హెచ్‌ఆర్‌ఎ వర్తింపు



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం భవిష్యత్తులో హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలోని ఫెరిఫెరల్ జోన్‌లో చేరే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ మండల ఉపాధ్యాయులకు ఇరవై నాలుగు శాతం హెచ్ఆర్ఏ వర్తింపజేసే అవకాశాలను పరిశీలించి అనుమతించాలని కోరుతూ పిఆర్టియూ టిఎస్ మెదక్ జిల్లా శాఖ అధ్యక్షుడు మేడి సతీష్ రావు, ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు శాఖ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా జిల్లాలో జనగణన (సెన్సస్) విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రెమ్యునరేషన్ బకాయిలపై కలెక్టర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, త్వరలోనే సంబంధిత ఉపాధ్యాయుల ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సబ్బని శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వీరేశం, ప్రమోద్, మనోహరాబాద్ మండల నాయకులు నాగరాజు గౌడ్, నాగిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు భూపాల్‌రావు, నాగేశ్వరరావు, విట్టల్, కాళ్లకల్ పాఠశాల హెచ్ఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. శనివారం మోర్తాడ్ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పది మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. రూ. 3,14,500 చెక్కులను సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ లకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల లబ్ధిదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు బక్కూరి ఆనంద్, మోర్తాడ్ ఇన్‌ఛార్జి ముత్యాల రాములు, మోర్తాడ్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బూత్‌పురం మహిపాల్, ఉపాధ్యక్షుడు కొమిరె శ్రీధర్, వివిధ భాగాల మండల అధ్యక్షులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగభూషణం, అంజాద్, ఎఎంసి డైరెక్టర్ నవీద్, ప్రదీప్, గురవయ్య, హర్షద్, మన్న జమాల్, కొట్టూర్ గంగాధర్, లింగన్న, షఫీ, ఆల్మస్ పాల్గొన్నారు.

## 12 ఎరువుల దుకాణాల లైసెన్సులు సస్పెండ్

మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ మండలంలోని పలు ఎరువుల దుకాణాలను శనివారం మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన 12 మంది డీలర్ల లైసెన్సులను సస్పెండ్ చేశారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. లైసెన్స్ ఉన్నప్పటికీ వ్యాపారం నిర్వహించని డీలర్ల నుంచి లైసెన్సులను సరెండర్ చేయించామని పేర్కొన్నారు. స్టాక్ రికార్డులు అప్డేట్ చేయకపోవడం, విత్తనాల నిల్వలను ఫామ్ డిలో నమోదు చేయకపోవడం వంటి ఉల్లంఘనలను గుర్తించి ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించినా, వ్యవసాయ శాఖ నిబంధనలను ఉల్లంఘించినా లైసెన్సులను రద్దు చేస్తామని డీలర్లను హెచ్చరించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ విస్తరణ అధికారి రెహ్మాన్, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఫహీం ఖురేషీలకు ఘన స్వాగతం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రానికి చేరుకున్న ప్రభుత్వ రంగ సంస్థల తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ అలీ షబ్బీర్, టీ.ఎం.ఆర్.ఈ.ఐ.ఎస్. వైస్ చైర్మెన్ ఫహీం ఖురేషీలకు శనివారం ఘన స్వాగతం లభించింది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని గంజాల్ టోల్ ప్లాజావద్ద నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మెన్ అప్పాల గణేష్ చక్రవర్తి, నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అర్జుమంద్ అలీలు వారికి పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించి ఘనంగా స్వగతం పలికారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వేగవంతంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాకు మంజూరైన 8,953 ఇళ్లలో 7,271 ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తైందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రతిరోజు పర్యటిస్తూ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఇంకా ప్రారంభం కాని ఇళ్లను వెంటనే ప్రారంభించి జూలై 15 లోగా పూర్తి చేయాలని సూచించారు. ఇసుక, గ్రావెల్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండో



విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెల్లో నివసించే వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రత్యేక అధికారులు గుడిసెల్లో నివసించే కుటుంబాలను గుర్తించి త్వరితగతిన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడి మాణిక్యం, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్‌డిఏపి డి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్లు, డిఈలు, ఏఈలు, అధికారులు, పాల్గొన్నారు.

## పోలియో చుక్కల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ ప్రతీక్ జైన్

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ఈ నెల 28వ తేది నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. జిల్లాలో 05 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఏ ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకుండా పోలియో బూత్‌లో , మొబైల్ బృందాలు ఇంటింటి సర్వే బృందాల ద్వారా ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 28న జిలా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 1,137 పోలియో బూత్‌లో ఉదయం 7.00 గంటల నుంచి సాయత్రం 6.00 గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అనంతరం జూన్ 29,30 తేదీల్లో ఇంటింటికి వెళ్లి తొలి రోజు మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని 1,80405 మంది 05 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పోలయో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1,583 మంది ఏఎన్ఎంలు 904 మంది ఆశాకార్యకర్తలు ,1,500 మంది అంగన్‌వాడి కార్యకర్తలు 625 మంది ఇతర వాలంటీర్లు ,6 మందిప్రోగ్రామ్ అధికారులు పాల్గొంటున్నట్లు వివరించారు. వలస కార్మికుల పిల్లలు ,ఇటుక బట్టీలు ,నిర్మాణ ప్రాంతాలు పట్టణ బస్తీలు కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లో నివసించే చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి కూడా తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకుంటు న్నామని కలెక్టర్ తెలిపారు. జూన్ 28న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో 05 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పని సరదిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. గతంలో పోలియో చుక్కలు వేయించినప్పటికి మరోసారి వేయించడం ద్వారా చిన్నారులకు పూర్తి రక్షణ లభిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని కోరారు.



## పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ

**ప్రజా పక్షం/శ్రీరాంపూర్ :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్ కార్పొరేటర్ బండారి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు పాల్గొన్నారు. శనివారం డివిజన్‌లోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి, రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితాలను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు కావడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను సరిచేయడం వంటి అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల నరేష్, టీపీసీసీ కమిటీ సభ్యుడు నూకల రమేష్, బూత్ స్థాయి అధికారులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.



## రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తులు

జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు ధరకాస్తుల స్వీకరణ కొనసాగుతొందని జిల్లా వ్యవసాయ అదికారి శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2026 జూన్ 15 వరకు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించదన్నారు. అర్హత ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని .జూలై 5,2026 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు తమకు సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఎ.ఇ.ఒ), మండల వ్యవసాయాధికారి (ఎం.ఎ.ఒ) కార్యాలయంల్లో దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు.

### దరఖాస్తుతో పాటు..

పట్టాదారు పాస్‌బుక్ ,ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్ ,మొదటి పేజీ జిరాక్స్ కాపీలను ,రైతు భరోసా దరఖాస్తు ఫారం ను సమర్పించాలని తెలిపారు. రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అదికారులు ,రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించి అర్హులైన రైతులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని ఆయన కోరారు.

## డాకూరులో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** అందోల్ మండలం డాకూర్ గ్రామంలో శనివారం రోజు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ ఘనంగా నిర్వహించబడింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయిల్ పామ్ విస్తరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయిల్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించేందుకు ఈ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపట్టబడింది. ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించి అధిక విస్తర్ణంలో మొక్కల నాటకాన్ని పోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం ఈ సందర్భంగా డాకూరు గ్రామానికి చెందిన రైతు శ్రీ దాకూరి వెంకటేష్ పొలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటడం జరిగింది. 202627 సంవత్సరానికి సంగారెడ్డి జిల్లాలో 3.000 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించగా ఆ లక్ష్య సాదన దిశగా జిల్లాలోని వివిధ మండలాల్లో రైతులు ఆయిల్ పామ్ మొక్కల నాటకం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఆయిల్ పామ్ పంటను కొనుగోలు చేసి సౌకర్యం ఉన్నందున్న రైతులు ఈ పంట సాగు వైపు మరింత ముందుకు రావాలని కోరారు. ఆయిల్ పామ్ రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అం దించే లాభదాయకమైన పంట అని పేర్కొన్నారు.జిల్లా ఉద్యాన అధికారి పి.సోమేశ్వరరావు, ఉద్యాన అదికారి టి. సమత , హెచ్‌ఈఓ సంగయ్య, స్వామీ, గోద్రేజ్ ఆగ్రోవేట్ సంస్థ ఏరియా మేనేజర్ ఈశ్వర్ రెడ్డి ఇతర కంపెనీ ప్రతినిధులు శివరామ్ ,హర్ష అదేవిధంగా అందోల్ మండలానికి చెందిన రైతులు కిరణ్ ,వెంకటేశ్వర్ పాల్గొన్నారు.



## పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్‌పి శ్రీనివాస రావు

**ప్రజాపక్షం/పాపన్నపేట:** పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని.,కేసుల దర్యాప్తులో నాణ్యతకు పెద్దపీట వేస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా శనివారం పాపన్నపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి స్టేషన్ నిర్వహణను సమగ్రంగా తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, రికార్డుల నిర్వహణ, స్వాధీన వాహనాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేసి, బస్వరాజ్ కు రివర్డ్ మంజూరు చేశారు, శాఖ అందించిన సామగ్రిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి పోలీసు సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించి అన్ని రకాల విధుల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని, ప్రస్తుతం నేర్చుకుంటున్న అంశాలు సేవా కాలమంతా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.స్టేషన్ రికార్డులను పరిశీలిస్తూ ప్రతి కేసులో శాస్త్రీయ, నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. మిస్సింగ్, దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రత్యేక కార్యాచరణతో త్వరగా పరిష్కరించాలని, ఆస్తి సంబంధిత నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని, విలేజ్ పోలీస్ అధికారులు తమ గ్రామాలపై పూర్తి అవగాహనతో గ్రామ పెద్దలు, యువతతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 2.0, టీఎస్‌కాప్, హెచ్‌ఆర్ఎంఎస్, ఈసాక్ష్య, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతిక వేదికలను సమర్థంగా వినియోగించాలని, సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, స్టేషన్ రికార్డులను ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు.పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, ఫోర్ వీలర్ నడిపేటప్పుడు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. రాజా శేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, పాల్గొన్నారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో.. రూ.41 లక్షల జరిమానా



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ పోలీస్ కమిసనరేట్ పరిధిలో గడిచిన రెండు వారాలలో జూన్ 15 నుంచి 27 వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 426 నమోదు కాగా ఇందులో 10 మందికి వారం రోజుల పాటు జైలుశిక్ష విధించడం జరిగింది. జరిమానా రూపంలో కమిషనరేట్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల ద్వారా సంబంధిత కోర్టులు రూ. 41 లక్షల 60 వేల విధించడం జరిగిందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విధిగా కింది సూచనలు గమనించాలని ప్రకటనలో కోరారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులు వాహనానికి సంబంధించిన పత్రాలు సక్రమంగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వారి లైసెన్సు ఆరునెలల పాటు సస్పెండ్ చేయబడుతుందన్నారు. మద్యం తాగి వాహనం నడిపి అనుకోని రోడ్డు ప్రమాదం జరిగినట్లయితే ఇన్సురెన్సు లభించదన్నారు. మైనర్లుతాగి వాహనం నడిపి పోలీస్ వారికి దొరికినట్లయితే మైనర్, వెహికల్ ఓనర్ పైన చార్జ్ షీట్ నమోదు చేయబడుతుందన్నారు. అలాగే జైలు శిక్ష విదించే అవకాశముందన్నారు. ఒకసారి కంటే ఎక్కువసార్లు పట్టుబడినట్లయితే జైలు శిక్ష విధించబడుతుందన్నారు. మోటర్ వెహికల్ యాక్టు 1989 (చట్టం సవరణ 2019) అమలులో ఉన్నందున డ్రంక్ అండ్ డ్రైవ్ లో మొదటి సారి పట్టుబడినట్లయితే రూ. 10 వేల జరిమానా లేదా ఆరునెలల జైలుశిక్ష లేదా జరిమానాతోపాటు జైలుశిక్ష విధించబడుతుందన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ లో రెండోసారి పట్టుబడినట్లయితే రూ. 15 వేలు జరిమానా లేదా జైలుశిక్షతో పాటు జరిమానా విధించబడుతుందన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
ఆదివారం
28-06-2026
www.prajapaksham.in

“హీరో నివీన్ పాలీ, డైరెక్టర్ ఆల్ఫోన్స్ పుత్రన్ కాంబోకు పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ ఉంది. వీరు కలిసి చేసిన నేరం, ప్రేమమ్ చిత్రాలు ఘన విజయాలు సాధించాయి. ఇలాంటి క్రేజీ కాంబో 12 ఏళ్ల తర్వాత కలిసి సినిమా చేస్తున్నారు.”

రీల్

## నటుడు, దర్శకుడు భాగ్యరాజ్ ఇక లేరు



ప్రముఖ తమిళ నటుడు, దర్శకుడు, సంగీత దర్శకుడు కె. భాగ్యరాజ్ కన్ను మూశారు. చెన్నైలోని ఆయన నివాసంలో గుండెపోటుతో శనివారం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డెబ్బై మూడేళ్ళ వయసున్న భాగ్యరాజ్ 7 జనవరి, 1953 తమిళనాడులో జన్మించారు. భారతి రాజా, రాధాకృష్ణన్ దగ్గర భాగ్యరాజ్ అసిస్టెంట్ గా పని చేశారు. డెబ్బై అయిదు సినిమాల్లో నటించిన భాగ్యరాజ్ ఇరవై అయిదు సినిమాకు దర్శకుడిగా పని చేశారు. 1979 లో 'సువారిల్లద చిత్తిరంగన్' అనే సినిమాలో దర్శకుడిగా మారారు. నటి ఊర్వశి, ఆమెసోదరి కల్పనలను సినిమా పరిశ్రమకు పరిచయం చేశారు. తమిళంలో వచ్చిన '16 వెయతనిలే' తెలుగులో పదహేరేళ్ళ వయసు సినిమాలో తెరపై అరంగేట్రం చేశారు. ఆయన చేసిన అనేక సినిమాలు తెలుగు, హిందీ భాషల్లో సైతం అనువాదం అయ్యాయి. అమితా బచ్చన్ నటించిన 'ఆఖిరి రాస్తా', అనిల్ కపూర్ నటించిన 'వో సాత్ దిన్' సినిమాలకు భాగ్యరాజ్ కథలను అందించారు. ఈయనను కింగ్ ఆఫ్ స్క్రీన్ ప్లేగా పిలుచుకుంటారు. తెలుగులో అల్లరి నరేష్ నటించిన 'పెళ్లయింది కానీ' సినిమాకు భాగ్యరాజ్ దర్శకత్వం వహించారు. వెంకటేష్ హీరోగా నటించిన 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు', 'అబ్బాయి గారు' సినిమాలకు భాగ్యరాజ్ స్క్రిప్ట్ అందించారు. ఇటీవల తెలుగులో వచ్చిన '36 ఇది చిన్న కథ కాదు' సినిమాలో నటించారు. భాగ్యరాజ్ తెలుగు తమిళ భాషల్లో నటించిన చివరి చిత్రం 'కుబేర'. ఫిలిం ఫెర్ అవార్డులు, తమిళనాడు ప్రభుత్వం నుంచి పలు అవార్డులను అందుకున్నారు. భాగ్యరాజ్ మరణంతో తమిళ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. తమిళ నాడు ముఖ్యమంత్రి విజయ్ కన్నీరు మున్నీరయ్యారు. ప్రఘాడ సంతాపాన్ని ముఖ్యమంత్రి తెలియజేశారు. తెలుగు సినిమా పరిశ్రమ నుంచి భాగ్యరాజ్ కు స్నేహితుడు అయిన నటుడు సుమన్ సంతాపం తెలియజేశారు. తమిళంలో తాను నటించిన చివరి చిత్రం కూడా భాగ్యరాజ్ తీసిన డార్లింగ్. డార్లింగ్ చిత్ర మేనని సుమన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, నటుడు పవన్ కళ్యాణ్ కూడా భాగ్యరాజ్ మృతికి సంతాపం ప్రకటించారు.

## 'జోకర్' షూటింగ్ షురూ

మీరా ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్న ప్రొడక్షన్ నెంబర్ వన్ సినిమా 'జోకర్' సినిమా షూటింగ్ పూజ కార్యక్రమాలతో ప్రాంభమైంది. శనివారం రామానాయుడు స్టూడియోలో జరిగిన ఈ సినిమా ప్రారంభోత్సవంలో ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. హీరో అల్లు అర్జున్ భార్య అల్లు స్నేహ కెమెరా స్విచాన్ చేశారు. బన్నీ వాస్, ఎస్ కె ఏం స్క్రిప్ట్ దర్శక నిర్మాతలకు అందజేశారు. సిద్దవర్ హీరోగా, తన్వి ఆకాంక్ష హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి గీత సి శేఖర్ దర్శకత్వం వహిస్తుండగా, సందీప్ రామినేని చిత్రాన్ని నిర్మిస్తున్నారు. లవ్, ఎంటర్టైన్‌మెంట్, యాక్షన్ ప్రధానంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రెగ్యులర్ షూటింగ్‌లో చిత్ర నిర్మాణా న్ని పూర్తి చేయనున్నారు.



# ఇండస్ట్రీని నాశనం చేస్తున్నది 'ఆ నలుగురు'!

### తెలంగాణ ఫిలిం ఇండస్ట్రీ కోసం ప్రభుత్వం పాలసీ ప్రకటించాలి
### 'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ రామకృష్ణ గౌడ్ సంచలన విషయాలు వెల్లడి



విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావును స్ఫూర్తిగా తీసుకుని రంగుల ప్రపంచంలో అడుగుపెట్టిన కళాకారులు కోకొల్లలు. ఎన్‌టిఆర్‌ను చూసి రాజకీయాల్లోకి వచ్చిన వారు కూడా చాలా మంది ఉన్నారు. ఎన్‌టిఆర్‌ను ఆదర్శంగా తీసుకుని సినిమారంగంలోనూ, రాజకీయ రంగంలోనూ నిలదొక్కుకున్న సిద్దిపేట ముద్దు బిడ్డ ప్రతాని రామకృష్ణ గౌడ్ (ఆర్ కె గౌడ్. తెలంగాణ నుంచి ఫిలిం ఇండస్ట్రీకి వచ్చేదే చాలా తక్కువమంది, వచ్చిన వారిలో నిలదొక్కుకోలేక వెనక్కి తిరిగి వెళ్ళిన వారు కూడా చాలా మంది ఉన్నారు. కానీ రామకృష్ణ గౌడ్ మాత్రం ధైర్యంతో ఇండస్ట్రీలో ఎన్నో ఒడిదుకులు ఎదుర్కొని సినిమా పరిశ్రమలో తనకంటూ ఒక పేజీని క్రియేట్ చేసుకున్నారు. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ని స్థాపించి తెలంగాణ కళాకారులకు అధిక ప్రాధాన్యతనిస్తూ న్యూ టాలెంట్‌ను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. నలభై ఏళ్లుగా తెలుగు చలన చిత్ర రంగంతో అనుబంధం ఏర్పరచుకుని ఇండస్ట్రీలో కొండంత అండగా నిలుస్తున్న డాక్టర్ ప్రతాని రామకృష్ణ గౌడ్‌ను 'ప్రజాపక్షం' పలకరించింది. ఈ ఇంటర్వ్యూలో రామకృష్ణ గౌడ్ చాలా అంశాలను కుండ బద్దలు కొట్టి చెప్పారు. ఆయన ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రస్తావించిన అంశాలు ఇవి.

**ప్రశ్న : సినిమా రంగంపై ఎప్పుడు ఆసక్తి కలిగింది. ఇండస్ట్రీకి ఎలా వచ్చారు ?**

**ఆర్.కె.గౌడ్ :** నా సొంత ఊరు మిట్టపల్లి, సిద్ధిపేట దగ్గర, ఉమ్మడి మెదక్ జిల్లా. నాకు చిన్నప్పటి నుంచే యాక్టింగ్ అంటే ఇష్టం. చిన్నప్పుడు ఎలా హిప్పీ కటింగ్ పెంచుకున్నాను (పక్కన ఉన్న ఒక ఫోటోను చూపించి). నేను మొట్ట మొదటగా సినిమా షూటింగ్‌లో పాల్గొన్నది అన్నగారిఅంటే పెద్ద ఎన్టీఆర్ సినిమాలోనే . సంగారెడ్డిలో 'అగ్గిరవ్వ'' అనే సినిమా షూటింగ్ జరిగింది. ఈ సినిమాలో నేను నటించాను. అన్నగారితో కలసి నటించాను. ఆ తరువాత సినిమా ఇండస్ట్రీకి రావడానికి నాకు స్ఫూర్తి కూడా ఎన్టీఆర్ గారే. హీరోగా కొన్ని సినిమాలు చేశాను. క్యారెక్టర్స్ కూడా వేశాను, నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్ గా ఇలా నలభై ఏళ్ళ నుంచి తెలుగు సినిమా పరిశ్రమలోనే ఉన్నాను. కళామతల్లి సేవ చేయాలన్నదే నా ఆశయం. ఇక రాజకీయాలంటారా దీనికి కూడా పెద్ద ఎన్‌టిఆర్ అన్నగారే కారణం. ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్‌గా, చైర్మన్‌గా కూడా చేశాను. తెలుగుదేశంలో నేను చాలా కీలకమైన రాజకీయాల్లో చురుకుగా అప్ప ట్లో పని చేశాను. ప్రభు గౌడ్ అనే వ్యక్తి ఎన్‌టిఆర్‌కు బాగా దగ్గరగా ఉండేవారు. ఆయనతో నాకు కూడా ఎన్‌టిఆర్‌తో దగ్గరగా ఉండే ఛాన్స్ దొరికింది.

**ప్రశ్న : మీరు ఎన్ని సినిమాల్లో నటించారు ? దర్శకుడిగా కూడా మారారు ? ఇంకేం చేశారు?**

**ఆర్ కె గౌడ్ :** దర్శకుడిగా నా తొలి చిత్రం 'అల్లరి పెళ్ళాం'. ఈ సినిమా ... నటుడు తనికెళ్ళ భరణి ఈ సినిమాలో నటించారు. విలన్‌గా బాగా పాపులర్ అయిన ముక్క నర్సింగ్ కూడా అల్లరి పెళ్ళాం సినిమాలో నటించారు. నేను హీరోగా చేసిన మొదటి చిత్రం 'ఉన్మాది'. ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో కూడా డబ్ చేశాను. నటుడిగా నలభై సినిమాలు చేశాను. రామానాయుడు నిర్మించిన 'తోడి కోడళ్ళు', విజయశంతో 'లేడీ బాస్', ఇలా పెద్ద పెద్ద సినిమాల్లో మంచి మంచి పాత్రలు పోషించాను. దర్శకుడిగా, నిర్మాతగా శివాజీ రాజాతో అల్లరి పెళ్ళాం. కృష్ణ, సుమన్ తో సర్దార్ పాపన్న, తమిళ హీరో అరుణ్ పాండ్యన్, ఉదయభాను (యాంకర్ ) జంటగా ది లాకప్ చేశాను.

**ప్రశ్న : మీ నలభై ఏళ్ళ సినీ జీవితంలో చూసిన ఒడిదుడుకులు ఏంటి?**

**ఆర్.కె.గౌడ్ :** చాలా ఉన్నాయి . రెండు వందల యాభై సినిమాలు డిస్ట్రిబ్యూషన్ చెయ్యడం అంటే మాములు విషయం కాదు. ఇండస్ట్రీలో ఉన్న ఉద్దండులను తట్టుకోవాలి. థియేటర్లు పట్టుకోవాలి. ఒక్కోసారి థియేటర్లు దొరక్క ఇబ్బందులు పడ్డాను. ఆర్థికంగా కూడా నష్టపోయాను. మళ్ళీ నిలదొక్కుకున్నాను.

**ప్రశ్న : మీరు డిస్ట్రిబ్యూషన్ చేస్తున్న టైం లో రెంటల్ సిస్టం ఉండేనా? పర్సంటేజ్ ఉండేనా?**

**ఆర్.కె.గౌడ్ :** అప్పట్లో దాదాపుగా అన్ని సినిమాలు పర్సంటేజ్ సిస్టంతోనే ఆడేవి. పర్సంటేజ్ విధానంలో సినిమాలు రిలీజ్ అయినప్పుడు నిర్మాతకు, డిస్ట్రిబ్యూటర్ కు అందరికి లాభం జరిగేది. రెండువేల ఒకటి తరువాత ఎప్పుడైతే రెంటల్, లీజ్ విధానం వచ్చిందో అప్పటి నుంచి సర్వనాశనం అయింది. ఈ లీజ్ విధానం రావడానికి కారణం సురేష్ బాబు . డైరెక్ట్ గా థియేటర్ యజమానితో లీజ్ అగ్రిమెంట్ కుదుర్చుకుంటే నిర్మాతకు వచ్చెనష్టమేమి లేదు. కానీ మధ్యలో ఈ సురేష్ బాబు లాంటి వాళ్ళు మీడియేషన్ చేసి ఇటు థియేటర్ ఓనర్‌కు, అటు నిర్మాతకు ఇద్దరికీ నష్టం చేకూరుస్తున్నారు. మొత్తం థియేటర్స్ అన్ని 'సురేష్ బాబు, అల్లు అరవింద్, సునీల్ నారంగ్, దిల్ రాజు ఈ నలుగురు చేతుల్లోనే ఉన్నాయి. ఇప్పుడిప్పుడే మైత్రి ముందుకొస్తున్నారు.

**ప్రశ్న : రీల్ ప్రస్థానంలో నిర్మాత పడుతున్న కష్టాలేంటి?**

**ఆర్.కె.గౌడ్ :** సినిమా మొదలు పెట్టిన రోజు నుంచి విడుదల అయ్యే వర కు కూడా అందరి గురించి ఆలోచించే వ్యక్తి నిర్మాత. కానీ డబ్బు పెట్టె ని ర్మాత గురించి ఎవ్వరూ ఆలోచించారు. డిజిటల్ విధానం అమలు జరుగుతున్న తరుణంలో మన సినిమా పెద్దలే దీన్ని కూడా లీజ్ తీసుకున్నారు. కేవలం ఏడేళ్లు మాత్రమే నామినల్ గా డబ్బులు తీసు కుంటాము, తరువా త ఫ్రీ అని చెప్పారు. ముంబై , చెన్నై వంటి మహా నగరాల్లో వారానికి రెం డు వేల అయిదు వందల నుంచి మూడు వేలు అమౌంట్ తీసుకుంటున్నారు. కానీ తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లో మాత్రం వారానికి పది వేల నుంచి పదిహేను వేల వరకు డబ్బులు రెంట్ రూపంలో వసూలు చేస్తున్నారు.

**ప్రశ్న : తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఏర్పాటు చెయడానికి ప్రధాన కారణమేంటి?**

**ఆర్ కె గౌడ్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నేను అనేక రకాల వివక్షను ఎదుర్కొన్న. తెలంగాణ రాష్ట్రము ఏర్పడిన తరువాత మన ఛాంబర్ మనకు ఉండాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ ఫిలిం ఛాంబర్ అఫ్ కామర్స్ ఏర్పాటు చేశాను. ముఖ్యంగా తెలంగాణాలో కళాకారులు ఎక్కవ. తెలంగాణ నుంచి నటీనటులు, రచయితలు ఇండస్ట్రీకి రావాలంటే వారికీ సరైన మార్గం లేదు. కాబట్టి తెలంగాణ ఫిలిం ఛాంబర్ వారికీ ఒక వేదిక అయింది. అనేక మంది నటీనటులను తెరకు పరిచయం చేశాం. టెక్నీషియన్స్ కు అవకాశాలు లభిస్తున్నాయి. తెలంగాణాలో ఉన్న న్యూ టాలెంట్ ను బయటికి తీసుకొస్తున్నాం. ఇలా ఇరవై నాలుగు విభాగాలు తెలంగాణ ఫిలిం ఛాంబర్ పరిధిలో ఉన్నాయి. మన ఛాంబర్ లో మెంబర్ షిప్ తీసుకున్న వాళ్లకు హెల్త్ ఇన్సూరెన్స్ కూడా ఇస్తున్నాము. బ్యానర్ రిజిస్ట్రేషన్ దగ్గరి నుంచి మొదలు కొని సెన్సార్ పనులు పూర్తి అయ్యే వరకు సినిమాకు ఛాంబర్ సహకారం అందిస్తుంది. ఇటీవలే షార్ట్ ఫిలిం ఫెస్టివల్ 2026 నిర్వహించాం. విజేతలకు అమౌంట్ కూడా బహుమతి రూపంలో ఇచ్చాము. జ్యూరీ చైర్మన్ గా సీనియర్ నటి ఇంద్రజను నియమించాం. ఈ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ప్రతి ఏడాది నిర్వహిస్తాం. మా ఛాంబర్ ద్వారా నిర్మించే సినిమాల్లో కొత్త వాళ్లకు ఛాన్స్ ఇస్తున్నాము.

**ప్రశ్న : సినిమాలు తీయని నిర్మాతలే ఎక్కువ మంది ఉన్నారని ప్రచారం? నిజమేనా?**

**ఆర్.కె.గౌడ్ :** మీరన్నది నిజమే కావొచ్చు కానీ ఒక వ్యక్తి సినిమా తీద్దామని తెలుగు ఫిలిం ఛాంబర్ లో కానీ, తెలంగాణ ఫిలిం ఛాంబర్ లో గాని బ్యానర్ రిజిస్ట్రేషన్ చేసి సినిమా తీస్తారు. ఏ రియల్ ఎస్టేట్ లేదా ఎదో వ్యాపార రంగం నుంచి వచ్చి సినిమా తీసిన తరువాత చాలా మంది మొదటి సినిమా ఫెయిల్యూర్ చూస్తారు. ఆ తరువాత అతను సినిమా తియ్యడు. కానీ ఛాంబర్ లో మెంబర్ షిప్ అలాగే ఉంటుంది. అందుకే మీకు ఎక్కువ మంది సినిమాలు తియ్యని నిర్మాతలు కనిపిస్తారు. ఈ రెండు ఛాంబర్ లోనే కాదు గిల్డ్ లో కూడా అందరు నిర్మాతలు సినిమాలు తియ్యడం లేదు. గిల్డ్ లో ఉన్నది కూడా ఇరవై , ఇరవై అయిదు మందే . మరి వాళ్ళు కూడా అందరూ సినిమాలు తియ్యడం లేదు.

**ప్రశ్న : తెలంగాణ సినిమా ఏర్పడాల్సిన అవసరం ఉందంటారా?**

**ఆర్.కె.గౌడ్ :** ఖచ్చితంగా తెలంగాణ సినిమా అనేది సపరేట్ గా ఉండాలి. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో కూడా సినిమాకు సంబంధించి రెండు ఎఫ్ డీ సి లు సపరేట్ గా ఉన్నాయి కదా. అలాంటప్పుడు సినిమా కూడా సపరేట్ గా ఉండాలి. అయితే తెలంగాణాలో కానీ, ఆంధ్రపదేశ్ లో కానీ సినిమా రంగానికి ఒక ప్రత్యేకమైన రాయితీ ప్రభుత్వాలు ప్రకటించాలి. ముఖ్యంగా తెలంగాణలో సినిమా రంగం అభివృద్ధి చెందాలంటే సబ్సిడీ ప్రకటనతో పాటు సినిమా రంగం అభివృద్ధిపై ప్రభుత్వం ఒక స్పష్టమైన పాలసీని ప్రకటించాలి. అప్పుడు తెలంగాణ సినిమా రంగం కూడా డెవెలప్ అవుతుంది. మధ్య ప్రదేశ్ రాష్ట్రములో షూటింగ్ చేస్తే సబ్సిడీ ఇస్తున్నారు. ఇలా చాలా రాష్ట్రాలు ఇస్తున్నాయి. మన తెలంగాణ కూడా సబ్సిడీ ప్రకటించాలి. రాయితీలు ఇవ్వాలి. వసతులు కల్పించాలి. ఇలా చేస్తేనే తెలంగాణాలో సినిమా ఇండస్ట్రీ డెవెలప్ అవుతుంది. చెయ్యాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

## వామపక్షాల కన్నెర్ర

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలు,వేలాదిగా తరలి వచ్చిన పేదలు బైఠాయించారు. తమకు ఇళ్ళ స్థలాల పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని, ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. వామపక్ష కార్యకర్తలు, పేదల నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఈ క్రమంలో అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్న పోలీసులు రోడ్డుపై బైఠాయించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ సహా వామ పక్ష రాష్ట్ర, జిల్లా నాయకులను బలవంతంగా అరెస్టు చేశారు. కూనంనేని సాంబశివరావు, ఇతర నాయకుల అరెస్టులను వామ పక్ష పార్టీల కార్యకర్తలు పెద్ద ఎత్తున అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులకు, వామపక్ష పార్టీల కార్యకర్తలకు తీవ్ర తోపులాట జరిగింది. అరెస్టులను నిరసిస్తూ పోలీసుల వాహనాలను అడ్డుకోవడంతో పాటు అరెస్టులకు నిరసనగా ప్రధాన రహదారిపై కార్యకర్తలు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు పేదలను ఉద్దేశించి మాట్లాడుతూ పేదల ఇళ్ళ స్థలాల సాధన పోరాటం పోరాటాల గడ్డ అయిన వరంగల్ నుండే ప్రారంభిస్తున్నామని, ఇది రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ప్రభుత్వం దిగి వచ్చే వరకూ కొనసాగుతుందని అన్నారు. కమ్యూనిస్టులు నిరంతర పేదల పక్షానే నిలబడుతారని, విద్యుత్ ఉద్యమ స్ఫూర్తితో పేదల ఇళ్ళ స్థలాల సాధన పోరాట కొనసాగిస్తామని హెచ్చరించారు. అధికారులు, ప్రభుత్వం పేదల పై కక్ష కట్టడం మానుకోవాలని, పెద్ద పెద్ద భూకబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులపై దృష్టి సారించాలని సూచించారు. హనుమకొండలోని గుండ్ల సింగారంలో, గోపాల్ పూర్ లో ప్రభుత్వ భూమి దేనికి ఉపయోగ పడుతుందని పేదల ఇళ్ళు కూల్చి వేశారని ప్రశ్నించారు. కూల్చివేతలను అధికారులపై నెట్టి వేయడం సరికాదని, అధికారులు కూల్చి వేస్తుంటే ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పేదలకు న్యాయం జరిగే వరకు ఎర్ర జెండా పార్టీలన్నీ ఏకమై అండగా ఉంటాయని, ప్రభుత్వం తక్షణమే గుడిసె వాసులందరికీ ఇళ్ళ పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్నీ వామపక్షాలు కలిసి ఒకే జెండాగా ముందుకు సాగి ఇళ్ళ పట్టాలు సాధించే వరకు విశ్రమించేది లేదని అన్నారు. జూలై 1న హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టరేట్ ల ముందు పికెటింగ్ నిర్వహించి, జూలై 6న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద రాష్ట్ర స్థాయిలో భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ధర్నా అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తులు సమర్పిస్తామని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ గుడిసెలు కూల్చివేసిన ప్రాంతంలోనే తిరిగి ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు నివాస స్థలాలు లేక, కిరాయిలు కట్టలేక ప్రభుత్వ భూములలో 50 గజాల స్థలంలో గుడిసెలు వేసుకుంటే కూల్చి వేయడం సరికాదని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీనే అమలు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. మొన్న ఖమ్మంలో, నేడు వరంగల్ లో గుడిసెలు కూల్చివేసిన ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకుంటే ఈ ప్రభుత్వాన్నే పేదలు కూల్చి వేస్తారని హెచ్చరించారు. పేదల కోసం తాము ఎంతకైనా తెగించి పోరాడుతామని, తీవ్రమైన పోరాటాలకు కూడా సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంకా ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ ఎంఎల్ (మాస్ లైన్) మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడగా సిపిఐ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె బిక్షపతి, షేక్ బాష్ మియా, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేశ్, ఆదరి శ్రీనివాస్, తోట బిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు దండు లక్ష్మణ్, మద్దెల ఎల్లేష్, సిపిఎం హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు జి. ప్రభాకర్ రెడ్డి, సిహెచ్ రంగయ్య, నాయకులు ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, సింగారపు బాబు, వీరన్న, ఎం సీపీఐ(యూ) జిల్లా కార్యదర్శులు ఎన్ రెడ్డి హంసారెడ్డి, పెద్దారపు రమేష్, మాలోతు సాగర్, గడ్డం నాగార్జున, న్యూడెమక్రసి జిల్లా కార్యదర్శి నున్నా అప్పారావు. కొత్తపల్లి రవి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.







## వాతావరణ మార్పుతో పెరుగుతున్న జీవన వ్యయం



**న్యూఢిల్లీ:** వాతావరణ మార్పు అనేది కేవలం భవిష్యత్తులో ఎదురయ్యే పర్యావరణ సమస్య మాత్రమేగాక, భారతదేశ ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తున్న ఆర్థిక సమస్యగా కూడా మారింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అనిశ్చిత వర్షపాతం, కరువులు, వరదలు, వేడి తరంగాలు ప్రజల జీవన వ్యయాన్ని గణనీయంగా పెంచుతున్నాయి. ముఖ్యంగా పేదలు, రైతులు, అసంఘటిత రంగ కార్మికులు ఈ ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ రంగం వాతావరణ మార్పుకు అత్యంత సున్నితమైనది. అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం, అనియంత్రిత రుతుపవనాల వల్ల పంట దిగుబడులు తగ్గుతున్నాయి. ఫలితంగా ఆహార పదార్థాల ధరలు పెరుగుతున్నాయి. భారత వినియోగదారుల ధరల సూచీలో (సిపిఐ) ఆహార పదార్థాల వాటా దాదాపు 46 శాతం ఉండటంతో, వ్యవసాయ రంగంలో ఏర్పడే ఏ సంక్షోభమైనా నేరుగా ద్రవ్యోల్బణాన్ని పెంచుతోంది. అదేవిధంగా, వేడి తరంగాల కారణంగా విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ఎయిర్ కండిషనర్లు, ఫ్యాన్లు, కూలర్ల వినియోగం అధికమవడంతో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుతోంది. ఈ అదనపు భారాన్ని విద్యుత్ సంస్థలు వినియోగదారులపై అధిక ఛార్జీల రూపంలో మోపుతున్నాయి. దీంతో కుటుంబాల నెలవారీ ఖర్చులు పెరుగుతున్నాయి. నీటి కొరత కూడా మరో ప్రధాన సమస్యగా మారింది. భూగర్భ జలాలు తగ్గిపోవడం, వర్షపాతం అస్థిరంగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో నీటి కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది. పట్టణాల్లో ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడటం వల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. వాతావరణ మార్పు ఆరోగ్య సమస్యలను కూడా పెంచుతోంది. వేడి సంబంధిత వ్యాధులు, గాలి కాలుష్యం, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు పెరగడంతో వైద్య ఖర్చులు అధికమవుతున్నాయి. ముఖ్యంగా రోజువారీ కూలీలకు అనారోగ్యం అంటే ఆదాయం కోల్పోవడమే. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి వాతావరణ అనుకూల మౌలిక సదుపాయాలు, హరిత బడ్జెట్ విధానాలు, రైతులకు మెరుగైన బీమా, వేడి తరంగాలపై చట్టబద్ధ రక్షణ, నీటి నిర్వహణ సంస్కరణలు అవసరం. వాతావరణ న్యాయం, సామాజిక సమానత్వం, సుస్థిర అభివృద్ధిని కలిపి ముందుకు సాగినప్పుడే భారతదేశం ఈ సవాలును సమర్థంగా ఎదుర్కోగలదు.

## ఆరెంజ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూ డెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్– మల్కాజిగిరి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆదివారం నుంచి గురువారం వరకు కూడా రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగనున్నాయన్నారు. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ తదితర జిల్లాలకు పలు దఫాల్లో భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. బుధ, గురువారాల్లో మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు.

**హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన**

రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్‌లో శనివారం మధ్యాహ్నం తర్వాత వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని తేలికపాటి జల్లులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సాయంత్రం తర్వాత వర్షాల తీవ్రత పెరిగి, రాత్రి సమయంలో నగరంలో భారీ వర్షం కురిసే అవకాశముందన్నారు. వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీటిమునిగే పరిస్థితులు, ప్రధాన రహదారులపై ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే అవకాశమున్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు.

## రాజకీయ లబ్ధికే

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రక్రియ గతంలో కాంగ్రెస్ హయాంలోనూ జరిగిందని, ఇది ఏ ప్రభుత్వానికో, పార్టీకో సంబంధించింది కాదని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, డూప్లికేట్, చనిపోయిన వారి పేర్లను తొలగించడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు దీనిపై ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో రోహింగ్యాలు, అక్రమ వలసదారులకు ఓటర్ ఐడిలు, రేషన్ కార్డులు ఉన్నాయనే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని, జాబితా శుద్ధిని అడ్డుకోవడం బాధ్యతారాహిత్యమన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా కొన్ని వర్గాలను రెచ్చగొట్టడం, పాతబస్తీలో ఎంఐఎం నాయకులు బిఎల్‌ఓలను బెదిరించడం ప్రమాదకర ధోరణి అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు బిజెపి అండగా ఉంటుందని కిషన్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ ప్రక్రియకు, సంక్షేమ పథకాలకు లేదా పౌరసత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మకుండా, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బిజెఎల్పి నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎదుర్కోవాలి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి గోదావరి వరదల సన్నద్ధతపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలినోవో ప్రభావంత్ వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రతీశాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధునిక సాంకేతికను వినియోగించుకుని ఎలాంటి ప్రాణ, ఆస్థి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు ఇప్పట్నుండే అవసరమైన మందులను సిద్దంగా ఉంచుకోవాలని సూచించారు. భద్రాచలం పట్టణంలోకి గోదావరి వరదనీరు చేరకుండా వర్షపునీరు వేగంగా నదిలోనికి పంపేలా పంపింగ్ మోటార్లను సిద్దం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వన మహోత్సవంలో భాగంగా జాతీయ రహదారి వెంట పెద్ద ఎత్తున మొక్కలను నాటాలన్నారు. ఐటిసి పిఎస్‌పిడి ఈస్ట్ గేట్ సమీపంలో గోదావరి వరద సమయంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నందున ఆ ప్రాంతంలో జాతీయ రహదారి ఎత్తును పెంచేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం ఆర్డీఓ మధు, తదితరులు పాల్గొన్నారు.

**కరకట్ట విస్తరణ పనులు వేగవంతం చేయాలి**

గోదావరి వరద 70 అడుగులకు మంచి వచ్చినా పట్టణంలోనికి వరదనీరు చేరకుండా కరకట్ట విస్తరణ పనులు సంబంధిత శాఖలు సమన్వయంతో వేగవంతం చేసి పూర్తయ్యేలా చూడాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంజనీరింగ్, నేషనల్ హై వే అధికారులను ఆదేశించారు. శనివారం కూనవరం రోడ్‌లో నూతన నిర్మాణ దశలో ఉన్న కరకట్ట పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. రానున్న గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు చేయాలన్నారు. వరద సమయంలో ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం,పినపాక ఎంఎల్‌ఏలు డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, ఐటిడిఏ పిఓ రాహుల్, సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ, నీటిపారుదల జాతీయరహదారి ఇంజనీర్లు, ఇతర శాఖల అధికారులు తదితర్లు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com